
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 280

శనివారం 31-12-2022


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

న్యూ ఇయర్ కు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో అదనంగా 10% వరకు డిస్కౌంట్ లభించడం వలన కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంది. ఇంకా తేలికగా అందుతున్న ఫైనాన్స్ ఫెసిలిటీ ఆకర్షణీయంగా ఉంది.



Happy New Year 2023
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ తో...
సోనోవిజన్ న్యూ ఇయర్ సేల్
Lowest Prices GUARANTEED Best Service
LG Life's Good 190 Cm (75") UHD LED
EMI : 3999/-
SAMSUNG 165 Cm (65") QLED
EMI : 3990/-
LG Life's Good 139 Cm (55") OLED
EMI : 3999/-
SAMSUNG 139 Cm (55") 4K Smart LED
EMI : 1990/-
SONY 138 Cm (55") Ultra HD 4K Anroid
EMI : 2995/-
SONY 108 Cm (43") 4K Anroid
EMI : 1850/-
LG Life's Good 108 Cm (43") 4K Smart LED
EMI : 1999/-
Panasonic 108 Cm (43") Smart LED
EMI : 1459/-
SAMSUNG 80 Cm (32") Smart LED
EMI : 990/-
LLOYD 108 Cm (43") Smart LED
EMI : 1890/-
TCL 80 Cm (32") Smart LED
EMI : 1000/-
SONY Sound Bar
EMI : 1044/-
LG Life's Good Side by Side 694 Ltrs Refrigerator FREE Small Refrigerator
EMI : 13,540/-
SAMSUNG Side by Side 700 Ltrs Refrigerator
EMI : 7234/-
Whirlpool Frost Free Double Door 260 Ltrs Refrigerator
EMI : 2223/-
VOLTAS beko Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1050/-
Haier 256 Ltrs BMR Refrigerator
EMI : 2267/-
LLOYD Frost Free Double Door 276 Ltrs Refrigerator
EMI : 1991/-
Haier Side by Side 682 Ltrs Refrigerator
EMI : 5250/-
LLOYD Side by Side 590 Ltrs Refrigerator
EMI : 4792/-
SAMSUNG Frost Free Double Door 253 Ltrs Refrigerator
EMI : 2079/-
Godrej Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1294/-
LG Life's Good Direct Cool Single Door 215 Ltrs Refrigerator
EMI : 1559/-
Haier Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1025/-
Chest Freezer 230 Ltrs
EMI:1700/-
LG Life's Good Front Load Washing Machine 10.5 KGS
EMI : 5667/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS
EMI : 3500/-
BOSCH Front Load Washing Machine 6 KGS
EMI : 2475/-
IFB WDR Front Load Washing Machine 6 KGS
EMI : 2050/-
Whirlpool Front Load Washing Machine 7 KGS
EMI : 2667/-
LG Life's Good Top Load Washing Machine 7.5 KGS
EMI : 1542/-
SAMSUNG Top Load Washing Machine 7 KGS
EMI : 1559/-
BOSCH Top Load Washing Machine 6.5 KGS
EMI : 1459/-
IFB Top Load Washing Machine 6.5 KGS
EMI : 1642/-
Whirlpool Top Load Washing Machine 7.0 KGS
EMI : 1475/-
LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS
EMI : 767/-
LG Life's Good 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY
Starting EMI : 2917/-
SAMSUNG
Starting EMI : 2917/-
VOLTAS
Starting EMI : 2875/-
LLOYD
Starting EMI : 2875/-
HITACHI
Starting EMI : 2917/-
DAIKIN
Starting EMI : 3250/-
Convection Microwave Oven
Rs : 10,800/- Onwards
Microwave Oven
Rs : 5800/- Onwards
Chimney
Rs : 7100/- Onwards
2 Burner Glass Manual Gas Stove
Rs : 2700/- Onwards
Water Dispenser
Rs : 8200/- Onwards
Water Purifier RO
Rs : 13200/- Onwards
Water Geyser
Rs : 3300/- Onwards
Wet Grinder
Rs : 3200/- Onwards
Rice Cooker
Rs : 1700/- Onwards
Mixer
Rs : 2700/- Onwards
* T & C Apply
LG SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton orient KEELINE AO Smith hp vivo oppo iPhone ONEPLUS ONIDA mi morphy richards
Happy New Year 2023
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ తో...
సోనోవిజన్ న్యూ ఇయర్ సేల్
Lowest Prices GUARANTEED Best Service


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 280

శనివారం 31-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అల్విదా పీలే...

అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో తన శకం లిఖించిన బ్రెజిల్ దిగ్గజం పీలే ఇక లేడు. మూడుసార్లు బ్రెజిల్‌ను విశ్వవిజేతగా నిలిపిన ఈ సాకర్ కింగ్ గురువారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచాడు. సావో పాలోలోని అల్బర్ట్ ఐన్‌స్టీన్ హాస్పిటల్‌లో పీలే(82) కన్ను మూశాడు. జనవరి 3న అంత్యక్రియలు నిర్వహించనున్నారు. గతేడాది పెద్దపేగు క్యాన్సర్ బారిన పడిన పీలే అప్పటి నుంచి పోరాటం చేస్తున్నాడు.

10లో



పంత్‌కు పెను ప్రమాదం

కారు ప్రమాదంలో భారత క్రికెటర్ రిషబ్ పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

వివరాలు 10లో ▸



సూకీకి మరో ఏడేళ్ల జైలు

అవినీతి కేసులో మయన్మార్ పదవీచ్యుత నేత అంగ్ సాన్ సూకీ(77)కి మరో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

వివరాలు 6లో ▸



అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలు

దక్షిణ చైనా సముద్రంపై అమెరికా నిఘా విమానాన్ని చైనా యుద్ధ విమానం దాదాపుగా ఢీ కొట్టబోయింది.

వివరాలు 6లో ▸




మరింతగా ద్వైపాక్షిక సహకారం

రష్యా, చైనా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయానికొచ్చారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

జాతి భద్రతలో రాజీ పడబోం



భారతదేశం పొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలనే కొనసాగించాలని కోరుకుంటుందని, అదే సమయంలో జాతీయ భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

వివరాలు 6 ▸

పులుల కదలికలపై నిఘా..



అటవీ డివిజన్లలో పులుల కదలికలపై నిఘా ఉంచామని, ఇందుకోసం ట్రాకింగ్ టీంల ఏర్పాటు చేస్తున్నామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. ఒడిశా నుంచి ఓ ఆడ, మగపులి వచ్చాయని, అవి రాజమండ్రి అటవీ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు.

వివరాలు 5 ▸

3 నియోజకవర్గాల్లో 9 లక్షలకు పైగా పట్టభద్రులు



త్వరలో ఎన్నికలు జరిగే 5 ఎమ్మెల్సీ స్థానాలకు తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 3 పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల్లో 9,96,393 మంది, 2 టీచర్ల స్థానాల్లో 54,681 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

వివరాలు 5 ▸



అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో శుక్రవారం జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

రాజకీయమంటే..

డైలాగులు, డ్రోన్ షాట్లా?

చంద్రబాబుపై నర్సీపట్నం బహిరంగ సభలో సీఎం జగన్ ధ్వజం

- రాజకీయమంటే పేదల స్థితిగతులను మార్చి గుండెల్లో గూడు కట్టుకోవడం
- బాబు సభలకు జనం వచ్చారని చూపేందుకు దుష్టచతుష్టయం తాపత్రయం
- జనం రాకపోయినా వచ్చారని చూపేందుకు ఇరుకు సందులోకి నెట్టారు
- వాహనాన్ని అటు మళ్లించి 8 మందిని చంపేశారు.. ఇంత ఘోరమా?
- రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ, అనుబంధంగా నర్సింగ్ కళాశాల, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- రూ.470 కోట్లతో ఏలేరు, తాండవ రిజర్వాయర్ల అనుసంధానం
- రూ.16.60 కోట్లతో నర్సీపట్నం అభివృద్ధి పనులకు శంకుస్థాపన

2లో



సీఎం సభ సూపర్ సక్సెస్ 2లో

"మొన్న ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. ఫోటో షూట్, డ్రోన్ షాట్ కోసం.. జనం రాకపోయినా బాగా వచ్చారని చూపెంచడం కోసం ఒక చిన్న సందులో, గొందిలో, ఇరుకు రోడ్డులో జనాన్ని నెట్టారు. తన వాహనాన్ని అటుగా తీసుకెళ్లి 8 మందిని చంపేశారంటే ఇంతకంటే ఘోరం ఎక్కడైనా ఉంటుందా? ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి? గతంలో ఈ పెద్ద మనిషి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోదావరి పుష్కరాల సమయంలోనూ ఇలాగే చేశారు. షూటింగ్ కోసం, డ్రోన్లతో షాట్ కోసం ఓ దర్శకుడ్ని పక్కన పెట్టుకున్నారు. ఆ రోజు అంతే. గేట్లన్నీ మూసేసి మనుషులందరినీ ఒక్క గేటు నుంచే బయటకు వదిలారు. ఆ రోజు కూడా షూటింగ్ కోసం ఈ పెద్దమనిషి అక్షరాలా 29 మందిని చంపేశాడు."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గుంటూరు జిల్లా కాజా వద్ద ఏపీ న్యాయాధికారుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్



రాబోయే రోజుల్లో మహిళలదే న్యాయ వ్యవస్థ

- ఇప్పటికే పురుషులతో సమానంగా వారున్నారు
- కిందిస్థాయి న్యాయవ్యవస్థను తక్కువగా చూడటం మానుకోవాలి
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్
- ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు రూపొందించిన యాప్‌లు ప్రారంభం

7లో

ప్రధాని మోదీకి మాతృవియోగం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన హీరాబెన్
- తల్లి పాడె మోసిన ప్రధాని మోదీ,
- వెల్లువెత్తిన సంతాప సందేశాలు

6లో



తల్లి హీరాబెన్ పాడె మోస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

రోజు విడిచి రోజు విధానంలో ఆరు పేపర్ల పరీక్షలు

- ఏప్రిల్ 18న చివరి పరీక్ష
- ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–1 కాంపోజిట్ కోర్సు మినహా అన్ని పేపర్లు 100 మార్కులకు
- 70 మార్కులకు ఎస్‌ఎస్‌సీ వొకేషనల్ థియరీ పరీక్ష.. ఇప్పటికే 6,60,859 మంది దరఖాస్తు
- రూ.500 ఫైన్‌తో జనవరి 9 వరకు ఫీజు చెల్లింపు గడువు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2023 ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభం కానున్నాయి. రోజు విడిచి రోజు ఒక పేపర్ చొప్పున మొత్తం ఆరుపేపర్ల పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 18వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఈ పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విడుదల చేశారు. ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో గతంలో 11 పేపర్లకు పరీక్ష నిర్వహించేవారు. కరోనా సమయంలో ఆ పేపర్లను ఏడింటికి కుదించారు. ఏడు పేపర్లలో సైన్సును ఫిజికల్ సైన్సు, నేచురల్ సైన్సు కింద రెండు పేపర్లను 50 మార్కుల చొప్పున నిర్వహించేవారు. తరువాత మళ్లీ సైన్సులోని రెండు పేపర్లను కూడా ఒకే పేపర్‌గా చేస్తూ టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆరింటికి ప్రభుత్వం కుదించింది. 2022–23 విద్యా సంవత్సరం నుంచి ఆరు పేపర్లలోనే పరీక్షలు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఎస్‌ఎస్‌సీ బోర్డు పరీక్షలను ఆరు పేపర్లకు పరిమితం చేసింది. గతంలో టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి పబ్లిక్ పరీక్ష పేపర్లను 80 మార్కులకు నిర్వహించేవారు. ఇంటర్నల్ మార్కుల్లో

మిగతా 7వ పేజీలో ▶

'ధర'హాసం

- రైతులకు ఎమ్మెస్పీ కంటే మిన్నగా మార్కెట్ రేట్లు
- ధరలు తగ్గిన ప్రతిసారీ మార్కెట్‌లో ప్రభుత్వం జోక్యం
- వ్యాపారుల మధ్య పోటీ పెరిగేలా తక్షణమే పంట కొనుగోలు
- ఇందుకోసం ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- ఈ ఏడాది పత్తి, వేరుశనగ, మిరప, మినుము పంటలకు రికార్డు స్థాయిలో ధర

9లో



ధాన్యం రైతుకు డబ్బులు

- రూ.1,096.52 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు 18.52 లక్షల టన్నుల సేకరణ
- 2.84 లక్షల మంది రైతులకు రూ.2,924.53 కోట్లు చెల్లింపు


9లో



శభాష్.. హంపి

- ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
- ఊహకందని ఆటతీరుతో అదరగొట్టిన భారత మహిళా చెస్ స్టార్
- బ్లిట్జ్ విభాగంలో రజతం రూపంలో తొలిసారి పతకం సాధించిన హంపి

10లో



నాడు-నేడు పనుల్లో భద్రత ముఖ్యం


ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలి

- రూ.8 వేల కోట్లతో 22,344 స్కూళ్లలో అభివృద్ధి పనులు
- తవ్వకాలు, భవనాల కూల్చివేతల సమయంలో ముందు జాగ్రత్తలు
- పాఠశాల లేని సమయాల్లో వ్యర్థాల తొలగింపు.. ప్రమాదాల నివారణకు బోర్డులు ఏర్పాటు చేయాలి
- కార్మికులు హెల్మెట్లు ఇతర భద్రతా పరికరాలు ధరించాలి.. ప్రమాదాలు జరిగినా నిష్క్రమణ మార్గాలుండాలి
- అధికారులకు ఇన్‌ఫ్రా కమిషనర్ మార్గదర్శకాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు–నేడు కార్యక్రమంలో చేపట్టే నిర్మాణ పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కాటమనేని భాస్కర్ అధికారులకు

మిగతా 9వ పేజీలో ▶



డ్రాఫ్ట్ ట్యూబ్ అమరిక పనులు ప్రారంభం

పోలవరం రూరల్: ఏలూరు జిల్లాలోని పోలవరం జలవిద్యుత్ కేంద్రం డ్రాఫ్ట్ ట్యూబ్ బిగించే పనులకు అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఏపీ జెన్‌కో, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు, అధికారులు పనులను ప్రారంభించారు. విద్యుత్ కేంద్రం తొలి యూనిట్‌లో డ్రాఫ్ట్ ట్యూబ్ బిగింపు పనులు చేపట్టారు. ఈ విద్యుత్ కేంద్రంలో 12 యూనిట్లున్నాయి. 960 మెగావాట్ల సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. పోలవరానికి వచ్చే నీరు విద్యుత్ కేంద్రంలోని టర్బయిన్లపై పడుతుంది. టర్బయిన్ తిరగడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దీనికి వినియోగించిన నీటిని బయటకు పంపేందుకు డ్రాఫ్ట్ ట్యూబ్‌ను ఉపయోగిస్తారు.

క్లుప్తంగా...

హీరాబెన్ మృతికి గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరాబెన్ (100) మృతిపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రధానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. హీరాబెన్ తన కుమారుని రూపంలో భారతమాతకు ముద్దుబిడ్డను అందించారన్నారు. ఇటీవలే ఆమె 99వ పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సోదరులు, ఇతర కుటుంబ సభ్యులకు గవర్నర్ ధైర్యం చెప్పారు. ఈ మేరకు శుక్రవారం రాజ్‌భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రధాని తల్లి హీరాబెన్ మృతికి సీఎం సంతాపం

సాక్షి,అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరాబెన్ మృతి పట్ల సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హీరాబెన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని శుక్రవారం ఒక ప్రకటనలో సీఎం పేర్కొన్నారు.

ప్రముఖుల నివాళి

సాక్షి, అమరావతి/సీతంపేట (విశాఖ ఉత్తర)/సింహాచలం (పెందుర్తి): ప్రధానమంత్రి మోదీ మాతృమూర్తి హీరాబెన్ మృతిని పురస్కరించుకుని విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నేతలు సంతాపం సభ నిర్వహించారు. హీరాబెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ..'విశ్వం మెచ్చిన ధీరోదాత్తమైన నాయకుడికి జన్మనిచ్చిన తల్లిగా మీ ప్రస్థానం మాకు చిరస్మరణీయం' అని కొనియాడారు.

వీరమాత హీరాబెన్ : పవన్‌కళ్యాణ్
విలక్షణమైన నాయకత్వపటిమ, మెండుగా దేశ భక్తి కలిగిన ప్రధాని నరేంద్ర మోదీ వంటి కుమారునికి జన్మనిచ్చిన హీరాబెన్ వీరమాతగా నిలిచిపోతారని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో కొనియాడారు.

ఆత్మకు శాంతి చేకూరాలి: విజయేంద్ర సరస్వతి
దేశానికి ఒక మహత్తరమైన ఆణిముత్యం లాంటి ఉక్కు మనిషిని అందించిన మాతృమూర్తి హీరాబెన్ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆదర్శ జీవితం: స్వరూపానందేంద్ర
ప్రధాని మోదీ మాతృమూర్తి హీరాబెన్ జీవితం ఆదర్శనీయమని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు.

మహానుభావుడు జగన్



మిత్రులారా.. మనమంతా మెట్ట ప్రాంత వాసులం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన కాళ్ళ కింద ఏలేరు పారుతున్నా తాగడానికి గుక్కెడు నీరు లేదు. సాగు భూమి లేదు. వ్యవసాయం లేదని రైతులు వలసపోతున్నారు. అలాంటి సమయంలో తాండవ ప్రాజెక్ట్ గురించి నేను, దాడిశెట్టి రాజా, ఉమాశంకర్ గణేష్, ఇతర ఎమ్మెల్యేలందరం కలిసి సీఎంకి విజ్ఞప్తి చేశాం. ఒకే ఒక మాట చెప్పాం. ఇప్పటి వరకూ మనల్ని ఎవరూ పట్టించుకోలేదన్నాం. అంతే.. సీఎం జగన్ స్పందించారు. ఇప్పుడు ఏలేరు, తాండవ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి ముందుకు వెళుతున్న సీఎం జగన్‌కు సెల్యూట్. మాటతప్పని మహానుభావుడికి థాంక్యూ.

– ఆర్.నారాయణమూర్తి, సినీనటుడు

సీఎంకు ధన్యవాదాలు



గుడ్ మార్నింగ్, యంగ్, డైనమిక్ సీఎం. ఐదు కోట్ల ఏపీ ప్రజల గుండె చప్పుడు మీరు. అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా మారింది. ఇక్కడ ప్రతి ఇంటిలో నవరత్నాల పథకాల వల్ల లబ్ధి కలుగుతోంది. డాక్టర్ కావాలన్న నా కల. కానీ మాలాంటి ఏజెన్సీ, గ్రామీణ విద్యార్థులకు అది తీరని కలగా ఉంది. మీరు ఇక్కడ మెడికల్ కాలేజ్ నిర్మాణం చేపట్టడంతో మా కల నెరవేరబోతుంది. థాంక్యూ సోమచ్ జగన్ మామయ్యా.

– సీహెచ్.రేష్మ, ఇంటర్ సెకండియర్ (బైపీసీ), నర్సీపట్నం





నర్సీపట్నం సభా స్థలి బయట వేచి ఉన్న జన సందోహం, జనంతో ప్రాంగణం నిండిపోవడంతో గేట్ వద్ద నిలుచుని సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న అశేష జనవాహినిలో ఓ భాగం

రాజకీయమంటే.. డైలాగులు, డ్రోన్ షాట్లా?

చంద్రబాబుపై నర్సీపట్నం బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ధ్వజం



వివిధ పథకాలకు శంకుస్థాపనల అనంతరం సీఎం వైఎస్ జగన్‌తో ప్రజాప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: ''రాజకీయమంటే డ్రోన్ షాట్లు, డైలాగులు చెప్పడం కాదు.. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం! ప్రతి నిరుపేద కష్టాన్ని తీర్చి వారికి అండగా నిలవడం.. చంద్రబాబులా ప్రజలను వంచించేవారు రాజకీయ నాయకుడు కాదు..'' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకుంటూ తిరిగే చంద్రబాబు ఆయన మార్కు అభివృద్ధి పథకాన్ని ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. గత పాలకుల నిరాదరణకు గురైన ఉత్తరాంధ్రలోని నర్సీపట్నం నియోజకవర్గం రూపు రేఖలు ఇప్పుడు ప్రజల ప్రభుత్వం చేపడుతున్న భారీ కార్యక్రమాలతో మారనున్నాయని చెప్పారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం జోగినాథునిపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా బలిఘట్టం చేరుకున్న సీఎం జగన్ పార్టీ నేతలను కలిశారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నర్సీపట్నం మీదుగా సభా స్థలికి చేరుకున్నారు. దారి పొడవునా సీఎం జగన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. సభాస్థలి వద్ద ఏలేరు–తాండవ కాలువల అనుసంధాన ప్రాజెక్టుల బ్లూప్రింట్స్‌ని సీఎం పరిశీలించారు. అనంతరం నర్సీపట్నంలో 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల, అనుబంధ నర్సింగ్ కళాశాల, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.470 కోట్లతో ఏలేరు, తాండవ కాలువల అనుసంధానం, నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో రూ.16.60 కోట్లతో రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు.

నర్సీపట్నం రూపురేఖలు మారుస్తాం

నర్సీపట్నం అంటే ఏజెన్సీ ప్రాంతానికి గేట్‌వే. గత పాలకుల హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. అనారోగ్య బాధితులు రెండు గంటలు ప్రయాణించి విశాఖ చేరుకుంటే కానీ వైద్యం అందించలేని దుస్థితిలో తల్లడిల్లుతున్నా పట్టించుకోలేదు. ఈ రోజు ఈ ప్రాంతం రూపురేఖలను మార్చబోయే కార్యక్రమాలు చేస్తున్నాం. దాదాపు రూ.986 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులు నర్సీపట్నంలో మొదలుపెడుతున్నాం. రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నాం. తద్వారా దాదాపు 150 మెడికల్ సీట్లు ఇక్కడ రానున్నాయి. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నాం.

మూడున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి

నర్సీపట్నంలో ఒక మెడికల్ కాలేజీ, పార్వతీపురంలో ఒక మెడికల్ కాలేజీ, పాడేరులో మరో వైద్య కళాశాల, విజయనగరంలో ఇంకోటి.. ఇవన్నీ కేవలం ఈ మూడున్నరేళ్లలో మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే అడుగులు పడుతున్నాయి. ఒక ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, వచ్చే నెలలో ఈ ప్రాంతంలోనే గిరిజన విశ్వవిద్యాలయాన్ని తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తున్నాం.

రైతుల కన్నీళ్లు తుడిచేందుకే..

తాండవ రిజర్వాయరు కింది 51,465 ఎకరాల ఆయకట్టుని పూర్తిగా స్థిరీకరించడంతో పాటు ఏలేరు ఎడమ ప్రధాన కాలువ కింద కొత్తగా మరో లిఫ్ట్ ఏర్పాటు చేసి మరో 5,600 ఎకరాలకు నీరు అందించే కార్యక్రమం చేపడుతున్నాం. ఏలేరు, తాండవ రిజర్వాయర్లని అనుసంధానం చేస్తున్న కాలువ అభివృద్ధికి మరో 6 లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఇలా దాదాపు రూ. 470 కోట్లకు సంబంధించిన ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తైంది. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కాకినాడ జిల్లాలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, తుని మండలాలతో పాటు అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, నాతవరం, కోటవురట్ల మండలాల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ ప్రాజెక్టు టెండర్లతో పాటు అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా పూర్తయ్యాయి. శరవేగంగా పనులు మొదలయ్యేలా సర్వే కూడా పూర్తి కావచ్చింది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రైతన్నల కలను మనందరి ప్రభుత్వం నెరవేరుస్తోంది.

మీ కష్టాలు పాదయాత్రలో చూశా..

ఇవాళ నర్సీపట్నం మున్సిపాల్టీలో రూ.16.60 కోట్లతో ప్రధాన రహదారిని విస్తరించడంతో పాటు మరో రహదారిని అభివృద్ధి చేస్తూ సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ లాంటి పనులు చేపడుతున్నాం. ఒకవైపు మెడికల్ కాలేజీ, టీచింగ్ హాస్పిటల్, నర్సింగ్ కాలేజీ మరోవైపు పట్టణంలో ప్రధాన రహదారులన్నీ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే నర్సీపట్నం రూపురేఖలు పూర్తిగా మారతాయి. తాండవ, ఏలేరు రిజర్వాయరు కాలువల అనుసంధానం కూడా పూర్తయితే ఆయకట్టు స్థిరీకరణ, విస్తరణ గణనీయంగా పెరిగి ఈ రెండు జిల్లాల్లో రైతుల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తాయి. మీ కష్టాలన్నీ నా పాదయాత్రలో చూశా.

ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసేలా..

మీ జగనన్న ప్రభుత్వంలో చేసేదే చెబుతాం.. చెప్పిందే చేస్తాం. ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుంటా. జగన్ గురించి ఎవరైనా కార్యకర్తను అడిగితే సగర్వంగా కాలర్ ఎగరేసుకుని ఫలానా వాడు మా నాయకుడు అని చెప్పుకునే విధంగానే మీ అన్న పరిపాలన చేస్తాడు. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునేలా మీ అన్న బతుకుతాడు.

మంచి చేస్తున్నా.. బురద చల్లుడే

రాష్ట్రంలో ఇవాళ ఒక చెడిపోయిన వ్యవస్థతో మనందరికీ యుద్ధం జరుగుతోంది. తమకు అనుకూలంగా ఉండే వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలన్న ఏకైక లక్ష్యంతో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5.. నిత్యం ప్రభుత్వంపై బురద జల్లడమే ధ్యేయంగా పని చేస్తున్నాయి. మనం ఎంత మంచి చేస్తున్నా కూడా అందులో వారికి చెడే కనిపిస్తోంది.

పెంచేదే.. తగ్గించేదేలే

జనవరి 1వతేదీ నుంచి ప్రతి అవ్వాతాత మొహంలో చిరునవ్వులు చూసేలా సామాజిక పెన్షన్‌ని రూ.2750కి పెంచి ఇవ్వబోతున్నాం. దీన్ని చూసి దుష్ట చతుష్టయంలో ఓర్వలేనితనం కనిపిస్తోంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు వీళ్లంతా మాట ప్రకారం పెన్షన్ పెంచుతూ చేపట్టిన గొప్ప కార్యక్రమంపైనా అసత్య ప్రచారాలు మొదలుపెట్టారు. ఆర్నెల్లకు ఒకసారి జూన్, డిసెంబర్‌లో సాధారణ ఆడిట్‌లో భాగంగా పారదర్శకంగా జరిగే వెరిఫికేషన్ కార్యక్రమంపై కూడా ఎన్నెన్నో అబద్ధాలు సృష్టించి ఎంత అల్లకల్లోలం చేస్తున్నారో మీరే గమనిస్తున్నారు. గతంలో ఇదే పెద్దమనిషి చంద్రబాబునాయుడు హయాంలో 2018 అక్టోబరు వరకు అంటే ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చారు. మీ జగన్ ప్రభుత్వంలో ఇవాళ అక్షరాలా 62.30 లక్షల పెన్షన్లు ఇస్తున్నాం. మీ జగన్ మనసు ఎలాంటిదంటే రేపు జనవరి 1 తరువాత ఈ 62.30 లక్షల పెన్షన్లు పెరిగేవే కానీ తగ్గేవి కాదన్న సంగతి అందరికీ తెలుసు. చంద్రబాబు హయాంలో పెన్షన్ బిల్లు నెలకు రూ.400 కోట్లు అయితే ఇవాళ మన ప్రభుత్వంలో నెలకు రూ.1,700 కోట్లకు పైగా ఉంది. తేడా ఇంత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నా ఎల్లో మీడియా ఎలా అల్లకల్లోలం చేస్తోందో చూడండి.

డైరెక్టర్ బాబు.. యాక్టర్ దత్తపుత్రుడు

చంద్రబాబు పాలనలో ఒక్కటంటే ఒక్క మంచైనా చేసినట్లు చెప్పుకోడానికి ఆధారాలున్నాయా? ఇలాంటి దత్తతండ్రిని నెత్తిన పెట్టుకుని ఊరేగుతున్నాడో దత్తపుత్రుడు. వీరిద్దరి స్టైల్ ఒక్కటే. అదేమిటంటే.. ఈ రాష్ట్రం కాకపోతే ఆ రాష్ట్రం... ఈ ప్రజలు కాకపోతే ఆ ప్రజలు... ఈ పార్టీతో కాకపోతే ఆ పార్టీ.. ఈ భార్య కాకపోతే ఆ భార్య.. ఇదీ వీరిద్దరి స్టైల్! వీరి స్వభావం చూస్తే ఎవరికైనా ఇదేం ఖర్మరా మన రాష్ట్రానికి? ఇదేం ఖర్మ మన రాజకీయాలకు? అని అనిపిస్తుంది. ఒకాయన రాజకీయాల్లో వచ్చి 14 ఏళ్లైనా ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు. రెండు చోట్లా ప్రజలు ఆయన్ను ఓడించారు. ఆయనకు నిర్మాత, దర్శకుడు బాబు. ఎప్పుడు షూటింగ్ అంటే అప్పుడు కాల్‌షీట్స్ ఇస్తాడు. ఎక్కడ షూటింగ్ అంటే అక్కడకు వస్తాడు. బాబు స్క్రిప్ట్ ఇస్తాడు. బాబుకు అనుకూలంగా, బాబు చెప్పిన డైలాగులన్నీ యాక్ట్ చేసి చూపిస్తాడు. ఇదీ ఈయన స్టైల్. ఇక మరో వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు. ఆ మనిషి రాష్ట్రంలో ఏ మంచి జరిగినా అది తానే చేశానని, తనవల్లే జరిగిందని అంటాడు. చివరికి సింధు బ్యాడ్మింటన్‌లో గెలిచినా కూడా ఆమెకు ఆడటం తానే నేర్పించానంటాడు. ఈ పెద్దమనిషి సొంత నియోజకవర్గం కుప్పంలో నీళ్లుండవు. కుప్పంలో రెవెన్యూ డివిజన్ మనం అధికారంలోకి వచ్చాక ఇచ్చాం. ఈ 73 ఏళ్ల ముసలాయన్ను చూస్తే అందరికీ రెండే రెండు స్కీంలు గుర్తుకొస్తాయి. ఒకటి వెన్నుపోటు... రెండోది మోసాలు.

సీఎం సభ సూపర్ సక్సెస్

- తండోపతండాలుగా వచ్చిన జనసందోహం
- ఎటుచూసినా నర్సీపట్నంలో జనసంద్రం

నర్సీపట్నం : అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఊహించిన దాని కంటే ఎక్కువగా తండోపతండాలుగా తరలివచ్చిన జనసందోహంతో సభాప్రాంగణం లోపల, బయటా కిటకిటలాడింది. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు చోడవరం, పాయకరావుపేట, మాడుగుల, అనకాపల్లి, తుని నియోజకవర్గంలోని మరికొన్ని మండలాల నుంచి రైతులు, మహిళలు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన జనాలు ప్రధాన కూడళ్లలో బారులు తీరారు. ఇక నర్సీపట్నం ఎటు చూసినా జనసంద్రంగా కనిపించింది. మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం నుంచి జోగునాథునిపాలెంలోని సభా ప్రాంగణం వరకు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గంలో వైఎస్ జగన్‌కు పూలజల్లులతో జనం నీరాజనం పలికారు. చిన్నారుల నృత్యాలతో, గిరిజన థింసా నృత్యాలతో, డప్పులతో సీఎంకి ఘనంగా స్వాగతం పలికారు. మరోవైపు.. హెలిపాడ్ వద్ద సీఎం గంటన్నర పాటు పార్టీ శ్రేణులతో కరచాలనం చేసి, ఆత్మీయంగా పలకరించారు.

నీ సభలకు ఎందుకొస్తారు?

ఈ మోసాల బాబు సభలకు జనం వచ్చారని చూపించేందుకు ఎల్లో మీడియా, దుష్టచతుష్టయం నానా తంటాలు పడుతున్నాయి. ప్రతి వర్గాన్ని వంచించిన ఆ బాబు సభలకు అసలు ఎందుకొస్తారనేది ఒక్కసారి ఆలోచన చేయండి.

- రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తానని నమ్మబలికి, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలని చెప్పి చివరికి నిండా మోసం చేసినందుకు థాంక్యూ.. థాంక్యూ బాబూ.. అని రైతులేమైనా ఆయన సభకు వస్తారా?
- రూ.14,204 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, వడ్డీలు కూడా కట్టొద్దని నిలువునా మోసగించి పొదుపు సంఘాలన్నింటినీ సర్వనాశనం చేసినందుకు ఆ అక్కచెల్లెమ్మలంతా థాంక్యూ.. థాంక్యూ బాబూ అని ఆయన సభలకు వస్తారా?
- ప్రత్యేక హోదాను తన ప్రత్యేక ప్యాకేజీ కోసం తాకట్టు పెట్టినందుకు, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానంటూ ఎగ్గొట్టినందుకు నిరుద్యోగులంతా థాంక్యూ.. థాంక్యూ బాబూ అని చెప్పడానికేమైనా ఆయన సభలకు వస్తారా?
- ఓ ఊరిలో పదివేల మంది ఉంటే కేవలం పదిమందికి మాత్రమే విదిల్చి అది కూడా లంచాలు తీసుకుంటూ జన్మభూమి కమిటీలతో నరకం చూపినందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు థాంక్యూ థాంక్యూ బాబూ అంటూ ఆయన సభలకు వస్తారా?
- కేజీ నుంచి పీజీ వరకు పూర్తి ఉచితంగా చదువులు చెప్పిస్తానంటూ ఎన్నికల వాగ్దానాలు చేసి చివరకు పిల్లలను కూడా మోసగించి ఫీజు రీయింబర్స్‌మెంట్ అనే గొప్ప పథకాన్ని నీరుగార్చినందుకు థాంక్యూ థాంక్యూ బాబూ అంటూ వస్తారా?
- దత్తపుత్రా.. ఈ పాపంలో నీక్కూడా వాటా ఉంది కాబట్టి నీక్కూడా థాంక్యూ థాంక్యూ అని చెప్పడానికి ఎవరైనా వస్తారా?
- వీరి సభలకు ఎవరైనా ఎందుకొస్తారు ? ఈ దుర్మార్గులను, వంచకుల్ని చూడడానికా? ఏదైనా ఘనకార్యం చేస్తే అధికారం నుంచి ఎందుకు దించేశారు? నిజంగానే వీళ్లు మంచి చేసి ఉంటే ఆయన కుమారుడిని, దత్తపుత్రుడుని ప్రజలు ఎందుకు ఓడించారు?
- దుష్టచతుష్టయం రామోజీ, రాధాకృష్ణ, టీవీ 5, దత్తపుత్రుడికి బాబు అమలు చేసిన డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) పథకం చాలా బాగుందని థాంక్యూ చెప్పడానికి వస్తారా?

రాజకీయమంటే..?

- రాజకీయమంటే షూటింగ్‌లు, డైలాగులు, డ్రోన్ల షాట్లు కాదు.. డ్రామాలు అంతకన్నా కాదు. ఒక రైతు కుటుంబంలో, ఒక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబంలో ఎలాంటి మంచి మార్పు తేగలిగామన్నదే రాజకీయమని వీళ్లందరికీ అర్థం కావాలి.
- ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖల్ని మార్చడం, ప్రతి గ్రామంలోనూ రైతన్నల చేయిపట్టుకుని నడిపిస్తూ వ్యవసాయం రూపురేఖలను మార్చడమే రాజకీయం. లంచాలు, వివక్షకు తావులేకుండా పౌర సేవలను ప్రతి గ్రామంలో ఆత్మగౌరవంతో అందించడం.. రాజకీయమంటే ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇళ్లను కూడా కట్టించి ఇచ్చి వారి గుండెల్లో చోటు సంపాదించడం. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల గురించి ఆలోచించడం రాజకీయం.
- రాజకీయం అంటే ఒక మాటిస్తే దాని మీద నిలబడటం అనేది వీళ్లందరికీ అర్థం కావాలి. అన్ని ప్రాంతాలు, అన్ని కుటుంబాల గురించి ఆలోచన చేస్తే దాన్ని రాజకీయం అంటారు. అటు అమరావతితో పాటు ఉత్తరాంధ్రను, రాయలసీమను చూసుకుంటూ వారందరి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే అసలైన రాజకీయం. రాజకీయ నాయకుడు అంటే ప్రజలకు సేవకుడు. చంద్రబాబు మాదిరిగా ప్రజలపై అధికారాన్ని చలాయించడం కాదు. బీసీలు వారి సమస్యలు గురించి చెప్పడానికి వెళితే నాడు వారి తోకలు కత్తిరిస్తానన్నారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా? అని హేళన చేశారు. రాజకీయమంటే అది కాదు. ఎమ్మెల్యే దగ్గర నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజా సేవకులే అన్నది రాజకీయం.
- మేనిఫెస్టోలో చెప్పిన 98.4 శాతం హామీలను నెరవేర్చాం కాబట్టే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో సగర్వంగా ప్రతి గడప వద్దకు వెళ్లి ఆశీర్వదించాలని అడుగుతుండటం రాజకీయం.



జై జగన్ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అధైర్య పడొద్దు.. నేనున్నాను

- 13 మంది అభాగ్యుల సమస్యలు విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సత్వర పరిష్కారానికి కలెక్టర్‌కు ఆదేశాలు
- రూ.లక్ష చొప్పున తక్షణ సాయం

రావికమతం/కోటవురట్ల/నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా) : మానవత్వాన్ని చాటుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు నిరూపించుకున్నారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పర్యటనకు వెళ్లిన సీఎం వైఎస్ జగన్.. దారి వెంబడి తనకు సమస్య విన్నవించుకోవాలన్న ఆర్తితో వచ్చిన వారిని గమనించి, వారి కష్టం తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. అందరికీ మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున సాయం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇలా ఏకంగా 13 మంది సమస్యలను ఓపికగా విని, తప్పక పరిష్కరిస్తామంటూ కొండంత భరోసా కల్పించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

పాము ప్రసాద్



రావికమతం మండలం జెడ్ కొత్తపట్నం గ్రామానికి చెందిన పాము ప్రసాద్ సొరియాసిస్ వ్యాధితో బాధ పడుతున్నాడు. వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

బొండపల్లి శ్రీ వెంకట దుర్గా నిఖిత



కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామం రాజగోపాలపురానికి చెందిన బొండపల్లి శ్రీ వెంకట దుర్గా నిఖిత హైపర్ కొలెస్ట్రోమియా, సబ్ క్లినికల్ హైపో థైరాయిడిజమ్‌తో బాధ పడుతోంది. ఆమెకు మెరుగైన చికిత్స అందించేందుకు తగినంత సొమ్ము లేదని నిఖిత తల్లి ముఖ్యమంత్రికి విన్నవించుకుంది.

అమర్త్య రామ్



నాతవరం మండల కేంద్రానికి చెందిన రెండేళ్ల దేవరకొండ అమర్త్య రామ్ పుట్టినప్పటి నుంచి పి ఆర్ సిండ్రోమ్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతడి నాలిక లోపలికి వెళ్లిపోయి ఊపిరి సలపని వ్యాధితో బాధ పడుతున్నందున తల్లిదండ్రులు తమిళనాడులోని నాగర్‌కోయిల్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.7.5 లక్షలు ఖర్చు పెట్టామని తెలిపారు. తగిన ఆర్థిక స్తోమత లేకపోవడంతో చికిత్స చేయించడానికి ఇబ్బంది పడుతున్నామని సీఎంకు విన్నవించారు.

గట్రెడ్డి నీరజ్



రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన గట్రెడ్డి నీరజ్ తల్లి తన కుమారుడు బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకున్నారు. తగినంత డబ్బు లేకపోవడంతో చికిత్స చేయించుకోలేకపోతున్నామని తెలిపారు.

చుక్కా శివ పార్వతీ యామిని



నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన చుక్కా శివ పార్వతి యామిని బైలేటరల్ జీను వేరమ్ సమస్యతో బాధ పడుతోంది. ఆర్థికంగా స్తోమత లేకపోవడంతో.. చికిత్స చేయించుకోవడం తమకు సాధ్యం కావడం లేదని తండ్రి సీఎంకు విన్నవించుకున్నారు.

మల్ల రోహిత్



కశింకోట మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన మల్ల రోహిత్ మెదడు సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు చేశామని, ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నామని సీఎంకు గోడు వెళ్లబోసుకున్నారు.

పెదపూడి రిషాంత్ బాబి వివేక్



కోటవురట్ల మండలం రాట్నాల పాలెం గ్రామానికి చెందిన పెదపూడి రిషాంత్ బాబి వివేక్.. సికిల్ సెల్ ఎనీమియాతో బాధ పడుతున్నాడు. చికిత్స కోసం ముఖ్యమంత్రిని వివేక్ తల్లిదండ్రులు కలిసి విజ్ఞప్తి చేశారు.

చింతల ఆకాంక్ష



అనకాపల్లి మండలం వూడురు (అల్లిఖానూడు పాలెం) గ్రామానికి చెందిన చింతల ఆకాంక్ష గ్లోబల్ డెవలప్‌మెంట్ డిలేతో ఇబ్బంది పడుతోంది. ఆమెకు వైద్య సాయం అందించాలని కుటుంబ సభ్యులు సీఎంను కోరారు.

నరం రాజబాబు



నాతవరం మండలం గుమ్మడిగరడ గ్రామానికి చెందిన నరం రాజబాబు అంధత్వంతో బాధ పడుతున్నాడు. పేదవారమైన తమను మీరే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని వేడుకున్నారు.

అందలూరి యేసుబాబు



నర్సీపట్నం మండల కేంద్రంలోని గొర్లివీధికి చెందిన అందలూరి యేసుబాబు బ్లడ్ కేన్సర్‌తో బాధ పడుతున్నాడు. మెరుగైన చికిత్స చేయించడానికి తమ వద్ద డబ్బులు లేవని సీఎంతో చెప్పుకున్నారు.

నిడదవోలు సుబ్బలక్ష్మి




నర్సీపట్నం మండలం పినరిపాలెం గ్రామానికి చెందిన నిడదవోలు సుబ్బలక్ష్మి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. మెరుగైన చికిత్సతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని సీఎంను కోరారు.

పెట్ల పరిమళ



గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన పెట్ల పరిమళ చేతులు, కాళ్ల వంకర సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. మీరే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు సీఎంను వేడుకున్నారు.

గుడివాడ జస్మిత



నర్సీపట్నం మండలం వేమలపూడి గ్రామానికి చెందిన గుడివాడ జస్మిత తలసేమియా వ్యాధితో బాధ పడుతోంది. తగినంత ఆర్థిక స్తోమత లేదని సీఎంకు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

సుఖదుఃఖములందు సమముగ నుండి, మట్టిని, రాతిని,
బంగారమును సమముగ జూచుచు, దూషణ భూషణములందు
చలింపక, ధీరుడై ఎవడు విలసిల్లునో వాడే త్రిగుణాతీతుడు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, డిసెంబర్, 31

సరికొత్త ఆశలతో...

కాలం ఎవరికోసమూ ఆగదు. అది ప్రవాహ సదృశం. మరికొన్ని గంటల్లో ముగియబోతున్న 2022 తీపి, చేదు జ్ఞాపకాల కలయిక. నూతన సంవత్సరంలోకి అడుగిడేముందు వాటిని మననం చేసుకుని, అవసరమైన గుణపాఠాలు తీసుకుంటేనే మెరుగైన రేపటిని పొందగలం. బ్రిటిష్ నటుడు ఐరన్స్ చెప్పినట్టు గడిచే సంవత్సరాలు కాలనాళికల్లాంటివి. వాటిలో కొన్ని మనల్ని వెనక్కి తీసుకెళ్తాయి. అక్కడే ఉంచే ప్రయత్నం చేస్తాయి కూడా. కొన్ని మనల్ని ముందుకు నడిపిస్తాయి. మనలోని నిరాశానిస్పృహలను పటాపంచలు చేస్తాయి. భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తాయి. అవి స్వప్నాలు. గడిచిపోయిన కాలంలో వేటిని స్వీకరించి సొంతం చేసుకోవాలో, వేటిని తిరస్కరించి ముందుకు నడవాలో మనమే నిర్ణయించుకోవాలి. 'కలతలే తరగలై లేస్తుంటే/కక్షలే గాలులై వీస్తుంటే... ధరియించి పెదవిపై దరహాసం/భరియించి యెడదలో పరితాపం/విరచింతు నీనాటి నవగీతం...' అంటూ మహాకవి శ్రీశ్రీ అయిదు దశాబ్దాలనాడు ఓ ఉగాదికి స్వాగతం పలుకుతూ అన్నాడు. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న ఈ సందర్భంలో ఆ కవితాపంక్తులు శిరోధార్యాలు.

కరోనా మహమ్మారి కాటేసిన అనంతరం అంతర్జాతీయ స్థితిగతులు ఒక అస్పష్ట చిత్రాన్ని ఆవిష్కరించాయి. సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు వణికాయి. ప్రపంచ దిగ్గజ సంస్థలు కూడా అయోమయంలో కూరుకుపోయాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలమంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఎడతెగని దూకుడుతో ఆర్థికంగా అమెరికాను అధిగమించగలదనుకున్న చైనా కరోనా వైరస్ నోటచిక్కి విలవిల్లాడుతోంది. తనకు తోచిందే అమలు చేస్తూ జనావళి బాధలు పట్టించుకోని ఆ ఏకస్వామ్య వ్యవస్థలో సైతం ముసలం పుట్టడం ఈ ఏడాది చోటుచేసుకున్న విచిత్రం. 'జీరో కోవిడ్' విధానంతో జనాన్ని ఆంక్షల చట్రంలో బిగించటానికి ప్రయత్నించిన అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చివరకు చైనా పౌరుల ఒత్తిళ్లకు దిగిరాక తప్పలేదు. లాక్‌డౌన్‌లకు స్వస్తి పలకవలసి వచ్చింది.

అగ్రరాజ్యాల మధ్య ఘర్షణ తలెత్తగల ప్రాంతాలుగా అందరూ అంచనావేసిన వాటికి భిన్నంగా ఉక్రెయిన్‌లో మంట రాజుకుంది. రష్యా దురాక్రమణ యుద్ధం పర్యవసానంగా తలెత్తిన ఆ ఘర్షణ నుంచి గౌరవప్రదంగా ఎలా బయటపడాలో తెలియక రష్యా అధినేత పుతిన్ తలపట్టుకున్నారు. ఆయనగారు ఇప్పుడిప్పుడు శాంతి చర్చలకు సిద్ధమంటున్నారు. లొంగుబాటుకు ససేమిరా అంటున్న ఉక్రెయిన్ వెనక అమెరికా సమకూర్చిపెడుతున్న ఆయుధ సామగ్రి, యుద్ధ విమానాలు ఉన్నాయన్నది వాస్తవం. సోవియెట్ పతనానంతరం అమెరికా సృష్టించుకున్న ఏకధ్రువ ప్రపంచ భావనపై ఆఖరి సమ్మెట పోటు వేయాలన్నది పుతిన్ ఎత్తుగడైతే... మరొక్కసారి రష్యాను పాదాక్రాంతం చేసుకుంటే తన సర్వంసహాధికారానికి తిరుగుండదని అమెరికా ఉవ్విళ్లూరుతోంది. అయితే ఏ యుద్ధంలోనైనా ఆయుధాలు నిర్ణాయక శక్తులు కాదు. అంతిమంగా మానవ సంకల్ప బలమే విజేత. దురాక్రమణపై మొక్కవోక పోరాడుతున్న ఉక్రెయిన్ ప్రజానీకం దాన్ని మరోసారి నిరూపించాల్సి వుంది. శాశ్వత పరాజితులు, శాశ్వత విజేతలు ఉండబోరని మొన్నీమధ్య ఖతార్‌లో ముగిసిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు చాటాయి. ఈ పోటీల్లో విశ్వవిజేతగా నిలిచిన అర్జెంటీనాను అంతక్రితం సౌదీ వంటి దేశం ఓడించిందంటే నమ్మబుద్ధి కాదు. మొరాకో క్వార్టర్ ఫైనల్‌కి రావటం, చివరాఖరి వరకూ విజేతగానే కనబడిన ఫ్రాన్స్ చతికిలబడటం ఆశ్చర్యకరమైనవే.

అందరూ సమస్యలెదుర్కొంటున్న ఈ కరోనా అనంతర ప్రపంచంలో ఎంతోకొంత మెరుగ్గా ఉన్నది మన దేశమే. సహజంగానే ఈ పరిస్థితి ప్రధాని నరేంద్ర మోదీని తిరుగులేని నేతగా నిలబెట్టింది. అయితే పేదరికం బారినపడి అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు కోకొల్లలు. ఈ దుఃస్థితి పిల్లలను చదువులకు దూరం చేసింది. సెకండరీ విద్యలో నిరుడు డ్రాపౌట్లు దాదాపు 15 శాతమని ఒక నివేదిక చెబుతోంది. కొత్త సంవత్సరంలో తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, ఈశాన్యంలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, మిజోరంలు కూడా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లబోతు న్నాయి. జమ్మూ, కశ్మీర్‌లోనూ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రెండు పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో జనామోదం లభించకున్నా ఫిరాయింపులను ప్రోత్సహించటంద్వారా బీజేపీ అధికార పీఠాలను ఆక్రమించగలిగింది. మేఘాలయలో అధిక స్థానాలు గెలుచుకున్నా బీజేపీ ఎన్నికల అనంతర పొత్తుతో కాంగ్రెస్ చిత్తయింది. త్రిపురలో 2018లో అధిక సీట్లు బీజేపీయే గెల్చుకున్నా వామపక్షాలకూ, ఆ పార్టీకీ మధ్య వ్యత్యాసం 1.37 శాతం మాత్రమే. ఈ రాష్ట్రాల్లో ఎన్ని ఈసారి బీజేపీ ఖాతాలో పడతాయో చూడాలి.

మౌలికంగా యువజనం అధికంగా ఉన్న దేశం మనది. జనాభాలో సగంకన్నా ఎక్కువగా, అంటే 52 శాతంమంది వయసు ముప్పైలోపే. అదీగాక ఈ కొత్త సంవత్సరంలో జనాభారీత్యా మనం చైనాను అధిగమించబోతున్నాం. కనుక ఉడుకునెత్తురులో అసంతృప్తి రాజుకోకుండా చూడటం, మెరుగైన విధానాలతో నిరుద్యోగ సమస్యను అధిగమించటం పాలకులకు సవాల్. ఉచిత పథకాలు అరిష్టమన్న కేంద్ర పాలకులు వచ్చే ఏడాదంతా ప్రజాపంపిణీ ద్వారా ఆహారధాన్యాలను ఉచితంగా అందిస్తామని ఈమధ్యే ప్రకటించారు. ఆకలి సూచీల దండోరా తప్పని చెప్పినవారే ఈ ప్రకటన చేయటం మంచి పరిణామం. గతం నేర్పిన గుణపాఠాలను గ్రహిస్తేనే భవిష్యత్తు సవాళ్లను సునాయాసంగా ఎదుర్కొనగలం. కొత్త సంవత్సరంలో నిరంతర అప్రమత్తతతో మెలగగలం.

సాంకేతిక అద్భుతాలు చూడవచ్చు

విశ్లేషణ



జైదీప్ మెహతా

2023లో సాంకేతిక పరిజ్ఞాన పెరుగుదల ఎంత ఉంటుందో ఊహించలేం. న్యాయ, అకౌంట్ల సంబంధిత రంగాల్లో; ఉద్యోగుల ఎంపిక వంటి అంశాల్లో కృత్రిమ మేధను పెద్ద ఎత్తున వాడే అవకాశం ఉంది. టెలికమ్యూనికేషన్స్ రంగంలో 5జీ విప్లవాత్మక మార్పులు తేనుంది. 'నెట్‌ఫ్లిక్స్'లో ఓ సిరీస్ పూర్తి సీజన్‌ను ఒక్క నిమిషంలోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గిగాబైట్ల సైజులో ఉండే వైద్యసంబంధిత నివేదికలను ఎక్కడో ఉన్న స్పెషలిస్టు డాక్టరు దగ్గరికి ఇట్టే చేర్చవచ్చు. తద్వారా టెలిమెడిసిన్‌కు మంచి ఊపు వస్తుంది. ఇక విద్యుత్తుతో నడిచే ద్విచక్రవాహనాలతోపాటు నగరంలో సరుకుల రవాణాకు ఉపయోగించే ఆటోరిక్షా, చిన్నసైజు ట్రక్కులు ఎక్కువ కానున్నాయి.

సాంకేతిక పరిజ్ఞాన రంగం ఈ ఏడాది కొంత స్తబ్దుగానే గడిచిందని చెప్పాలి. క్రిప్టో కరెన్సీ సుమారు రెండు లక్షల కోట్ల డాలర్ల సంపదను తుడిచి పెట్టేసింది. క్రిప్టో కరెన్సీ ఆది నుంచీ ఎండమావేనని కొందరు వాదించవచ్చు. 'క్రంచ్ బేస్' అంచనాల ప్రకారం వెంచర్ క్యాపిటల్స్ మద్దతుతో నడుస్తున్న కంపెనీలు ఈ ఏడాది మూడో త్రైమాసికంలో సుమారు 290 కోట్ల డాలర్ల నష్టాలు చవిచూశాయి. ఈ రకమైన మందగమన పరిస్థితులు ఇప్పుడప్పుడే సర్దుకుంటాయన్న సూచనలు కనిపించడం లేదు. మరోవైపు ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలకు పెద్ద ఎత్తున పెడుతున్న కోతలూ కొనసాగుతున్నాయి. ఏడాది ముగిసి 2023లోకి అడుగుపెడుతున్న సమయంలో నేర్చుకున్న పాఠాలను ఒక్కసారి నెమరేసుకుని... భవిష్యత్తు కోసం ఎదురుచూడాలి.



నా అంచనా ప్రకారం వచ్చే ఏడాది టెక్నాలజీ కంపెనీలకు బాగానే ఉండనుంది. జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని అనుకుంటున్నాను. ప్రపంచ స్థాయిలో స్థూల ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకుల ప్రభావం కొంత ఉన్నప్పటికీ భారత్‌లో ఆర్థిక వ్యవస్థ, మరీ ముఖ్యంగా కార్పొరేట్ రంగం డిజిటలీకరణ వేగం పుంజుకుంటూ ఉండటం ద్వారా ఐటీ రంగానికి లాభం చేకూరనుంది. ఈ నేపథ్యంలో భారతీయ దృక్కోణం నుంచి చూస్తే ఐదు రంగాలు ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి.

ఐటీ సేవల రంగానికి ఢోకా లేదు

ఐటీ సేవల రంగంలోని కంపెనీలు మందగమనం ప్రభావాన్ని దాటేయగలవు. 2000–01 నాటి డాట్‌కామ్ సంక్షోభాన్నీ, 2008–09 నాటి ఆర్థిక మాంద్యాన్నీ కూడా గట్టెక్కగలిగిన 2,500 కోట్ల డాలర్ల విలువైన ఐటీ సేవల రంగం ఇప్పటికే అసంఖ్యాకమైన టెక్నాలజీ, బిజినెస్ మోడళ్లలో మార్పులను చవిచూసిన విషయం తెలిసిందే. ఈ అడ్డంకులన్నింటినీ దాటుకుని ఐటీ సేవల రంగం నిత్యం రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. అంతేకాదు, ఈ కాలపు కంపెనీలు కల గనే స్థాయిలో నెట్ మార్జిన్లు కూడా 20 శాతం వరకూ నమోదు చేశాయి. 'టీసీఎస్'ను ఉదాహరణగా తీసుకుంటే... 2008–09లో ఈ కంపెనీ 23 శాతం వృద్ధి చెందింది. అప్పట్లో ఇది కేవలం 600 కోట్ల డాలర్ల కంపెనీ మాత్రమే. ఇప్పుడది ఏకంగా 2,000 కోట్ల డాలర్ల కంపెనీ. అంతేస్థాయిలో రెండంకెల వృద్ధి అంచనాలు వేస్తోంది. ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా నడుస్తున్నప్పుడు కంపెనీలు తమ ఖర్చులు తగ్గించుకునేందుకుగాను ఔట్‌సోర్సింగ్‌ను ఎక్కువ చేస్తాయి. ఇది భారతీయ ఐటీ కంపెనీలకు లాభదాయకం. అంతేకాకుండా, భారతీయ కంపెనీలు క్లౌడ్ వంటి ఈ కాలపు టెక్నాలజీల్లోనూ ముందువరసలో ఉండటమే కాకుండా, కంపెనీల డిజిటలీకరణలోనూ కీలకంగా ఎదిగాయి.

దేశంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ మౌలిక సదుపాయాలు చక్కగా అమరి ఉన్నాయిప్పుడు. అకౌంట్ అగ్రిగేటర్ కూడా అందుబాటులోకి రానుంది. ఫలితంగా చిన్న చిన్న వ్యాపారులకు కూడా రుణాల లభ్యత మెరుగయ్యే అవకాశాలున్నాయి. అలాగే కొంచెం పేద కుటుంబాలకూ... అకౌంట్ అగ్రిగేటర్ వల్ల రుణాలు తీసుకోవాలని అనుకున్న వారి వివరాలు వారి అనుమతితో ఇతరులకు అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల ఇతర కంపెనీలు మెరుగైన రీతిలో రుణాలు అందించే ప్రయత్నం చేస్తాయి. సమాచార లేమి కారణంగా ఇప్పటివరకూ ఇది సాధ్యం కాలేదు. ఈ రుణ వితరణ పెంపు మొత్తం ఫిన్‌టెక్ కంపెనీల ఆధ్వర్యంలోనే జరుగుతుంది కాబట్టి, వినియోగం కూడా పెరుగుతుంది. ఇళ్ల కొనుగోళ్లు, పొదుపు మొత్తాలు ఆర్థిక వ్యవస్థల్లో పెట్టుబడులుగా చేరతాయి. ఈ దృష్టితో చూస్తే ఫిన్‌టెక్ కంపెనీలపై రానున్న ఏడాది నిత్యం ఓ కన్నేసి ఉండటం అవసరం.

కృత్రిమ మేధ వినియోగం పెరుగుతుంది

ఈ ఏడాది జన సామాన్యానికి కూడా కృత్రిమ మేధ తాలూకూ సామర్థ్యాన్ని పరిచయం చేసింది 'ఓపెన్ ఏఐ' తాలూకూ 'ఛాట్-జీపీటీ' వేదిక. మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ తాలూకూ టెక్నాలజీలను విస్తృత స్థాయిలో వాడేందుకు అవకాశం కల్పిస్తాయి ఇలాంటి వేదికలు. మానవ వనరుల కోసం ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన రంగాల్లో ఈ ఏడాది కృత్రిమ మేధ వాడకం ఉంటుందన్నది నా అంచనా. న్యాయ, అకౌంట్ల సంబంధిత రంగాలు అన్నమాట! దీంతోపాటే... ఆర్థిక వ్యవస్థలో మోసాలను పసిగట్టేందుకు; మార్కెటింగ్ ఆటోమేషన్, ఉద్యోగుల ఎంపిక, నియామకం వంటి అంశాల్లో కృత్రిమ మేధను పెద్ద ఎత్తున వాడే అవకాశం ఉంది. ఇక్కడ ఒక స్టార్టప్ కంపెనీ గురించి చెప్పాలి. దాని పేరు 'వాయిస్–ఓసీ'. వైద్య సహాయం అవసరమైన వారు కంప్యూటర్‌తో మాట్లాడటం ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు దీంతో. ఆ తరువాత వాట్సాప్ ద్వారా సంప్రదింపులు, టెస్టులు బుక్ చేసుకోవం, చెల్లింపులు జరపడం వంటి పనులు చేయవచ్చు.

విద్యుత్తు వాహనాల జోరు

ఈ ఏడాది విద్యుత్తుతో నడిచే ద్విచక్రవాహనాలతోపాటు నగరంలో సరుకుల రవాణాకు ఉపయోగించే ఆటోరిక్షా, చిన్నసైజు ట్రక్కులు ఎక్కువ కానున్నాయి. 'రీసెర్చ్ అండ్ మార్కెట్స్ డాట్‌కామ్' అంచనా ప్రకారం విద్యుత్తుతో నడిచే ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు ఏడాదికి 29 శాతం చొప్పున పెరగనున్నాయి. అది కూడా 2027–28 వరకూ! అయితే మార్కెట్ సామర్థ్యం విషయంలో ఇది కూడా చాలా మితమైన అంచనా అని అనుకుంటున్నా. బ్యాటరీ టెక్నాలజీ మెరుగుపడుతూండటం, ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తృతమవుతున్న నేపథ్యంలో 2023లో విద్యుత్తుతో నడిచే కార్లకూ డిమాండ్ బాగా ఉండే అవకాశముంది. ఇప్పటివరకూ కార్ల అమ్మకాల్లో విద్యుత్తు వాహనాల వాటా 1 – 2 శాతం మాత్రమే ఉన్నప్పటికీ రానున్న సంవత్సరాల్లో ఇది గణనీయంగా పెరగనుంది. మొత్తమ్మీద చూస్తే 2023లో విద్యుత్తు రవాణా రంగం గుర్తుంచుకోదగ్గ స్థాయి వృద్ధిని సాధించనుంది!

చివరగా... టెలికమ్యూనికేషన్స్ రంగంలో 5జీ విప్లవాత్మక మార్పులు తీసుకురానుందనడం నిస్సందేహం. ఈ నెట్‌వర్క్ పెరుగుతున్న కొద్దీ జరిగే మార్పులు మన ఊపిరిని నిలబెట్టే స్థాయిలో ఉంటాయని అనవచ్చు. వీడియోలు, ఇతర మాధ్యమాల వినియోగం ఎంత పెరుగుతుందో ఒక్కసారి ఊహించండి! 'నెట్‌ఫ్లిక్స్'లో ఓ టెలివిజన్ సీరియల్ పూర్తి సీజన్‌ను ఒక్క నిమిషంలోనే డౌన్‌లోడ్ చేసుకోవడం 5జీ ద్వారా సాధ్యమవుతుంది. గిగాబైట్ల సైజులో ఉండే వైద్యసంబంధిత నివేదికలు (ఎంఆర్ఐ వంటివి) ఎక్కడో ఉన్న స్పెషలిస్టు డాక్టరు దగ్గరికి ఇట్టే చేరగలవు. తద్వారా టెలిమెడిసిన్‌కు మంచి ఊపు వచ్చే అవకాశం ఉంటుంది. ఫేస్‌బుక్ మొదలుపెట్టిన వివాదాస్పద మెటావర్స్ మళ్లీ పట్టాలెక్కవచ్చు. ఎందుకంటే వినియోగదారుల మనో భావాలు తెలుసుకునేందుకు ఇది మెరుగైన వేదిక అని కంపెనీలు భావిస్తాయి మరి. బ్యాండ్‌విడ్త్ అనేది ఒకప్పటి మాదిరిగా అరుదైందో, అపురూపమైందో కాకుండా... కావాల్సిన వారికి కావాల్సినంత లభిస్తుంది. అది కూడా చాలా తక్కువ ధరలో, ఇంకోలా చెప్పాలంటే దాదాపు ఉచితంగా దొరకవచ్చు. వ్యాపారం, వైద్యం, పిల్లల విద్య తదితర అనేక రంగాల్లో ఇది ఎన్నెన్ని మార్పులు తీసుకురాగలదో ఊహించండి!

ఏతావాతా... 2023 సంవత్సరం కొన్ని సవాళ్లు విసరనుంది. అయినప్పటికీ భారతీయుల దృష్టిలోంచి చూస్తే మాత్రం ఎన్నో అద్భుతాల కోసం ఎదురు చూడవచ్చు. డిజిటల్ ఇండియా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది మరి!

వ్యాసకర్త పెట్టుబడిదారు, టెక్నాలజీ రంగ పరిశీలకుడు
('మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మొత్తం చుట్టేసింది



ఈ నెలారంభంలో షాంఘై (చైనా నగరం)లో నాకు తెలిసి ఎవరికీ కోవిడ్ లేదు. కానీ ఇప్పుడు: మా బిల్డింగులో 100 శాతం మంది, నా ఇద్దరు పిల్లల క్లాసుల్లో 100 శాతం మంది, నా సన్నిహిత మిత్రుల్లో 100 శాతం మంది... అందరికీ వ్యాపించింది.

– జేరడ్ టి. నెల్సన్, చైనా న్యాయవాది

గెట్ వెల్ సూన్



క్రికెటర్ రిషభ్ పంత్ కోసం ప్రార్థిస్తున్నాను. అదృష్టవశాత్తూ అతడికి పెను ప్రమాదం తప్పింది. తను అత్యంత త్వరగా కోలు కోవాలని కోరుకుంటున్నాను. తొందరగా బాగవ్వు ఛాంపియన్!

– వీవీఎస్ లక్ష్మణ్, మాజీ క్రికెటర్

మేం కనబడమా?



వీగర్లు కూడా ముస్లింలే. కానీ వీగర్లకు అత్యంత భద్రతనిచ్చే దేశాలు ముస్లిమేతర దేశాలు. మద్దతు ఇస్తున్నందుకు 'ఉమ్మా' (మతపరంగా మనం అందరం ఒక్కటే అనే ఇస్లాం భావన)కు ధన్యవాదాలు. ఈ రోజుల్ని వీగర్లు ఎప్పటికీ మరిచిపోలేరు.

– కుజ్జాత్ అల్తాయ్, వ్యాపారవేత్త

'రిప్' పీలే



ఫుట్‌బాల్ క్రీడాకారుడు పీలే 1977లో మోహన్ బగాన్‌తో ఆడటానికి కోల్‌కతాకు వచ్చినప్పుడు, నా హీరోను కలవడానికి ఉన్న ఏకైక మార్గం ఆయన్ని ఎయిర్‌పోర్టు నుంచి తోడుకుని వచ్చే చాఫర్‌ను కావడమే. ఆ జ్ఞాపకాలు నాలో ఇంకా తాజాగా ఉన్నాయి. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

దాస్తే దాగుతుందా?



పాకిస్తాన్ పెద్ద ఇంగ్లిష్ వార్తా మధ్యమాలేవీ కూడా దయా భీల్ పాశవిక హత్య కేసు గురించి (సామూహిక అత్యాచారం: తల, వక్షం నరకడం) కవర్ చేయలేదని గుర్తించాను. బహుశా, వాళ్లు ఆ వార్తను నివేదించకుండా పాకిస్తాన్ గురించిన మంచి ఇమేజ్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆ నిరాకరణ ఇక్కడ హిందువులనూ, క్రైస్తవులనూ ఎలా చూస్తున్నారనే వాస్తవాన్ని ఎంతమాత్రమూ దాయలేదు.

– వీంగాస్, పాకిస్తాన్ జర్నలిస్ట్

సంక్షేమానికి అడ్డుతగలరాదు

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

సంక్షేమ పథకాలూ, వాటిని అమలుచేసే ప్రభుత్వాలపై విమర్శ పెరిగింది. తాము చెల్లిస్తున్న పన్నులతోనే వాటిని అమలు చేస్తున్నారనీ, అలగా జనానికి మా సొమ్ము ఖర్చవుతోందనీ, తమకు అన్యాయం జరుగుతోందనీ మధ్య, ఉన్నత మధ్య తరగతి ప్రజల వాదన.

సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లు ప్రత్యక్ష పన్నులు చెల్లిస్తారు. వీటిని ఎగేసే అవకాశాలు, ఎగ్గొట్టించే వృత్తి సంస్థలు ఉన్నాయి. పేదలు, మధ్య తరగతి ప్రజలు పరోక్ష పన్నులు చెల్లిస్తారు. బీడీలు, సబ్బులు, బియ్యం, ఉప్పు పప్పుల పన్నులు ఇలాంటివి. వీటిని తప్పించుకోలేరు. మనం సమాజం నుండి చాలా పొందుతాము. మనం వాడే రోడ్లు, భవనాలు, గ్రంథాలయాలు, విద్యా, వైద్యాలయాలు ప్రజాధనంతో నిర్మించినవే. వాటిపై ప్రభుత్వం నిరంతరంగా నిర్మాణ, నిర్వహణ ఖర్చులు పెడుతూ ఉంటుంది. ఈ ఖర్చుల కోసం ప్రజలు పన్నులు చెల్లించాలి. ఎవరు ఏ సౌకర్యాలను వాడుతున్నారు, ఎవరు వేటిపై పన్నులు చెల్లించాలి, అని తేల్చటం కష్టం. అందుకే సంపాదనలపై ప్రత్యక్ష పన్నులు, వినియోగాలపై పరోక్ష పన్నులు విధిస్తారు.

శ్రమ శక్తి మాత్రమే కలిగిన కార్మికులు సమాజ సౌకర్యాలను తక్కువ వాడుతారు. వాళ్ళు స్థానిక ప్రయాణాలే గాని సుదీర్ఘ ప్రయాణాలు తక్కువ చేస్తారు. చదువుకోనివారు విద్యాలయాలను వాడరు. తులనాత్మకంగా ఆస్పత్రులను కూడా తక్కువ వాడుతారు. చదువరులు, అందులో వైద్య, ఇంజినీరింగ్, వ్యవసాయం మొదలగు వృత్తి విద్యలను అభ్యసించినవారు ఎక్కువగా ప్రజాధనాన్ని ఉపయోగిస్తారు. సమాజం నుండి ఎక్కువగా నేర్చుకుంటారు. సమాజ సంపద, మౌలిక సదుపాయాలనూ ఎక్కువగా వినియోగిస్తారు. పేదల కంటే, వృత్తి నిపుణులు, ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కువ మోతాదులో సమాజానికి తిరిగి ఇవ్వాలి. కాని వాళ్ళు సమాజానికి అనగా ప్రభుత్వానికి చెల్లించవలసినదాని కంటే తక్కువే చెల్లిస్తారు. అందుకే మేము ఎక్కువ పన్ను చెల్లిస్తున్నాము, మా డబ్బుతో పేదలు, శ్రామికులు బతుకుతున్నారన్న వీరి ప్రచారంలో వాస్తవం లేదు.

కార్పొరేట్ సంస్థల అధిపతులు, పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు, సంపన్నులు ప్రభుత్వాల నుండి మౌలిక సదుపాయాలు, బ్యాంకుల నుండి ఆర్థిక సహాయం పొందుతారు. తమ వాణిజ్యంలో ప్రజలకు భాగస్వామ్య కల్పనలో భాగంగా ప్రజల సొమ్మును సేకరిస్తారు. నామమాత్రపు సొంత డబ్బుతో లాభాలు సంపాదిస్తారు. పేదలు, శ్రామికులు, దిగువ మధ్య తరగతి ప్రజలకు తమ శ్రమ శక్తియే సంపాదన వనరు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, రాయితీలు వారి శ్రమ శక్తి ఉపయోగానికి సౌకర్యాలుగా మారుతాయి. వారు శ్రమ శక్తిని ఎక్కువగా వాడే వెసులుబాటు కలుగుతుంది. దీంతో వారి దిన కూలీ పెరగదు. కాని వారి శ్రమ సాంద్రత, నిపుణత, ఉత్పత్తి స్థాయి, వారు పని చేసే సంస్థల యాజమాన్య లాభాలు పెరుగుతాయి. సమాజం ప్రగతి సాధించి, దేశ సంపదలు అభివృద్ధి చెందుతాయి. సంక్షేమ పథకాలు, రాయితీలు సమాజ శ్రేయస్సు, దేశోన్నతి సాధనాలు.

ప్రజలకు సామాజిక దృక్పథం అవసరం. సెల్ ఫోన్లు, మోటర్ సైకిళ్ళు, టీవీలు వాడేవారు పేదలు కారని కొందరు వాదిస్తారు. ఇవి నాగరిక పేదరిక అవసరాలు. సెల్ ఫోన్ రోజు కూలి పని సంపాదనలో, అందుకు అవసరమైన సాధనాల సమకూర్పులో, పని స్థలాల నిర్ణయంలో సహాయపడుతుంది. నగరాల్లో పనిస్థలాలకు చేరుకోడానికి మోటర్ సైకిళ్ళు అవసరం. రాజ్యాంగం ప్రకారం మనది సంక్షేమ రాజ్యం. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమానికి కృషి చేయవలసిందే. అటువంటి కార్యక్రమాలకు ఎవరూ అడ్డు తగలకూడదు.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

గడప గడపలో నూతన శోభ!

సందర్భం



కైలే అనిల్ కుమార్

అద్దె చెల్లించాల్సిన బాధ తప్పి సొంత ఇంట్లో ఉన్నామనే సంతోషం ఉందని నియోజక వర్గంలో గడప గడపకు తిరుగుతున్నప్పుడు చాలామంది మహిళలు చెబుతున్నారు. ఇలాంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉన్నారు. నూతన సంవత్సర శోభ పల్లె గడప తొక్కిందని చెప్పడానికి ఇది కేవలం ఒక ఉదాహరణ. ఇలాంటి ఉదాహరణలు రాష్ట్రంలో కోకొల్లలుగా మనకు కనిపిస్తున్నాయి. జీవన ప్రమాణాలు మెరుగు పడటమే నిజమైన అభివృద్ధి అని గట్టిగా నమ్మిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం... పాలనను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లింది. సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. కరోనా విపత్తు సృష్టించిన ఆర్థిక అల్లకల్లోలం నుంచి తేరుకోవడానికి ప్రయత్నిస్తూనే... పేదల జీవితాలకు ఆసరాగా నిలబడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వం అందుకుంటున్న ప్రతి పథకం లోనూ ప్రజలకు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.



'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ప్రజల గుమ్మం ముందుకు వెళుతున్న క్రమంలో.. పేదల జీవితాల్లో వస్తున్న మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సొంతింటి కల నెరవేరిన అక్కాచెల్లెమ్మల కళ్లల్లో, ఎవరి మీదా ఆధార పడకుండా ఒకటో తేదీ వేకువనే అందుతున్న పెన్షన్‌తో గౌరవంగా బతుకుతున్న అవ్వాతాతల ముఖాల్లో, ఆసరా–చేయూతతో తన కాళ్ల మీద నిలబడి ఆత్మగౌరవంతో జీవిస్తున్న అక్కల ఆత్మీయ పలకరింపుల్లో, పిల్లలకు మంచి చదువులు చెప్పించడానికి అండగా నిలిచిన 'అమ్మఒడి' అందుకుంటున్న చెల్లెమ్మల సంతోషంలో, అన్నం పెడుతున్న అమ్మను గౌరవించడాన్ని బాధ్యతగా తీసుకొని ఇంటి ముందుకు ప్రభుత్వం పంపించిన వాహనం నుంచి బియ్యం తీసుకుంటున్న మహిళల మోముల్లో, వ్యవసాయాన్ని పండగ చేయడానికి అండగా నిలిచిన రైతు భరోసా కేంద్రాల సేవలు అందుకుంటున్న రైతన్నల ఆనందంలో... ఒకరేమిటి... ఊరిలో అన్ని వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతున్న సంతృప్తిలో కొత్త సంవత్సరం శోభ కనిపిస్తోంది.

రైతుల నుంచి సేకరించిన ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో పడుతోంది. మిల్లర్లు, దళారుల బెడద లేకుండా మద్దతు ధరకు రైతులు ధాన్యం విక్రయిస్తున్నారు. ఊరికే కొత్త రూపుతెచ్చిన గ్రామ సచివాలయాలు... ప్రజల ముంగిటకు పాలనను తీసుకొచ్చి ప్రజల అవసరాలు తీర్చి వారి ముఖాల్లో సంతోషానికి కారణంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు అందుబాటులోకి రావడంతో నూతన సంవత్సరం శోభ ఇనుమ డిస్తోంది.

సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో లక్ష మందికి ఒకేసారి ప్రొబేషన్ ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఉద్యోగులు తమ ఇళ్లతో పాటు వారు పనిచేస్తున్న సచివాలయం పరిధిలోని ఇళ్లకూ నూతన సంవత్సరం శోభను తీసుకురావడానికి, ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన సందేశాన్ని మోసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు.

అవ్వాతాతలకు ఇస్తున్న పెన్షన్ ఈ జనవరి 1 నుంచి రూ. 2,750 పెంచారు. పెన్షన్ పెంపుతో 64 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది. రైతు భరోసాను అర కోటి మందికి పైగా రైతులకు అందిస్తున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద దాదాపు 4 లక్షల మంది అక్కాచెల్లెమ్మలు లబ్ధి పొందుతున్నారు. జగనన్న చేదోడు 3 లక్షల మందికి, జగనన్న తోడు దాదాపు 5.5 లక్షల మందికి... ఇలా చెప్పుకొంటూపోతే, పల్లె గడపలో ప్రభుత్వం నుంచి పథకాలు అందుకోని వారు ఉండరనే చెప్పాలి. అందుకే ప్రగతిపథం వైపు అడుగులేస్తున్న ప్రతి ఇంటి గడపలో నూతన సంవత్సరం శోభ కనిపిస్తోంది.

చదువు ఒక్కటే పేదల తలరాత మారుస్తుందని నమ్మిన ప్రభుత్వం ఇది. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే దృఢ సంకల్పం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉండటం వల్లే ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చి... అందులో బైజూస్ పాఠాలు అందిస్తున్నారు. ఒకప్పుడు కేవలం కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమయిన ఇలాంటివి ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో సాకారం కావడం... రాజ్యాంగం ఇచ్చిన సమాన అవకాశాలు పొందే హక్కును రక్షించడమే. నాణ్యమైన చదువులతో పైకొస్తున్న ప్రతి విద్యార్థి.. ఒక తరం తలరాత మార్చే చైతన్యదీప్తి. ఈ వెలుగులతో కొత్త సంవత్సరం శోభ పల్లె గడప తొక్కింది.

వ్యాసకర్త ఎమ్మెల్యే, పామర్రు, కృష్ణా జిల్లా
మొబైల్: 99494 18777

2023

ఎప్పటికప్పుడు ఏదో కొత్తదనంతో నవనవోన్మేషంగా ఉండడం సృష్టి లక్షణం. అనుదినం తన బిడ్డలకు కొత్తదనాలనూ, కొత్త భోగవస్తువులనూ, కొత్త అనుభవాలనూ కానుక చేయడం భగవంతుడికి వాడుక, వేడుక. కాబట్టే తెల్లారేసరికి మన చుట్టూ ఎన్నో కొత్త చిగుళ్లూ, కొత్త మొగ్గలూ, కొత్త ఆరంభాలూ కళకళలాడుతూ, కిలకిల నవ్వుతూ కనిపిస్తాయి. ఎన్నో కొత్త అందాలూ, పోకడలూ, విచిత్రాలూ, కొత్త వేష భాషలూ, వస్తువాహనాలూ, ప్రయోగాలూ, ధోరణులూ ఎదురౌతాయి.

ప్రకృతి ధర్మంగా వచ్చి పలకరించే కొత్తదనాల సందడిని సుహృద్భావంతో స్వాగతించే ధీరుడు వాటిని ఆనందంగా ఆస్వాదించగలుగుతాడు. పరిచితమైనదనే పక్షపాతంతో పాతనే పట్టుకు పాకులాడుతూ, అపరిచితమైన నవ్యతకు అకారణంగా జంకుతూ ఉండే భీరువు, నిరంతమైన నిరాశతో నిరుత్సాహానికి నెలవుగా ఉంటాడు.



జ్యోతిర్మయం

నిన్నటి కొత్తే నేటి పాత. నేటి కొత్త రేపటికి పాత. అయినప్పుడు అన్నీ మన మంచికే. లోక క్షేమం కోసం కొత్త నీరుప్రవహిస్తూ వస్తుంటే భయమెందుకు, కొత్త సమస్యలు మోసుకొస్తుందేమోననా? సమస్య వెంటే పరిష్కారం వస్తుంది అని చరిత్ర మనకు పదే పదే చెప్పిన పాఠం. గతంలో ఇలా అనవసరంగా ముందు భయపెట్టిన సమస్యలెన్నిటినో మనం అలవోకగాదాటివచ్చిన వాళ్ళమే గదా! సృష్టి కర్త ఉన్నాడనీ, ఆయన కరుణామయుడనీ, కాలగమనానికి ఆయనే కారణం గనక కాలగతి కలిగించే ఒడుదొడుకులన్నీ ఆయన అనుగ్రహంతో అధిగమించగలమనీ విశ్వసించే వారు, నవ్యతను ఆశాభావంతో ఆహ్వానించకుండా ఉండలేరు.

ఎన్నో కొత్తదనాలు మన ముందు ఆవిష్కరించేందుకు, మరో నూతన సంవత్సరం మన ముంగిట నిలిచిన శుభవేళలో, సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయాః, సర్వే భద్రాణి పశ్యంతు, మా కశ్చిత్ దుఃఖభాక్ భవేత్ (అందరూ సుఖంగా ఉండాలి, అందరూ అనారోగ్యానికి దూరంగా ఉండాలి, అందరికీ శుభాలు జరగాలి, ఎవ్వరూ దుఃఖానికి ఆశ్రయం కాకూడదు) అన్న ఆర్షేయమైన ఆశీస్సు మనసారా మరోసారి మననం చేసుకొందాం. కొత్త ఏడాదిలో అందరూ ధర్మాన్ని రక్షిస్తూ, దానివల్ల సురక్షితులై సుఖశాంతులతో ఉండాలనీ, దుఃఖహేతువులైన దుర్మార్గాలకు దూరంగా ఉండాలనీ ఆకాంక్షిస్తూ, రెండు వేల ఇరవై మూడుకు సంతోషంగా స్వాగతం పలుకుదాం!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.నవమి రా.11.02 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** రేవతి సా.4.40 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.6.33 నుండి 8.02 వరకు, **అమృతఘడియలు:** ప.2.17 నుండి 3.51 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం** 6.34; **సూర్యాస్తమయం** 5.32.

క్లుప్తంగా...

దళిత నాయకులను దళితులే ఎన్నుకొనే అవకాశం కల్పించండి

- సీఎం జగన్‌కు ముద్రగడ లేఖ



కిర్లంపూడి: దళిత నాయకులను దళితులే ఎన్నుకొనే అవకాశం కల్పించాలని సీఎం వైఎస్ జగన్‌కు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం లేఖ ప్రతులను మీడియాకు విడుదల చేశారు. ఎవరి ప్రమేయం లేకుండా మెరుగైన పద్ధతులలో దళితుల పదవులను దళితులే ఓటు వేసుకునే అవకాశం కల్పించి వారి నాయకులను వారే ఎన్నుకొనేలా ఆలోచన చేయాలని పేర్కొన్నారు. ఇతర వర్గాలు నివసించే వీధులలో ఒకటి నుంచి ఐదు దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, దళితులకు సంబంధించిన లక్షలాది రూపాయల గ్రాంట్‌లను అక్కడే ఖర్చు చేయడం వలన ఎక్కువ జనాభా ఉన్న దళితులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

2న అన్ని పంచాయతీల్లో గ్రామసభ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జనవరి 2వ తేదీన తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక సమయంలో గ్రామసభలు అధికారులు నిర్వహిస్తున్నారు. అయితే పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది తప్పనిసరిగా జనవరి, ఏప్రిల్, ఆగస్టు, అక్టోబర్ నెలల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు జనవరి 2వ తేదీ అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన గురించి గ్రామస్తుల సమక్షంలో చర్చించుకోవాలని పంచాయతీరాజ్ శాఖ సూచించింది.

ఫిబ్రవరి 17న 'గ్రేడ్-3' పోస్టుల మెయిన్ పరీక్ష

సాక్షి, అమరావతి: ఏపీలో ఎండోమెంట్ ఈవో గ్రేడ్-3 పోస్టుల భర్తీకి మెయిన్ పరీక్షను ఫిబ్రవరి 17న నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం తెలిపింది. ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష విశాఖ, కృష్ణా, చిత్తూరు, కర్నూలు జిల్లా కేంద్రాల్లో జరుగుతుంది. ఈ పరీక్షలకు 1,278 మంది క్వాలిఫై అయ్యారని కమిషన్ పేర్కొంది. వివరాలకు https://psc.ap.gov.in ను సందర్శించాలని కమిషన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

3 నియోజకవర్గాల్లో 9,96,393 మంది పట్టభద్రులు

- అత్యధికంగా ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు నియోజకవర్గంలో 3.83 లక్షల ఓటర్లు
- మార్చి 29తో ముగియనున్న ఐదుగురు మండలి సభ్యుల కాలపరిమితి
- ఎన్నికలు జరిగే 5 ఎమ్మెల్సీ స్థానాల తుది ఓటర్ల జాబితా విడుదల



సాక్షి, అమరావతి: త్వరలో ఎన్నికలు జరిగే మూడు పట్టభద్రులు, రెండు టీచర్ల ఎమ్మెల్సీ స్థానాలకు తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) విడుదల చేసింది. 3 పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల్లో 9,96,393 మంది ఓటర్లు ఉండగా, రెండు టీచర్ల స్థానాల్లో 54,681 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం-విజయనగరం - విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎంపికైన పీవీఎన్ మాధవ్, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎంపికై న వై.శ్రీనివాసులరెడ్డి, కడప-అనంతపురం -కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వెన్నపూస గోపాలరెడ్డి, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు టీచర్ల నియోజకవర్గం నుంచి విఠపు బాలసుబ్రమణ్యం, కడప-అనంతపురం-కర్నూలు టీచర్ల నియోజకవర్గం నుంచి కత్తి నరసింహారెడ్డిల పదవీ కాలం మార్చి 29,2023తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయా స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు కొత్త ఓటర్ల జాబితాను సీఈసీ విడుదల చేసింది.

నవంబర్1, 2022 నాటికి అర్హత ఉన్నవారికి ఓటు హక్కును కల్పిస్తూ కొత్త ఓటర్లను నవంబర్ 7 వరకు చేర్చుకొని నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు మీనా తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు ఆహ్వానించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్లు, తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సీఈవో ఆంధ్రా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. నామినేషన్లు వేసే 10 రోజుల ముందు వరకు కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలను స్వీకరించనుంది.

ఓటర్లు..పోలింగ్ స్టేషన్ల సంఖ్య ఇదీ...

3 పట్టభద్రుల నియోజకవర్గాల్లో కలిపి 9,96,393 మంది ఓటర్లు ఉంటే అందులో అత్యధికంగా ప్రకాశం-నెల్లూరు-చిత్తూరులో 3,83,396 మంది ఓటర్లు ఉన్నారు. వారి కోసం 320 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గంలో 3,29,248 మంది ఓటర్లకు గాను 358 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం-విజయనగరం- విశాఖ నియోజకవర్గంలో 2,83,749 మంది ఓటర్లకు 297 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు టీచర్ల నియోజకవర్గంలో 26,907 ఓటర్లకు 175 పోలింగ్ స్టేషన్లు, కడప-అనంతపురం-కర్నూలు టీచర్ల నియోజకవర్గంలో 27,774 మంది ఓటర్లకు 173 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	ముసాయిదా ఓటర్ల జాబితా	కొత్తగా చేర్చిన ఓటర్ల సంఖ్య	తొలగించిన ఓటర్ల సంఖ్య	తుది ఓటర్ల సంఖ్య
శ్రీకాకుళం-విజయనగరం- విశాఖ (పట్టభద్రులు)	297	2,42,903	50,730	10,884	2,83,749
ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు (పట్టభద్రులు)	320	3,64,288	30,866	11,758	3,83,396
కడప-అనంతపురం-కర్నూలు (పట్టభద్రులు)	358	2,91,089	46,070	7,911	3,29,248
ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు (టీచర్లు)	175	20,914	6,781	788	26,907
కడప-అనంతపురం-కర్నూలు(టీచర్లు)	173	22,256	6,126	608	27,774

పులుల కదలికలపై నిఘా..

- ఇందుకోసం ట్రాకింగ్ టీంల ఏర్పాటు
- అన్ని అటవీ డివిజన్లలో పర్యాటక ప్రాంతాల గుర్తింపు
- అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ శ్రీకాంత్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అటవీ డివిజన్లలో పులుల కదలికలపై పూర్తిస్థాయి నిఘా ఉంచామని, ఇందుకోసం ట్రాకింగ్ టీంల ఏర్పాటు చేస్తున్నామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం చింతపల్లి సర్కిల్ సీలేరు రేంజ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. వలసగడ్డ టేక్ ప్లాంటేషన్‌ను పరిశీలించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఒడిశా నుంచి ఓ ఆడ, మగపులి వచ్చాయని, అవి ప్రస్తుతం రాజమండ్రి అటవీ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు టైగర్ ట్రాకింగ్ ద్వారా గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ఆ రెండు పులులు పాడేరు డివిజన్ రబా బీట్ ఏరియాలో సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. విజయనగరం జిల్లాలో ఆడపులి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒక ఏనుగు సంచరిస్తున్నాయన్నారు. అటవీ శాఖ విశాఖ సర్కిల్ పరిధిలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. అటవీశాఖ అన్ని డివిజన్లలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే డీఎఫ్‌వోలను ఆదేశించామన్నారు. చింతపల్లి రహదారిలో ఉన్న బోడ కొండమ్మ ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అల్లూరి జిల్లాలో సరుకుడు జలపాతం వద్ద రెవెన్యూ విభాగం సహకారంతో పర్యాటకులకు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అటవీశాఖ అభ్యంతరాలతో రహదారుల నిర్మాణం నిలిచిపోయినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రహదారుల నిర్మాణానికి గానూ కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటించాల్సి ఉందని చెప్పారు. చింతపల్లి డీఎఫ్‌వో తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

- ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ కే సంతోషరావు

సింహాచలం (పెందుర్తి): రాష్ట్రంలో వ్యవసాయానికి నిరంతరాయంగా తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు పలు పథకాల ద్వారా వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ కే సంతోషరావు తెలిపారు. ఏపీ పవర్ డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ టెక్నికల్ డైరీ-2023 ఆవిష్కరణ సభ శుక్రవారం సాయంత్రం సింహాచలంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏపీఈపీడీసీఎల్‌లో ఉద్యోగ వ్యతిరేక విధానాలను విద్యుత్ సంస్థల అధికారులు గానీ, ప్రభుత్వం గానీ చేపట్టబోవన్నారు. ఉద్యోగులందరికీ ఏవిధమైన అన్యాయం జరగకుండా చూస్తామని తెలిపారు. ముఖ్యంగా 15 ఏళ్ల సర్వీసు పూర్తయినా పదోన్నతులు రాని సమస్య ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మహేశ్వరరెడ్డి , ప్రధాన కార్యదర్శి కేవీ శేషారెడ్డి , సంస్థ డైరెక్టర్లు బీ రమేష్ ప్రసాద్, డాక్టర్ ఏవీవీ సూర్యప్రతాప్, చంద్రం, విశాఖ ఎస్ఈ మహేంద్రనాథ్, అసోసియేషన్ విశాఖ సర్కిల్ అధ్యక్షుడు కే నరేంద్ర, కార్యదర్శి డీవీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకం అమలు అధ్యయనానికి కేంద్ర కమిటీలు

- జనవరి 3, 4 తేదీల్లో తెలుగు రాష్ట్రాల్లో పర్యటన
- ఏపీలో కర్నూలు, తెలంగాణలో రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన
- ఉపాధి కూలీలతో నేరుగా భేటీ
- 5న హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల సమావేశం

సాక్షి, అమరావతి : గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలనకు ఉపాధి హామీ పథకం ఏ మేరకు ఉపయోగపడుతోంది, పథకంలో చేయాల్సిన మార్పులపై అధ్యయనానికి కేంద్ర సాధికారత (ఎంపవర్డ్) కమిటీలు రాష్ట్రాల్లో పర్యటించనున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రిటైర్డు కార్యదర్శి, ప్రధాని సలహాదారు అమర్‌జీత్ సిన్హా నేతృత్వంలోని ఐదుగురు నిపుణుల కమిటీ ఈ నెల 3, 4 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించనుంది. న్యూఢిల్లీకి చెందిన కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ అశోక్ పంకజ్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్ డైరెక్టర్ సోనాల్దే దేశాయి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ ప్రవీణ మెహతో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీ అండ్ పీఆర్) ప్రొఫెసర్ జె.సత్యపాలన్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరు రెండు బృందాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో, తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తారు. ఈ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శిస్తారని, కూలీలతో నేరుగా మాట్లాడతారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు. అనంతరం జనవరి 5న హైదరాబాద్ ఎన్ఐఆర్‌డీలో దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీ సమావేశమవుతుంది. రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం అమలును పర్యవేక్షించే విభాగాల అధికారులు, పథకం అమలులో భాగస్వామ్యం ఉన్న సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్రం నుంచి ఒక గ్రామ సర్పంచి, ఒక గ్రామ కార్యదర్శి, ఒక ఎంపీడీవో పాటు పలు అధికారులు పాల్గొననున్నారు.

సంక్రాంతికి మరో 16 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగ రద్దీని మరింత తగ్గించే లక్ష్యంతో హైదరాబాద్ జంట నగరాల నుంచి విజయవాడ మీదుగా నర్సాపూర్, కాకినాడ టౌన్, తిరుపతి మధ్య మరో 16 ప్రత్యేక రైలు సర్వీసులు నడపనున్నారు. జనవరి 7న తిరుపతి-వికారాబాద్ (07050), 8న వికారాబాద్-కాకినాడ టౌన్ (07051), 9న కాకినాడ టౌన్-కాచిగూడ (07057), 10న కాచిగూడ-తిరుపతి (07058), 11న తిరుపతి-వికారాబాద్ (07070), 12న వికారాబాద్- నర్సాపూర్ (07071), 13న నర్సాపూర్-కాచిగూడ (07072), 14న కాచిగూడ-తిరుపతి (07073), 12న హైదరాబాద్-తిరుపతి (07083), 13న తిరుపతి-హైదరాబాద్ (07084), 14న హైదరాబాద్-నర్సాపూర్ (07085), 15న నర్సాపూర్-హైదరాబాద్ (07086), తిరుపతి-వికారాబాద్ (07079), 16న వికారాబాద్-నర్సాపూర్ (07080), 17న నర్సాపూర్-కాచిగూడ (07081), జనవరి 18న కాచిగూడ తిరుపతి (07082) నడపనున్నారు.

తేరుకుంటున్న బఫెలో

బఫెలో: వారానికి పైగా వణికించిన మంచు తుఫాను బారినుంచి అమెరికా క్రమంగా తేరుకుంటోంది. విమాన సేవలు తదితరాలు గాడిలో పడుతున్నాయి. ముఖ్యంగా తుఫానుతో తీవ్రంగా ప్రభావితమైన న్యూయార్క్ రాష్ట్రంలోని బఫెలో సిటీలో పరిస్థితి కుదుటపడుతోంది. ప్రయాణాలపై నిషేధం ఎత్తేశారు. తుఫానులో చిక్కిన వారికోసం ఇంటింటి గాలింపు ఇంకా కొనసాగుతోంది. నగరంలో ఇప్పటిదాకా కనీసం 40 మరణాలు నమోదయ్యాయి. మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తుఫాను కారణంగా ఎటుచూసినా అడుగుల కొద్దీ పేరుకుపోయిన మంచు శరవేగంగా కరుగుతోంది. ఇది వరదలకు దారి తీసే ఆస్కారమున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. మంచు తుఫాను కారణంగా దేశవ్యాప్తంగా కనీసం 540 కోట్ల డాలర్ల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బీమా కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

క్లుప్తంగా...

సూకీకి మరో ఏడేళ్ల జైలు




బ్యాంకాక్: మయన్మార్ పదవీచ్యుత నేత అంగ్ సాన్ సూకీ(77)కి మరో ఏడేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో, వివిధ అభియోగాలపై ఇప్పటి వరకు ఆమెకు కోర్టులు విధించిన జైలు శిక్షల మొత్తం సమయం 33 ఏళ్లకు పెరిగింది. ఆమెపై మోపిన ఐదు అభియోగాలపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ప్రభుత్వ హెలికాప్టర్‌ను మంత్రి ఒకరికి అద్దెకు ఇవ్వడంలో ఆమె నిబంధనలను పాటించలేదని పేర్కొంటూ ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. 2021 ఫిబ్రవరిలో సూకీ సారథ్యంలోని ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చి, సూకీ సహా వేలాది మందిని మిలటరీ పాలకులు దిగ్బంధించిన విషయం తెలిసిందే. కోర్టులు ఆమెపై మోపిన ఆరోపణలపై రహస్యంగా విచారణలు జరిపి, శిక్షలు ప్రకటిస్తున్నాయి. తనపై చేస్తున్న ఆరోపణలన్నీ వట్టివేనంటూ సూకీ కొట్టిపారేస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సూకీని వెంటనే విడుదల చేయాలంటూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి గత వారం సైనిక పాలకులను కోరింది.

ఇక మరింత సహకారం

పుతిన్, జిన్‌పింగ్ నిర్ణయం

కీవ్: రష్యా, చైనా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ఇరు దేశాల అధినేతలు పుతిన్, షీ జిన్‌పింగ్ నిర్ణయానికొచ్చారు. వారు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మినహా పలు అంశాలపై చర్చించుకున్నారు. భేటీని టీవీల్లో ప్రసారం చేశారు. సంక్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా రష్యా, చైనా బంధం బలోపేతం అవుతుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇరు దేశాల సైన్యాలు పరస్పరం సహకరించుకోవాలని పుతిన్ ఆకాంక్షించారు! రెండు దేశాల సంబంధాల్లో సైనిక సహకారానికి 'ప్రత్యేక ప్రాధాన్యం' ఉందని ఉద్ఘాటించారు. రష్యా, చైనా సైనిక దళాల నడుమ సహకారం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రష్యాలో పర్యటించాలని జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు.

భద్రతపై రాజీ లేదు: రాజ్‌నాథ్



తిరువనంతపురం: ''భారతదేశం పొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటుంది. అదే సమయంలో జాతీయ భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోదు'' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. శివగిరి మఠం 90వ వార్షిక తీర్థయాత్రప్రారంభం సందర్భంగా శుక్రవారం ఇక్కడ ఆయన మాట్లాడారు. సంఘ సంస్కర్త నారాయణ గురు బోధనల స్ఫూర్తితోనే కేంద్రం ఆత్మ నిర్భర్ పథకాన్ని తెచ్చిందన్నారు. దేశాన్ని, సరిహద్దులను రక్షించేందుకు ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో తాను కృషి చేస్తుండగా, దేశ ఆత్మను పరిరక్షించేందుకు శివగిరి మఠం సాధువులు కృషి చేస్తున్నారన్నారు.

ఆ కేసులను వేగంగా పరిష్కరించండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మోటార్ వాహనాల ప్రమాదాల క్లెయిమ్ కేసులను వేగంగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇందుకోసం మూడు నెలల్లోగా పోలీసు స్టేషన్లలో ప్రత్యేక యూనిట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. రోడ్డు ప్రమాద క్లెయిముకు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌ఏ నజీర్, జేకే మహేశ్వరితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. ''రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. దర్యాప్తు అధికారి మోటారు వాహనాలు(సవరణ) నిబంధనలు–2022 ప్రకారం నడుచుకోవాలి. ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్టును 48 గంటల్లోగా క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌కు సమర్పించాలి'' అని పేర్కొంది.

కాంగ్రెస్‌లోకి పోను: ఆజాద్

న్యూఢిల్లీ: మళ్లీ కాంగ్రెస్‌లోకి వెళ్లే యోచనేదీ లేదని సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ చెప్పారు. తన పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలే ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. 'నాతో కాంగ్రెస్ నేతలెవరూ మాట్లాడలేదు. నేను కూడా ఆ పార్టీ నేతలెవ్వరితోనూ టచ్‌లో లేను'' అని చెప్పారు. జనవరిలో కశ్మీర్‌లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొంటారా అని ప్రశ్నించగా, ఇప్పటిదాకా అలాంటి ఆలోచనే లేదని బదులిచ్చారు.

మోదీకి మాతృవియోగం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన హీరాబెన్

- పాడె మోసిన ప్రధాని మోదీ
- వెల్లువెత్తిన సంతాప సందేశాలు



తల్లి చితి వద్ద విషణ్ణ వదనంతో మోదీ

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ కన్నుమూశారు. వందేళ్ల సంపూర్ణ జీవితం గడిపిన ఆమె అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3.30 గంటలకు తుది శ్వాస విడిచారు. రెండు రోజుల క్రితమే అనారోగ్యంతో ఆమె ఆసుపత్రిలో చేరారు. హీరాబెన్‌కు ప్రధాని మోదీ సహా అయిదుగురు కుమారులు సోమాభాయ్, అమృత్, ప్రహ్లాద్, పంకజ్, కుమార్తె వాసంతిబెన్ ఉన్నారు. తల్లి మరణవార్త తెలిసిన వెంటనే ప్రధాని మోదీ వెంటనే గాంధీనగర్‌కు బయల్దేరి వెళ్లారు. గాంధీనగర్ శివార్లలో రేసన్ గ్రామంలో నివాసం ఉంటున్న తన సోదరుడు పంకజ్ మోదీ నివాసంలో ఉంచిన తల్లి భౌతిక కాయాన్ని సందర్శించిన మోదీ ఆమెకు పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. పాదాభివందనం చేశారు. అనంతరం ప్రధాని స్వయంగా ఆమె పాడె మోస్తూ వైకుంఠ రథం వరకు తీసుకువెళ్లారు. తల్లి భౌతికకాయంతో పాటు అదే వాహనంలో మోదీ బాధాతప్త హృదయుడై ప్రయాణించారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో గాంధీనగర్ శ్మశాన వాటికలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో అంత్యక్రియలు ముగిశాయి. ప్రధాని మోదీ గుజరాత్ పర్యటనకు వెళ్లినప్పుడల్లా తల్లితో కాసేపు గడిపేవారు. తన పుట్టిన రోజు నాడు వెళ్లి తల్లి ఆశీర్వాదం తీసుకునేవారు. దేశ ప్రధాన మంత్రికే తల్లి అయినప్పటికీ హీరాబెన్ ఎంతో నిరాడంబరమైన జీవితం గడిపారు.

అత్యంత విషాదం

ప్రధాని తల్లి హీరాబెన్ మరణవార్త విన్న ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా మోదీకి సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ తల్లి వందేళ్ల పోరాటం భారతీయ ఆదర్శాలకు నిదర్శనంగా నిలుస్తుందని మాతృదేవోభవ స్ఫూర్తికి ప్రధాని కట్టుబడి ఉన్నారని, హీరాబెన్ ఆత్మకు శాంతి కలగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. అమ్మతనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే హీరాబా ఆత్మకు శాంతి చేకూరాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ట్వీట్ చేశారు. తల్లిని మించిన గురువు, దైవం, స్నేహితురాలు ఉండరని, ప్రపంచంలోని అతి పెద్ద దుఃఖం తల్లిని కోల్పోవడమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ తల్లిని కోల్పోవడం అత్యంత బాధాకరమైనదని, ఇలాంటి సంక్లిష్ట సమయాలను ఎదుర్కొనే ధైర్యం ఆ కుటుంబానికి ఉండాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా హీరాబెన్ మృతి బాధాకరమని ప్రధాని కుటుంబానికి సంతాపం తెలియజేశారు. బీజేపీ నాయకుడు అడ్వాణీ ప్రధానికి తన తల్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నిరాడంబరంగా గడిపిన ఆమె జీవితం ఎప్పటికీ మరువలేనిదన్నారు.

ప్రపంచ నేతల సంతాపం

ప్రపంచ దేశాల అధినేతలు కూడా ప్రధాని మోదీకి సంతాపం తెలియజేశారు. జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, నేపాల్ ప్రధాని ప్రచండ, పాకిస్తాన్ ప్రధానిమంత్రి షెబాజ్ షరీఫ్‌లు ట్విటర్ వేదికగా సంతాపాన్ని తెలియజేశారు. తల్లి లేని లోటు పూడ్చలేనిదని ఆ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని తమ తమ సంతాప సందేశాల్లో పేర్కొన్నారు.''తల్లిని కోల్పోవడం కంటే మించిన లోటు ప్రపంచంలో ఏదీ ఉండదు. భారత ప్రధాని మోదీకి సంతాపం తెలియజేస్తున్నాను'' అని పాక్ ప్రధాని షరీఫ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

తల్లీ.. నిను తలంచి...!

తల్లి గురించి ప్రధాని మోదీ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. ''నా తల్లి వందేళ్ల గొప్ప ప్రయాణాన్ని పూర్తి చేసుకొని భగవంతుడి పాదాల చెంతకు చేరారు. ఆమెలో నాకు ఎప్పుడూ మూడు గొప్ప సుగుణాలు కనిపిస్తాయి. తపస్సులాంటి జీవితం, నిస్వార్థపర సేవా తత్వం, విలువలకు కట్టుబడి జీవితం. ఇలా ఆమెలో త్రిమూర్తులు కనిపిస్తారు. 100వ పుట్టిన రోజు నాడు అమ్మను కలిసినప్పుడు ఆమె నాతో 'నీ బుద్ధి చెప్పినట్టుగా పని చేయి. పరిశుద్ధంగా జీవితాన్ని గడుపు' అని చెప్పారు. ఆ మాటలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాను'' అన్నారు. గత జూన్‌లో హీరా బెన్ 100వ పుట్టిన రోజు సందర్భంగా కూడా ఆమె గురించి మోదీ తన బ్లాగ్‌లో రాసుకున్నారు. ''సాదాసీదా జీవితం గడిపినా ఆమె ఒక అసాధారణ మూర్తి. మేం ఆరుగురు పిల్లలం. మమ్మల్ని పెంచేందుకు ఎంతో కష్టపడింది. పరిశుభ్రతకు ప్రాణమిచ్చేది. అదే సమయంలో సామాజిక బాధ్యతలనూ నెరవేర్చింది. పంచాయతీ నుంచి లోక్‌సభ దాకా ప్రతి ఎన్నికల్లోనూ విధిగా ఓటేసింది. గుజరాత్ సీఎం అయ్యాక తొలిసారిగా తన ఆశీర్వాదం కోసం వెళ్తే అవినీతికి పాల్పడొద్దని ఒకే సలహా ఇచ్చింది'' అని గుర్తు చేసుకున్నారు. మొత్తం ఆరుగురు సంతానంలో మోదీ మూడోవారు.

అగ్ర రాజ్య వేదికపైనా...

2015లో అమెరికాలో పర్యటించిన మోదీ సిలికాన్ వ్యాలీలో ఫేస్‌బుక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తన తల్లి గొప్పదనాన్ని, ఆమె అనుభవించిన కష్టాలను గుర్తు చేసుకుని తీవ్ర భావోద్వేగానికి లోనైన తీరు ఆహూతులతోనూ కంటతడి పెట్టించింది. మీ జీవితంలో తల్లి పాత్ర ఏమిటన్న ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ప్రశ్నకు బదులిచ్చే క్రమంలో ప్రధాని కన్నీళ్లపర్యంతమయ్యారు. ''మమ్మల్ని పెంచేందుకు అమ్మ ఇరుగుపొరుగు ఇళ్లలో అంట్లు తోమడం, నీళ్ల పట్టడం వంటి ఎన్నో పనులు చేసింది'' అంటూ ఆమె ఎదుర్కొన్న కష్టాలను, వాటిని అధిగమించడంలో కనబరిచిన మనో నిబ్బరాన్ని గద్గద స్వరంతో వివరించారు. ''అమ్మకిప్పుడు 90 ఏళ్లు దాటినా అన్ని పనులూ తానే చేసుకుంటుంది. అక్షర జ్ఞానం లేకపోయినా టీవీలో వార్తలు చూసి ప్రపంచంలో ఏం జరుగుతున్నదీ తెలుసుకుంటూ ఉంటుంది'' అని చెప్పారు.

తల్లి పోయిన దుఃఖాన్ని దిగమింగుకొని..

- కొన్ని గంటల్లోనే విధుల్లోకి ప్రధాని
- కర్మయోగిగా అభివర్ణించిన బీజేపీ



1992లో గుజరాత్‌లో ఏక్తా యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన మోదీకి తిలకం దిద్దుతున్న హీరా బెన్

అహ్మదాబాద్: తల్లిని కోల్పోయిన దుఃఖం దిగమింగి ఆమె అంత్యక్రియలు ముగిసిన గంటల్లోనే ప్రధాని నరేంద్ర మోదీ తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఆయన పశ్చిమ బెంగాల్‌లో పర్యటించి పలు ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. తల్లి మరణించడంతో పర్యటనను రద్దు చేసుకున్నా వర్చువల్ విధానంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. నేషనల్ గంగ కౌన్సిల్ భేటీలోనూ పాల్గొన్నారు. ఇలా రోజంతా బిజీగా గడిపారు.

తల్లి అంత్యక్రియలు ముగియగానే మోదీ తిరిగి విధుల్లో పాల్గొన్న మోదీని కర్మయోగిగా బీజేపీ నేతలు అభివర్ణించారు. మోదీ తన కేబినెట్ సహచరులకి కూడా ముందస్తుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. ''అమ్మ లేని శోకంతో గుండె భారమైనా ప్రధానికి దేశమే ముఖ్యం. విధి నిర్వహణలో ఆయన కర్తవ్యదీక్ష మరువలేనిది'' అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ప్రధాని మోదీ విధి నిర్వహణ, అంకితభావం, త్యాగనిరతి తిరుగులేనివని మరో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రశంసించారు. ''స్వార్థం కంటే దేశమే ప్రధానికి ముఖ్యం. ఆయన మనకందరికీ గర్వకారణం''అంటూ పలువురు బీజేపీ నేతలు ట్వీట్లు చేశారు.

పనిలో పడడమే నిజమైన నివాళి

బీజేపీ కార్యకర్తలు, మోదీ అభిమానులెవరూ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అహ్మదాబాద్ రావొద్దని ఆయన కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఎవరి కార్యక్రమాల్లో వారు పాల్గొనడమే హీరా బెన్‌కు నిజమైన నివాళి అన్నారు.

రైల్వేలో రికార్డు పెట్టుబడులు: మోదీ

హౌరాలో వందేభారత్ రైలు ప్రారంభం

కోల్‌కతా: రికార్డు స్థాయిలో పెట్టుబడుల ద్వారా దేశంలో రైల్వే మౌలిక సదుపాయాలను ఆధునీకరిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నుంచి న్యూ జల్పాయ్‌గురి దాకా నడిచే ఏడో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన శుక్రవారం వర్చువల్‌గా పచ్చజెండా ఊపారు. మరో నాలుగైదు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లను విమానాశ్రయాల తరహాలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

సంస్కరణలు అత్యవసరం

''వందేమాతర నినాదం పురుడు పోసుకున్న గడ్డపై వందేభారత్ రైలును ప్రారంభించడం హర్షణీయం. 1943లో డిసెంబర్ 30వ తేదీనే నేతాజీ సుభాష్ చంద్రబోస్ అండమాన్ నికోబార్ దీవుల్లో త్రివర్ణ పతాకం ఎగురవేశారు. దేశంలో వేగవంతమైన ప్రగతిలో రైల్వే సంస్కరణలు కీలకం. పశ్చిమ బెంగాల్‌లో గంగా ప్రక్షాళనకు కేంద్రం ఎన్నో చర్యలు చేపట్టింది. యూపీలోని వారణాసి నుంచి బంగ్లాదేశ్ మీదుగా అస్సాంలోని దిబ్రూగఢ్ దాకా 3,200 కిలో మీటర్లు సాగే పర్యాటక నౌక జనవరి 13న ప్రారంభం కానుంది. ప్రపంచంలో ఇలాంటి ప్రయాణాల్లో ఇదే మొదటిది. మన దేశంలో క్రూయిజ్ టూరిజం ప్రగతికి ఇదొక నిదర్శనం'' అని మోదీ ఉద్ఘాటించారు.

మమత అసహనం

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం సందర్భంగా హౌరా స్టేషన్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. బీజేపీ నేతలు, కార్యకర్తలు 'జైశ్రీరామ్' అంటూ నినాదాలు చేయడంతో సీఎం మమతా బెనర్జీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వేదికపై కూర్చొనేందుకు నిరాకరించారు. ఆహ్వానితులతోపాటు వేదిక కింద కుర్చీలో కూర్చున్నారు.

అమెరికా విమానాన్ని ఢీ కొట్టబోయిన చైనా యుద్ధ విమానం

- దక్షిణ చైనా సముద్రంపై ఘటన
- ఇరు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు



అమెరికా విమానానికి అత్యంత సమీపానికి వెళ్లిన చైనా ఫైటర్ జెట్

బీజింగ్: దక్షిణ చైనా సముద్రంపై అమెరికా, చైనా మధ్య మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. అమెరికా నిఘా విమానాన్ని చైనాకు చెందిన యుద్ధ విమానం దక్షిణ చైనా సముద్ర జలాలపై దాదాపుగా ఢీ కొట్టబోయింది. చైనా జెట్ అత్యంత ప్రమాదకరంగా దూసుకురావడంతో అమెరికా నిఘా విమానం పైలట్ చాకచక్యంగా వ్యవహరించి ముప్పుని తప్పించారు. ఇది డిసెంబర్ 21న జరిగిందని అమెరికా ఇండో పసిఫిక్ కమాండ్ వెల్లడించింది. ''అమెరికా వైమానిక దళానికి చెందిన ఆర్‌సీ–135 దక్షిణ చైనా సముద్రంపై ప్రయాణిస్తుండగా చైనా జే–11 ఫైటర్ జెట్ కేవలం 6 మీటర్ల (20 అడుగులు) దూరంలోకి వచ్చింది. దాదాపుగా ఢీకొట్టినంత పనయింది. దక్షిణ చైనా సముద్రంపై అంతర్జాతీయ గగనతలంలో మేం యథావిధిగా చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటే చైనా ఇలా యుద్ధ విమానాలతో సవాల్ విసురుతోంది'' అంటూ నిందించింది. 2001లో చైనా చేసిన ఇలాంటి పని వల్ల ఆ దేశ విమానం కుప్పకూలి పైలట్ దుర్మరణం పాలయ్యాడని గుర్తు చేసింది. దక్షిణ చైనా సముద్రంపై చైనాకు ఎలాంటి హక్కు లేదని అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చినా డ్రాగన్ దేశం వెనక్కి తగ్గడం లేదు. అక్కడ అమెరికా యుద్ధ విమానాలను, నౌకలను మోహరిస్తూ విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించడం దానికి మింగుడు పడడం లేదు. అమెరికా తన నిఘా కార్యకలాపాలతో చైనాకు పెనుముప్పుగా మారిందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ ఆరోపించారు. దక్షిణ చైనా సముద్రం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలైనా చేపడతామని స్పష్టం చేశారు.

2023: మెరిసేనా.. ఉరిమేనా?

ఎస్.రాజమహేంద్రారెడ్డి

మరో ఇరవై నాలుగు గంటల్లో రెండు వేల ఇరవై రెండు జ్ఞాపకాల పుటల్లోకి వెళ్లిపోతుంది. జ్ఞాపకం ఎప్పుడూ గుర్తుగానే మిగిలిపోతుంది. టైమ్ మెషీన్‌లో వెనక్కు వెళ్లి అనుభవంలోకి తెచ్చుకోలేము. కొన్ని జ్ఞాపకాలు కంటినుంచి జారిపడ్డ మెరుపుల్లాగా పెదవులపై చిరునవ్వులు వెలిగిస్తాయి. మరికొన్ని కన్నీటి చుక్కల్లా అప్రయత్నంగా ఒలికిపోయి ఘనీభవిస్తాయి. అప్పుడప్పుడు భయపెడతాయి. 2020, 2021 సంవత్సరాలు ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపి మానవాళికి అంతులేని విషాదాన్ని, నిర్వేదాన్ని, మానసిక ఒత్తిడిని మిగిల్చి వెళ్లాయి. 2022 ఆశాజనకంగానే ఆరంభమై భయంభయంగానే అయినా మందహాసంతో మందగమనంగా కొనసాగుతున్న వేళ ఒకరి రాజ్యకాంక్ష యుద్ధ రూపంలో విరుచుకుపడింది. యుద్ధం తాలూకు దుష్పరిణామాలు ప్రపంచాన్ని నిర్దాక్షిణ్యంగా మాంద్యంవైపు నెట్టాయి. ఏడాది చివర్లో కంటికి కనిపించని వైరస్ ఒకటి మరోసారి రాబోయే గడ్డు పరిస్థితులను కళ్లకు కట్టడం మొదలుపెట్టింది. ఉగాది పచ్చడిలా తీపి, చేదులను రుచి చూపించిన 2022 మానవాళికి కొంతలో కొంత ఉపశమనం కలిగించి వెళ్లిపోతోంది. మరి 2023 కొత్త ఆశలకు ఊపిరులూదుతుందా, లేక ఉన్న ఉసురూ తీస్తుందా? చూడాల్సిందే! వెళ్లిపోనున్న ఈ ఏడాది ప్రభావం రానున్న ఏడాదిపై ఎంతమేరకు పడనుందో ఒకసారి చూద్దాం...



మాంద్యం... ముంచుకొస్తోంది!



రోజురోజుకూ పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో నిత్యావసరాల ధరలు రాకెట్ వేగంతో చుక్కలవైపు దూసుకెళుతున్నాయి. కరోనా భయాలు, ఆంక్షలు రెండేళ్లపాటు ప్రపంచ ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసి వృద్ధి రేటును పాతాళంలోకి నెట్టేశాయి. ఫలితంగా ఈ ఏడాది ద్రవ్యోల్బణం గత దశాబ్దంలోకెల్లా గరిష్టానికి చేరుకుంది. ఇది వచ్చే ఏడాది మరింత పైపైకి ఎగబాకి దాదాపు ప్రపంచాన్ని యావత్తూ మాంద్యంలోకి నెడుతుందని విశ్లేషకుల అంచనా. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ఓ కొలిక్కి రాకపోవడం మాంద్యానికి మరింత ఆజ్యం పోస్తుందని వారి విశ్లేషణ. ద్రవ్యోల్బణాన్ని అరికడితే మాంద్యం బారిన పడకుండా బయటపడే అవకాశం ఉంటుందనేది ఆర్థిక నిపుణుల అభిప్రాయం. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులన్నీ ఈ ఏడాది ఇప్పటికే పలుమార్లు వడ్డీరేట్లు పెంచాయి. వచ్చే ఏడాది కూడా వడ్డీరేట్లు మరింత పెరిగే అవకాశముంది. అమెరికాలో ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఒక దశలో గత 40 ఏళ్లలో గరిష్ఠంగా ఏకంగా 9 శాతానికి ఎగబాకడం ప్రపంచ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఫలితంగా ఆహార పదార్థాల ధరలు పెరగడం సగటు మనిషికి కోలుకోని దెబ్బే. పెట్రో ధరలు పెరగడం మధ్యతరగతి జీవితాలను పెనంమీది నుంచి పొయ్యిలోకి నెట్టింది. ఒకవైపు ద్రవ్యోల్బణం వేడి, మరోవైపు మాంద్యం బూచి పలు కార్పొరేట్ సంస్థలను తీవ్ర ఆలోచనలో పడేయడంతో ఖర్చు తగ్గించుకునేందుకు అవి ఉద్యోగాల కోతవైపు దృష్టి సారించాయి. ఫలితంగా పలు దేశాల్లో నిరుద్యోగిత మరింత పెరిగింది. అమెరికా, బ్రిటన్, పలు యూరప్ దేశాలు ద్రవ్యోల్బణంతో సతమతమవుతుంటే భారత్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉండటం గమనార్హం. భారత్‌లో ద్రవ్యోల్బణం ప్రస్తుతం 5.9 శాతంగా ఉంది. అయితే వచ్చే ఏడాది పరిస్థితి మెరుగవుతుందని ఆశించలేం. అంతో ఇంతో మాంద్యం ఊబిలో చిక్కక తప్పని పరిస్థితులు ఎదురవ్వవచ్చు. వచ్చే ఏడాది బడ్జెట్లో దేశ ఆర్థిక వ్యవస్థను విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ఏ మేరకు సరిచేస్తారో వేచి చూడాల్సిందే. ప్రపంచంలోని మిగతా దేశాల పరిస్థితి కూడా ఊగిసలాటగానే ఉంది. మరీ శ్రీలంకలాగా దిగజారకున్నా వచ్చే ఏడాది అన్ని దేశాలపైనా మాంద్యం కత్తి వేలాడుతూనే ఉంటుంది. వచ్చే ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 100 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఈ ఏడాదంతా ఊదరగొట్టిన అధ్యయన సంస్థలు, అది కొంచెం కష్టమేనని తాజాగా అంగీకరిస్తుండటం గమనార్హం. మాంద్యం భయం అంచనాలనూ తారుమారు చేస్తోంది!

యుద్ధం... వెన్ను విరుస్తోంది!



నిజం చెప్పాలంటే ఈ ఏడాది జనవరి నెల ఒక్కటే ప్రశాంతంగా గడిచింది. కరోనా రక్కసి పీడ పోయిందని ప్రపంచం ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో యుద్ధం మరో దయ్యంలా దాపురించింది. 2020, 2021ల్లో మానవాళిని కరోనా వెంటాడితే ఈ ఏడాదిని రష్యా అధ్యక్షుడు పుతిన్ రాజ్యకాంక్ష వెంటాడింది. ఫిబ్రవరిలో రష్యా ఉన్నట్టుండి ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగి తన యుద్ధోన్మాదాన్ని ప్రపంచంపై రుద్దింది. తన అదృశ్య స్నేహితుడు చైనాతో కలిసి రష్యా ఒకవైపు, అమెరికా వత్తాసుతో ఉక్రెయిన్ మరొకవైపు మోహరించాయి. ఇప్పుడు డిసెంబరులో ఉన్నాం. యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. కొత్త సంవత్సరంలోకీ అడుగు పెడుతోంది. ముమ్మరమా.. ముగింపా.. చెప్పలేం! రెండేళ్లుగా తూర్పు ఆఫ్రికాలో కొనసాగుతున్న యుద్ధం దాదాపు ఆరు లక్షల మందిని కబళించినా ఇంకా కొలిక్కి రాలేదు. వస్తుందనే నమ్మకమూ దరిదాపుల్లో లేదు. మరోవైపు సిరియా, యెమన్‌లలో జరుగుతున్న అంతర్యుద్ధాల పరిస్థితీ ఇదే. వాటి పర్యవసానాలు ఆయా దేశాలకే పరిమితమైనా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మాత్రం ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా దేశాలు తటస్థంగా ఉన్నప్పటికీ ఈ యుద్ధం ప్రపంచాన్ని రెండు శిబిరాలుగా చీల్చింది. మరోవైపు పెట్రో ధరలపైనా, గోధుమ, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాల ధరలపైనా తీవ్ర ప్రభావం చూపింది. క్రూడాయిల్ ఎగుమతుల్లో రష్యా (14 శాతం), గోధుమ, మొక్కజొన్న ఎగుమతుల్లో రష్యా, ఉక్రెయిన్ (25 శాతం) అగ్ర భాగాన ఉన్న సంగతి తెలిసిందే. వీటిపైనే ఆధారపడ్డ చాలా దేశాలు ఇప్పటికే చమురు కొరతను, ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వచ్చే ఏడాది ఇది మరింత తీవ్రతరం కానుంది. ఎందుకంటే యుద్ధాన్ని ఆపాలన్న ఉద్దేశం పుతిన్, జెలెన్‌స్కీల్లో ఏ కోశానా ఉన్నట్టు కన్పించడం లేదు. యుద్ధం విషాదమే గానీ ఆపే ఉద్దేశం లేదని పుతిన్ ఇటీవలే బాహాటంగా స్పష్టం చేశారు. రష్యా ముందు సాగిలపడటానికి ససేమిరా అంటున్న జెలెన్‌స్కీ పోరాడితే పోయేదేమీ లేనట్టు ముందుకు సాగుతున్నారు. దౌత్య చర్చలకు మొగ్గు చూపుతూనే అదనపు ఆయుధ సమీకరణకు నాటో మిత్ర దేశాల వైపు చూస్తున్నారు. ఇటీవలే అమెరికా వెళ్లి అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అవడమే గాకుండా తన ఆయుధపాదిలో పేట్రియాటిక్ క్షిపణులను సమకూర్చుకున్నారు. సంధి కోసమో, కనీసం యుద్ధ విరామం కోసమో ప్రయత్నించాల్సిన అమెరికా లాంటి దేశాలు చోద్యం చూస్తూ కూర్చున్నాయే తప్ప ఆ దిశగా ఎలాంటి చొరవా చూపడటం లేదు. మరోవైపు యుద్ధాన్ని రష్యా తీవ్రతరం చేసింది. ఉక్రెయిన్‌పై రోజుల తరబడి క్షిపణుల వర్షం కురిపిస్తోంది. గురువారం ఒక్క రోజే 120కి పైగా క్షిపణులను ప్రయోగించిందంటే రాబోయే రోజుల్లో యుద్ధం ఏ దశకు చేరుకోనుందో ఊహించవచ్చు. 2023లోకి అడుగు పెడుతున్న యుద్ధం 2024ను కూడా పలకరించేలా కన్పిస్తోంది.

కరోనా... వణికిస్తోంది!



గడచి రెండేళ్లు (2020, 2021) కరోనా నామ సంవత్సరాలైతే ఈ ఏడాది (2022) కరోనా ఫ్రీ సంవత్సరమని చెప్పుకోవచ్చు. అయితే అది నవంబర్ వరకే. డిసెంబర్‌లో చైనా మళ్లీ కొత్త వేరియంట్‌తో సరికొత్త కరోనా బాంబు పేలింది. కరోనా వైరస్ మానవ సృష్టేనన్న వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో కొత్త వేరియంట్ చైనా పాలిట భస్మాసుర హస్తమైంది. ప్రతి రోజూ లక్షల్లో కేసులు, వేలల్లో మరణాలు అంటూ చైనా నుంచి వస్తున్న వార్తలు ప్రపంచాన్ని మరోసారి ఉలిక్కిపడేట్టు చేశాయి. చైనాలో వైరస్ ఉనికి కనిపించిన ఒకట్రెండు నెలలకు ప్రపంచానికి వ్యాపించడం, లేదా విస్తరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో చైనాలో ప్రత్యక్షమైన కొత్త వేరియంట్ వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలోగా ఇతర దేశాలకు పాకడం ఖాయమని వైద్య నిపుణుల అంచనా. కరోనాతో సహజీవనం చేసిన చాలా దేశాల్లోని జనాలకు ఈ కొత్త వేరియంట్ ప్రాణాంతకం కాకపోవచ్చు కానీ కొంత మేరకు ఇబ్బంది పెట్టే అవకాశముందని వారి విశ్లేషణ. చైనా ప్రజలు రెండేళ్లుగా కరోనా వైరస్‌కు అల్లంత దూరాన తమను తాము బందీ చేసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తికి దూరమయ్యారు. ఇప్పుడు ఒక్కసారిగా కరోనా ఆంక్షలు ఎత్తేయడంతో వైరస్ ప్రభావం నుంచి తప్పించుకోలేక సతమతమవుతున్నారు. అంతర్జాతీయ ప్రయాణాలపై కూడా తాజాగా చైనా ఆంక్షలు ఎత్తేయడం ప్రపంచ దేశాలను వణికిస్తోంది. ఇప్పటికే చాలా దేశాలు చైనానుంచి వచ్చే ప్రయాణికులకు కోవిడ్ పరీక్ష తప్పనిసరి చేశాయి. చైనా ప్రపంచానికి వెల్లడించింది ఒక్క వేరియంట్ గురించేనని, నిజానికి అక్కడ మరో డజనుకు పైగా కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చాయని వార్తలు వినవస్తున్నాయి. అదే నిజమైతే ఏ వైపునుంచి ఏ వేరియంట్ వచ్చి మీద పడుతుందో ఊహించడం కష్టం. టీవీలు, వార్తా పత్రికలు ఊదరగొడుతున్నట్టుగా చైనాలో గడ్డు పరిస్థితులేమీ లేవని, అదంతా పశ్చిమ దేశాల కుట్రేనన్నది మరో వాదన. కరోనా వ్యాక్సీన్లను అమ్ముకోవడానికి ఫార్మా కంపెనీలు అల్లుతున్న కట్టుకథలేనన్నది ఇంకో వాదన. ఎవరి వాదన ఎలా ఉన్నా ఇప్పటికైతే ఇంకా కఠినమైన కరోనా ఆంక్షలేవీ అమల్లోకి రాలేదు. అయితే జనవరి, ఫిబ్రవరి నెలల్లో భారత్‌లో కూడా కేసులు పెరిగే అవకాశం లేకపోలేదని నిపుణులు అనుమానిస్తున్నారు. అదే జరిగితే వచ్చేది మరో కరోనానామ సంవత్సరమే అవుతుమంది. లేదంటే కరోనా ఫ్రీ ఏడాదిగా అందరి ముఖాలపై ఆనందాన్ని వెలిగిస్తుంది!


చిత్తూరు జిల్లా తాళంబేడులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


కృష్ణా జిల్లా కడవకొల్లులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

గడప గడపకు మన ప్రభుత్వం


వైఎస్సార్ జిల్లా కేతవరంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి

క్లుప్తంగా...

జగనన్న ఇళ్లకు 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్

ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

గుంటూరు ఈస్ట్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని చెప్పారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు సకాలంలో వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్, సీఆర్‌డీఏ ఇన్‌చార్జి ఎస్ఈ పి.విజయకుమార్, డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందాలు శుక్రవారం తనిఖీలు నిర్వహించాయి. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుకకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. రాష్ట్రంలో 54 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద, 57 పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక అమలును అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వం అందించిన యూనిఫాం, బూట్లు, బ్యాగులు విద్యార్థులకు చేరాయో.. లేదో.. తనిఖీలు చేశారు. పలు పాఠశాలల్లో గుర్తించిన లోపాలపై నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో చంద్రకళకు రజతం



సాక్షి, అమరావతి: జాతీయ సీనియర్ పవర్‌లిఫ్టింగ్–2022 చాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి ఎస్.చంద్రకళ సత్తా చాటింది. మొత్తం 527.5 కేజీల బరువు ఎత్తి ఓవరాల్ విభాగంలో రజతం, ఇంటర్ స్టేట్‌లో బంగారు పతకం సాధించింది. రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ నగరంలో జరుగుతున్న 40వ జాతీయ మహిళా సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శుక్రవారం స్క్వాట్‌లో 210 కేజీల బరువునెత్తి కాంస్యం, బెంచ్ ప్రెస్‌లో 115 కేజీల బరువునెత్తి కాంస్యం, డెడ్ లిఫ్ట్‌లో 202.5 కేజీల బరువు ఎత్తి రజత పతకాలను కైవసం చేసుకుంది.

జనసేనతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఆయన శుక్రవారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యలపై 13వేల గ్రామాల్లో 'సమస్యల ఆధారిత యాత్ర' పేరిట పాదయాత్రను జనవరి చివరి వారంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కర్నూలు, హిందూపురంలో నిర్వహించనున్న బహిరంగ సభల్లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొంటారని చెప్పారు. కందుకూరులో చంద్రబాబు సభను పోలీసులు లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షించకపోవడం వల్లే తొక్కిసలాట జరిగి ఎనిమిది మంది మృతిచెందారని తెలిపారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్ పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో మహిళలదే న్యాయ వ్యవస్థ

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్


హైకోర్టు న్యాయమూర్తులతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్



సాక్షి, అమరావతి: న్యాయ వ్యవస్థలో రాబోయే కాలమంతా మహిళలదేనని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ తెలిపారు. న్యాయ వ్యవస్థలోకి మహిళలు రావడం బాగా పెరిగిందని, ప్రస్తుతం పురుషులతో సమానంగా వారున్నారని, ఇది గొప్ప శుభపరిణామమన్నారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, చాలా కోర్టుల్లో మహిళలకు కనీసం మరుగుదొడ్లు కూడా లేవని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఇలాంటి పరిస్థితి కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడుతూ వలసవాద ఆలోచన విధానాల నుంచి న్యాయ వ్యవస్థ బయటకు రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కిందిస్థాయి న్యాయవ్యవస్థను తక్కువచేసి చూడటం మానుకోవాలన్నారు. నిజానికి.. న్యాయవ్యవస్థకు కిందిస్థాయి న్యాయవ్యవస్థే వెన్నెముక అని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. కిందిస్థాయి న్యాయవ్యవస్థ అని పేరు ఉన్నంత మాత్రాన, అది సుప్రీంకోర్టు, హైకోర్టుల కింద పని చేస్తున్నట్లు ఎంతమాత్రం కాదని వివరించారు. కిందిస్థాయి న్యాయవ్యవస్థలో పనిచేసే వారిని న్యాయాధికారులుగా పిలుస్తున్నప్పటికీ, వారంతా కూడా జడ్జీలేనన్నారు. ప్రజలకు ప్రత్యక్ష సంబంధాలుండేది కిందిస్థాయి కోర్టులతోనేనని ఆయన చెప్పారు.

గ్రామస్థాయికి న్యాయవ్యవస్థ సాంకేతికత

న్యాయవ్యవస్థలో సాంకేతికతను గ్రామస్థాయికి తీసుకురావాలని సీజేఐ కోరారు. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోలేకపోతే వ్యవస్థకు ప్రజలు దూరమైపోతారన్నారు. కోర్టులంటే వాయిదాలపై వాయిదాలన్న ముద్రపడిపోయిందని, సాంకేతిక పరిజ్ఞానంతో ఆ ముద్ర చెరిపివేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఇక వ్యక్తులను అకారణంగా జైళ్లలో ఉంచడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనన్న జస్టిస్ చంద్రచూడ్, కింది కోర్టులు బెయిల్‌ను యాంత్రికంగా తిరస్కరిస్తున్నాయని చెప్పారు. ఒకవేళ కింది కోర్టు బెయిల్ లేదా ముందస్తు బెయిల్ ఇస్తే దానిని హైకోర్టు తప్పుపట్టే పరిస్థితులు ఉంటున్నాయని, దీంతో కింది కోర్టులు భయపడి బెయిళ్లను తిరస్కరిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితిలో మార్పురావాలన్నారు. కింది కోర్టుల జడ్జీలు విధించే శిక్షల ఆధారంగా వారి పనితీరును హైకోర్టులు మదింపు చేస్తున్నాయని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. ఈ విధానాన్ని పక్కన పెట్టాలని ఇటీవల జరిగిన ప్రధాన న్యాయమూర్తుల సమావేశంలో స్పష్టంగా చెప్పానని జస్టిస్ చంద్రచూడ్ గుర్తుచేశారు. కింది కోర్టులే కేసు లోతుల్లోకి వెళ్లి నిర్ణయం తీసుకుంటే హైకోర్టులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు.

నలుపు–తెలుపు భిన్నత్వానికి ప్రతీకలు

సీజేఐ జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్ శిక్షణ నిమిత్తం వచ్చిన న్యాయాధికారులను ఉద్దేశించి కీలకోపన్యాసం చేశారు. ప్రతీ దశలో తరువాత ఏమిటీ అన్న ప్రశ్న వేసుకుంటేనే ముందుకెళ్లగలమన్నారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీతో పాటు హైకోర్టు డిజిటలైజేషన్ కార్యక్రమం, న్యూట్రల్ సైటేషన్, ఈ–సర్టిఫైడ్ కాపీ యాప్‌లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సాంకేతిక ఆవిష్కరణలు సత్వర న్యాయాన్ని ప్రజలకు చేరువ చేస్తాయన్నారు. ఏపీ హైకోర్టు కొత్తగా ఏర్పాటైనప్పటికీ, దీనికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. మనదేశంలో ఏ విధంగా అయితే భిన్నత్వం ఉందో న్యాయవ్యవస్థలో కూడా భిన్నత్వం ఉందని, అందుకు నలుపు–తెలుపు ప్రత్యక్ష ఉదాహరణన్నారు.

మానవ జీవిత సంఘర్షణను న్యాయమూర్తులు అర్థంచేసుకోవాలి

ఇక న్యాయవిద్య అన్నది కేవలం చట్టాల గురించో, గణాంకాల గురించో మాత్రమే చెప్పేది కాదని, విలువలను కూడా అందించేదన్నారు. విభిన్న పరిస్థితులను ఎదుర్కొనేలా న్యాయాధికారులకు, జడ్జీలకు జ్యుడీషియల్ అకాడమీల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. న్యాయమూర్తులుగా వ్యక్తిగత పరిమితులను అర్థంచేసుకున్నప్పుడే, మనముందుకు వచ్చే రకరకాల సంఘర్షణల తాలుకు కేసులను ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా దృఢత్వంతో విచారించే నేర్పు అలవడుతుందన్నారు. వృత్తిరీత్యా సమాజంలో కలిసే అవకాశం లేకపోయినా, సమాజంపట్ల మాత్రం ఖచ్చితమైన అవగాహన న్యాయమూర్తులకు ఉండాలని సూచించారు.

త్వరలో 'సుప్రీం'లో కూడా ఈ–విధానం

ఇక హైకోర్టు కొత్తగా తీసుకొచ్చిన సర్టిఫైడ్ కాపీ యాప్‌తో ఆన్‌లైన్ ద్వారా కోర్టు ధ్రువీకరణ తీర్పుల కాపీలను కక్షిదారులు, ప్రజలు సులభంగా పొందగలుగుతారని, దీంతో వారికి సత్వర న్యాయం చేరువవుతుందని తెలిపారు. దీన్ని అన్ని ఈ–సేవా కేంద్రాలకు సైతం అనుసంధానిస్తే మరిన్ని ఫలితాలు వస్తాయని, ఈ దిశగా ఈ–కోర్టు ప్రాజెక్టు పని చేస్తోందని ఆయన చెప్పారు. అలాగే, గ్రామీణ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులకు, కక్షిదారుల సౌకర్యార్థం తీసుకొచ్చిన న్యూట్రల్ సైటేషన్ విధానం కూడా ఎంతో బాగుందన్నారు. దీనివల్ల ప్రైవేటు జర్నల్స్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని, నేరుగా హైకోర్టు నుంచే కోర్టు తీర్పులను తీసుకుని వాటిని తమ కేసుల్లో ప్రస్తావించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దేశంలో ఇలాంటి సౌకర్యం అందుబాటులోకి రావడం ఇదే ప్రథమమన్నారు. సుప్రీంకోర్టులో సైతం త్వరలో ఈ విధానాన్ని తీసుకురానున్నామని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.

70ల నాటి కేసులు ఇంకా పెండింగ్‌లో..

కేసుల గణాంకాలను సీజేఐ ప్రస్తావిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో నమోదైన కేసులను వివరించారు. గుంటూరు జిల్లాలో 1980 మార్చి 22న నమోదైన ఓ సివిల్ కేసు ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు. అనంతపురం, కళ్యాణదుర్గంలో 1978లో నమోదైన క్రిమినల్ కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఏపీ హైకోర్టులో 1976 నాటి కేసు పెండింగ్‌లో ఉందని, అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆందోళనకరంగా లేదన్నారు. కేసుల విచారణ జాప్యానికి న్యాయమూర్తులే కారణమన్న ఓ భావన ఉందని, అయితే విచారణలో జాప్యం, రికార్డుల సమర్పణ తదితరాలు జాప్యానికి కారణమవుతున్నాయని, ఇవన్నీ కోర్టు పరిధిలోని లేని అంశాలని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. దీనివల్లే కోర్టుల్లో 14 లక్షల కేసులు, న్యాయవాదులు అందుబాటులో లేకపోవడంవల్ల 64 లక్షలు కేసుల విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. చివరిగా ఆయన తెలుగులో తన ప్రసంగాన్ని ముగించారు. 'మీ సేవలకు నా మనః పూర్వక ధన్యవాదాలు' అని తెలుగులో చెప్పారు. తరువాత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి వందన సమర్పణ చేశారు. అనంతరం జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

వీడ్కోలు పలికిన న్యాయమూర్తులు

ఈ కార్యక్రమాల అనంతరం జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో న్యాయమూర్తులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. రెండ్రోజుల రాష్ట్ర పర్యటనను పూర్తిచేసుకున్న సీజేఐ విజయవాడ నుంచి రోడ్డు మార్గం ద్వారా మ.12.20కు గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని హైదరాబాద్‌కు బయల్దేరారు. విమానాశ్రయంలో సీజేఐకి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హైకోర్టు న్యాయమూర్తులు, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా వీడ్కోలు పలికారు.

జ్యుడీషియల్ అకాడమీ ప్రారంభం



గుంటూరు జిల్లా కాజ వద్ద నిర్మించిన ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవనాన్ని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే), అకాడమీ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హైకోర్టు న్యాయమూర్తి, అకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తులు, బోర్డు గవర్నర్స్ జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, ఇతర న్యాయమూర్తులు, అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శర్మ, న్యాయవాదులు, న్యాయాధికారులు, న్యాయ విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ చంద్రచూడ్ అక్కడి నుంచి నేరుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. హైకోర్టు డిజిటలైజేషన్ కార్యక్రమం, న్యూట్రల్ సైటేషన్, ఈ–సర్టిఫైడ్ కాపీ యాప్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ న్యాయవ్యవస్థ అదృష్టమన్నారు.

ఆయన న్యాయవ్యవస్థకు దేవుడిచ్చిన వరం

జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ జస్టిస్ చంద్రచూడ్ భారత న్యాయవ్యవస్థకు దేవుడిచ్చిన వరమని అన్నారు. న్యాయవ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు డిజిటలైజేషన్ కార్యక్రమం, న్యూట్రల్ సైటేషన్, ఈ–సర్టిఫైడ్ కాపీ యాప్‌లు ఆయన చేతుల మీదుగా ప్రారంభం కావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అదృష్టమన్నారు. జస్టిస్ చంద్రచూడ్ తెలివైన విద్యార్థే కాక గొప్ప న్యాయవాది, గొప్ప న్యాయమూర్తి కూడా అని తెలిపారు. మైలురాళ్ల వంటి ఎన్నో చారిత్రక తీర్పులు వెలువరించారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి జ్యుడీషియల్ అకాడమీ లేదని, దీంతో న్యాయాధికారులకు శిక్షణనివ్వడం సాధ్యంకాలేదని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు ఆ కొరత తీరిందన్నారు. ఆ తరువాత.. హైకోర్టు డిజిటలైజేషన్ కార్యక్రమం, న్యూట్రల్ సైటేషన్, ఈ–సర్టిఫైడ్ కాపీ యాప్‌ల గురించి హైకోర్టు న్యాయమూర్తి, ఐటీ కమిటీ సభ్యుడు జస్టిస్ రావు రఘునందన్‌రావు వివరించి వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేయనున్న హైకోర్టు డిజిటలైజేషన్ కేంద్రం శిలాఫలకాన్ని జస్టిస్ చంద్రచూడ్ ఆవిష్కరించారు.

ఇరుకు ఫార్ములా.. బాబు మారలా

- ఇరుకు రోడ్లు.. డ్రోన్‌షూట్‌లు
- నెల్లూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన తీరు ఇదే..
- కందుకూరు, కావలి, కోవూరుల్లో అదే సీన్.. కందుకూరు ఘటనతోనైనా పద్ధతి మార్చుకోని టీడీపీ


చంద్రబాబు సభకు వచ్చిన చిన్నారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కోవూరు: అసలే ఇరుకు సందులు.. వాటిలో పదడుగుల ఫ్లెక్సీలు.. గట్టిగా వెయ్యిమంది వస్తే రోడ్డు కిక్కిరిసినట్టు కనిపించేలా డ్రోన్‌షూట్.. చివరికి ఎనిమిదిమంది నిండు ప్రాణాలు కోల్పోవడం.. ఇదీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటనల సారాంశం. మూడురోజుల పర్యటనలో టీడీపీ నేతలు ఒకే ఫార్ములా అనుసరించారు. ఫలితంగా బుధవారం కందుకూరులో ఎనిమిదిమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అయినా మార్పురాలేదు. కందుకూరు ఘటనతోనైనా చంద్రబాబు సభలు విశాలమైన ప్రదేశాల్లో పెట్టకుంటారేమోనని అందరూ ఊహించారు. కానీ ఎక్కడా ప్రచారయావ తగ్గించుకునేది లేదన్నట్లుగా చంద్రబాబు వ్యవహారశైలి సాగింది.

కావలిలో: కావలిలో గురువారం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద కూడా ఇరుకురోడ్లను ఎంచుకుని ఇదే ఫార్ములాతో సభ నిర్వహించారు. అక్కడ కూడా రెండు వైపులా 30 అడుగుల రోడ్లు, డ్రైనేజీ కాలువ, పదడుగుల మేర ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచార వాహనాన్ని సెంటర్‌లో ఉంచి ప్రసంగించారు.

కోవూరులో: ఇరుకురోడ్ల ఫార్ములాను అమలు చేస్తున్న చంద్రబాబు అండ్ టీం శుక్రవారం కోవూరులో కూడా అదే తరహా పబ్లిసిటీ కోసం బజార్‌సెంటర్ లాంటి చిన్న జంక్షన్‌లో సభ నిర్వహించింది. కూడలి అయినప్పటికీ నాలుగు వైపులా రోడ్లు ఇరుగ్గా ఉంటుంది. వందమంది గుమిగూడితే ఇరుకైపోతుంది. అలాంటి ప్రదేశాన్ని టీడీపీ నేతలు ఎంచుకోవడం చూస్తే వారి పబ్లిసిటీ యావ ఎంతదూరం వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. సభకు వస్తే ఒక్కొక్కరికి రూ.200 ఇస్తామంటూ నేతలు జనసమీకరణ చేపట్టినా.. కోవూరు బైపాస్ రోడ్డు సాయిబాబా మందిర కూడలి నుంచి బజారు సెంటరు దాకా చంద్రబాబు నిర్వహించిన రోడ్డుషోలో జనం పలుచగానే కనిపించారు.

బాగా చదువుకోమని యువతకు నేనే చెప్పా

- టీడీపీ అధినేత చంద్రబాబు



కోవూరు: ఆనాడు యువత బాగా చదువుకోవాలని తానే చెప్పానని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో శుక్రవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని, ఐటీని తానే తెచ్చానని అన్నారు. 'ఐటీ ఉద్యోగాలు మీకే ఇస్తామని చెప్పాను. దానికనుగుణంగానే ఐటీ ఉద్యోగాలు మీకోసం ఎదురు చూస్తున్నాయి..' అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు తలచారని, ఆయన త్యాగ ఫలితంగానే ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌ను సాధించామని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తి మృతి బాధాకరమన్నారు. రాష్ట్రంలో తెలుగు తమ్ముళ్లను రౌడీలుగా మార్చేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు.

విషాదంలోనూ కుల ప్రస్తావన బాబుకే చెల్లు

- కందుకూరు ఘటనపై జనాలు ఛీ కొడుతున్నా చంద్రబాబుకు పట్టింపుల్లేవు
- ఆయన ముఖంలో ప్రాయశ్చిత్తం కనిపించడంలేదు
- విషాద ఘటన నుంచి కూడా రాజకీయ ప్రయోజనం కోసం ప్రయత్నిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: విషాదకర ఘటన నుంచి కూడా లబ్ధి పొందాలనే నీచ మనస్తత్వం ఉన్న రాజకీయ నేత ఒక్క చంద్రబాబు నాయుడేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. మరణంలోనూ కుల ప్రస్తావన చంద్రబాబుకే చెల్లిందని శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. చంద్రబాబుకు ఫొటో షూట్, డ్రోన్ షాట్ పిచ్చి కారణంగానే కందుకూరులో 8 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జనం బాగా రాకపోయినా, బాగా వచ్చారని చూపించడం కోసం, ఒక చిన్న ఇరుకు రోడ్డులోకి జనాన్ని నెట్టారని, బాబు తన వాహనాన్ని అటుగా తీసుకెళ్లి 8 మందిని చంపేశారన్నారు. ఇంతకంటే ఘోరం ఎక్కడైనా ఉంటుందా? ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అని చంద్రబాబుని ప్రజలు ఛీ కొడుతున్నా.. ఆయనకు పట్టింపులేదన్నారు. కందుకూరులో బాబు కారణంగా ఇంతమంది చనిపోయినా ఆయనలో పశ్చాత్తాపం లేదని, ముఖంలో ప్రాయశ్చిత్తం కనిపించడంలేదన్నారు. ఈ విషాదం నుంచి కూడా రాజకీయ ప్రయోజనం పొందడానికి శవాలపై పేలాలేరుకునే విధంగా పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ మరుసటి రోజే నిస్సిగ్గుగా కావలిలో సభ పెట్టారని, చనిపోయిన వారి కులాల ప్రస్తావన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మాటలకు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని పేర్కొన్నారు.

'కందుకూరు' మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందజేత

- రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేసిన మంత్రి కాకాణి


బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి కాకాణి

కందుకూరు: నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో జరిగిన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందించారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను మంత్రి అందించారు. మృతులు కాకుమాను నాగరాజా, ఈదుమూడి రాజేశ్వరి, గడ్డం మధుబాబు, కలవకూరి యానాది, ఉప్పుటూరి పురుషోత్తం, మర్లపాటి చినకొండయ్య, దేవినేని రవీంద్రబాబు, యాటగిరి విజయ కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ స్థాయి అధికారితో ప్రభుత్వం విచారణ కమిటీ నియమించిందని చెప్పారు. ఎవరి తప్పిదం వల్ల ప్రమాదం జరిగిందో విచారణలో తేలుతుందన్నారు. విచారణ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తరువాత బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే సీఎం స్పందించి అధికారులను అప్రమత్తం చేశారని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారని చెప్పారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఆ విధానాన్ని గతంలోనే రద్దుచేశారు. పబ్లిక్ పరీక్షల పేపర్లను పూర్తిగా వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ పరీక్ష ఫీజు చెల్లింపు ఈ నెల 24వ తేదీతో ముగిసింది. రూ.50 అపరాధ రుసుముతో ఫీజు చెల్లింపు గడువు కూడా శుక్రవారం ముగిసింది. రూ.200 అపరాధ రుసుముతో జనవరి 3వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో జనవరి 9వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతిస్తారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 6,60,859 మంది దరఖాస్తులు అందినట్లు కమిషనర్ తెలిపారు. కస్తూరిబా బాలికా పాఠశాలలు, దివ్యాంగులకు పరీక్ష ఫీజు మినహాయింపు ఉందని పేర్కొన్నారు.

అధిక పరీక్ష ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి విద్యార్థులనుంచి పరీక్ష ఫీజును నిర్ణీత మొత్తం కంటే ఎక్కువ వసూలు చేస్తున్నాయి. అపరాధ రుసుము లేకుండ పరీక్ష ఫీజు రూ.125 కాగా, ప్రైవేటు స్కూళ్లు అంతకుమించి తీసుకుంటున్నాయి. ఇలాంటి స్కూళ్లపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఎంఎన్ఆర్ కాపీలను జనవరి 9వ తేదీలోపు డీఈవో ఆఫీసులకు అందించాలని గతంలో సూచించినట్లు తెలిపారు. కొన్ని పాఠశాలల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డిజిటలైజేషన్‌లో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ఎంఎన్ఆర్ కాపీలను డీఈవో ఆఫీసు లేదా ఇతర ఆఫీసుల్లో ఎక్కడా సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



టెన్త్ పరీక్షల షెడ్యూల్

తేదీ	సబ్జెక్టు	మార్కులు	సమయం
03-04-2023	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (గ్రూప్ ఏ)	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు)	70	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
06-04-2023	సెకండ్ లాంగ్వేజ్	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
08-04-2023	ఇంగ్లిష్	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
10-04-2023	మేథమెటిక్స్	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
13-04-2023	సైన్సు	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
15-04-2023	సోషల్ స్టడీస్	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
17-04-2023	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు)	30	ఉదయం 9.30 నుంచి 11.15వరకు
	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
18-04-2023	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2	100	ఉదయం 9.30 నుంచి 12.45వరకు
	ఎస్సెస్సీ వొకేషనల్ కోర్సు (థియరీ)	40	ఉదయం 9.30 నుంచి 11.30వరకు
	ఎస్సెస్సీ వొకేషనల్ కోర్సు (థియరీ)	30	ఉదయం 9.30 నుంచి 11.30వరకు

● యువతరంలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా హిమాలయ సాహస యాత్రను ఏర్పాటు చేస్తుంది. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు డార్జిలింగ్ నుంచి బయలుదేరి సాండక్‌ఫూ, ఫాలూట్, గుర్దూస్ గుండా సాగిన హిమాలయ పర్వత సాహసయాత్రలో అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం పుల్లేటి చెరువుపల్లికి చెందిన లంకిపల్లి జయదీప్ (12) పాల్గొన్నాడు.

సారా తయారీదారుల్లో పరివర్తన

అక్రమ మద్యం, గంజాయిసాగుకు అడ్డుకట్ట వేశాం

- అక్రమ మద్యం, డ్రగ్స్‌పై డయల్ 14500కు సమాచారం ఇవ్వండి
- ఎస్ఈబీ వార్షిక నివేదిక విడుదల చేసిన కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్



సాక్షి, అమరావతి: నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి ప్రణాళికబద్ధమైన కృషితో తయారీదారుల్లో పరివర్తన తీసుకొచ్చామని, అక్రమ మద్యం, గంజాయి సాగుకు అడ్డుకట్ట వేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక అక్రమాలకు చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఎస్ఈబీని ఏర్పాటు చేశారని, అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామని ఆయన తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ-2022 వార్షిక నివేదికను రవిశంకర్ విడుదల చేశారు.

సారా తయారీ, అక్రమ మద్యం రవాణాపై పెద్ద ఎత్తున దాడులు

'ఈ ఏడాది రాష్ట్రంలో 2,196 గ్రామాలను నాటుసారా తయారీ కేంద్రాలుగా ఎస్ఈబీ గుర్తించి, నిరంతరం దాడులు నిర్వహించింది. 26,461 కేసులు నమోదు చేసి 17,348 మందిని అరెస్ట్ చేసింది. 3,02,615 లీటర్ల నాటుసారాను సీజ్ చేసింది. 1,06,61,864 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసింది. 5,18,464 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, 1,173 వాహనాలను సీజ్ చేసింది. నాటుసారా తయారీని జీవనోపాధిగా చేసుకున్న 1,485 కుటుంబాలను గుర్తించి ఆపరేషన్ పరివర్తనలో భాగంగా వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కోసం రూ.11,15,36,000లు రుణ సహాయం చేసింది. ఇప్పటివరకు 2,096 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా మార్చింది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై 5,216 కేసులను నమోదు చేసి 5,715 మందిని అరెస్ట్ చేసింది. 77,444 లీటర్ల సుంకం చెల్లించని మద్యాన్ని, 4,014 లీటర్ల బీరును, 1,228 వాహనాలను స్వాధీనం చేసుకుంది. అనధికారిక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించి 6,490 కేసులు నమోదు చేసి 6,500 మందిని అరెస్ట్ చేసింది.' అని రవిశంకర్ తెలిపారు.



గంజాయి సాగు కేంద్రాలపై దాడులు

'గంజాయి సాగు, సింథటిక్ డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించి 344 కేసులు నమోదు చేసి 663 మందిని ఎస్ఈబీ అరెస్ట్ చేసింది. 26,242 కేజీల గంజాయిని, 123 వాహనాలను సీజ్ చేసింది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి 49 కేసులు నమోదు చేసింది. అక్కడ 685 ఎకరాల్లో సాగు చేస్తున్న 30,93,000 గంజాయి మొక్కలను ధ్వంసం చేసింది. వివిధ నేరాలలో సీజ్ చేసిన 77,210 కేజీల గంజాయిని, 147 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను డ్రగ్ డిస్పోజల్ కమిటీల ద్వారా ధ్వంసం చేసింది. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 3,746 కేసులు నమోదు చేసి 6,103 మందిని అరెస్ట్ చేసింది. 38,543 టన్నుల ఇసుకను, 4,705 వాహనాలను సీజ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రాబోయే నాలుగు నెలల్లో మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ మార్గనిర్దేశంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచనలతో కళాశాలలు, వర్సిటీల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నాం. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా, ఇతర ఫిర్యాదుల కోసం 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఎస్ఈబీకి సమాచారం ఇవ్వాలి' అని ఆయన చెప్పారు.

విద్యార్థులు 2 నెలల పాటు సామాజిక సేవ చేయాల్సిందే..

- ఏపీహెచ్ఈపీబీ సమావేశంలో నిర్ణయం
- బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

గుంటూరు రూరల్: విద్యార్థులకు సామాజిక దృక్పథాన్ని అలవాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్(ఏపీహెచ్ఈపీబీ) చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి చెప్పారు. రెండు రోజులుగా గుంటూరు శివారు లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న బోర్డు నాలుగో సమావేశం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ఉప కులపతులు సమావేశంలో పాల్గొని, ఉన్నత విద్యాభివృద్ధికి, సమాజాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ తదితర విషయాలపై చర్చించినట్లు వివరించారు. ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రెండు నెలల పాటు సమాజ సేవ తప్పనిసరి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎంతో ప్రగతి సాధించామని, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పెరుగుదల మిగిలిన రాష్ట్రాల కంటే అధికంగా ఉందన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

- ఇద్దరు టీచర్లను సర్వీస్ నుంచి తొలగించాలని లోకాయుక్త ఆదేశాలు

కర్నూలు(సెంట్రల్): నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు టీచర్లపై లోకాయుక్త కొరడా ఝుళిపించింది. ఉద్యోగాల నుంచి తొలగించడమేగాక.. వారు చేరినప్పటి(2011) నుంచి తీసుకున్న జీతాలను రికవరీ చేయాలని ఆదేశించింది. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా అడ్డతీగల మండలం భీమవరం స్కూలు కాంప్లెక్స్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా జయశ్రీగీతర్థి, కె.సూర్యారావు పనిచేస్తున్నారు. వీరు మొదట్లో అన్‌ట్రైన్డ్ టీచర్లుగా చేరి, ఆపై నకిలీ టీటీసీ సర్టిఫికెట్లతో సర్వీసులో కొనసాగుతున్నారని, వారిని సర్వీస్ నుంచి తొలగించాలని అడ్డతీగల గ్రామానికి చెందిన డి.వీరబాబు అనే వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించారు. కేసును విచారణకు స్వీకరించిన లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి.. పూర్తి స్థాయి విచారణ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. విచారణలో టీచర్లు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నట్లు తేలింది. విచారణ నివేదికను ఇటీవల లోకాయుక్తకు సమర్పించారు. శుక్రవారం ఈ కేసుపై జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి తుది తీర్పును వెల్లడించారు.

శ్రీవారి దర్శనం నిలుపుదల ప్రచారం అవాస్తవం

- శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు వెల్లడి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆనందనిలయం బంగారు తాపడం పనుల కోసం స్వామి వారి దర్శనాన్ని 6 నెలల పాటు నిలిపివేస్తారని కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తోన్న వార్తలు వాస్తవం కాదని శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు శుక్రవారం స్పష్టం చేశారు. టీటీడీ ఆగమ సలహామండలి సూచనల మేరకు శ్రీవారి ఆలయ ఆనందనిలయం బంగారు తాపడం పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించిందని చెప్పారు. బాలాలయం ఏర్పాటుకు ఆలయ అర్చకులు 2023, మార్చి1న ముహూర్తంగా నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా వారం రోజులపాటు బాలాలయ నిర్మాణానికి అవసరమైన వైదిక క్రతువులు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా గర్భాలయంలోని మూలమూర్తి జీవకళలను కుంభంలోకి ఆవాహన చేసి బాలాలయంలో ఏర్పాటు చేసే దారు (కొయ్య) శ్రీ వేంకటేశ్వర స్వామివారి విగ్రహంలోకి ప్రవేశపెడతామని వెల్లడించారు. ఆ తర్వాత ఆనంద నిలయానికి బంగారు తాపడం పనులు చేపడతామని వివరించారు. ఇందుకోసం పట్టే 6 నెలల సమయంలో గర్భాలయంలోని మూలమూర్తిని భక్తులు యథావిధిగా దర్శించుకోవచ్చని స్పష్టం చేశారు. బాలాలయంలోని దారు విగ్రహాన్ని కూడా భక్తులు దర్శించుకోవచ్చన్నారు. గర్భాలయంలో మూలమూర్తికి ఆర్జిత సేవలు ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. గర్భాలయంలో మూలమూర్తికి, బాలాలయంలోని దారు విగ్రహానికి ఉదయం సుప్రభాతం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు అన్ని ఆర్జిత సేవలు ఆగమోక్తంగా నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలన్నీ యథావిధిగా జరుగుతాయన్నారు. వాస్తవం ఇలా ఉంటే.. కొన్ని ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో 6 నెలల పాటు శ్రీవారి మూలమూర్తి దర్శనం ఉండదని జరుగుతోన్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 26 గంటలు

తిరుమల/తిరుచానూరు: తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు హుండీలో రూ.4.92 కోట్లు భక్తులు సమర్పించారు. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 26 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది.



ఆలయం వెలుపల కేంద్ర సహాయ మంత్రి కృష్ణన్ పాల్ గుర్జార్

స్వామివారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి, కేంద్ర సహాయ మంత్రి కృష్ణన్ పాల్ గుర్జార్, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, తెలంగాణ ఎమ్మెల్సీలు తాతా మధు, రాజేశ్వర్‌రెడ్డి, టాటా గ్రూప్స్ కంపెనీ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తదితరులున్నారు. కాగా, తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి కుటుంబ సమేతంగా తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

నేటి నుంచి జనవరి 11 వరకు ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల రద్దు

డిసెంబర్ 31 నుంచి జనవరి 11 వరకు ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ రద్దు చేసింది. అలాగే, తిరుపతిలోని కౌంటర్లలో డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో టైం స్లాట్ సర్వదర్శనం టోకెన్ల జారీని కూడా రద్దు చేసినట్లు టీటీడీ తెలిపింది.

నేటితో ముగియనున్న యోగ దర్శనం

తిరుమలలోని నాదనీరాజన వేదికపై జరుగుతోన్న యోగ దర్శనం కార్యక్రమం ఈ నెల 31న ముగియనుంది. కోవిడ్ నుంచి మానవాళిని రక్షించాలని కోరుతూ టీటీడీ గత రెండేళ్లలో ప్రారంభించిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పతంజలి యోగ దర్శనం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల నుంచి ప్రశంసలు పొందింది. ఈ ఏడాది ఏప్రిల్ 10న ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 నెలలకు పైగా కొనసాగింది.

బాబుకు రాజకీయ సన్యాసం తప్పదు

824వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: 29 గ్రామాల్లోని పేదల ఉసురు తగిలినందునే గత అన్ని ఎన్నికల్లో చంద్రబాబునాయుడు దారుణ పరాజయం పాలై రాజకీయ సన్యాసం దిశగా అడుగులేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటితో 824వ రోజుకు చేరాయి. దీక్షనుద్దేశించి సమితి నాయకులు మాట్లాడుతూ నియంత మనస్తత్వంతో ప్రచార ఆర్భాటాల కోసం పేదల ప్రాణాలను బలి తీసుకుంటున్న బాబును అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలు సంతోషంగా ఉంటే ఓర్వలేని చంద్రబాబు తన స్వార్థం కోసం రాష్ట్రంలో ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడని ధ్వజమెత్తారు. తుని రైల్వే ఘటనలో కాపులను కేసులు పెట్టి వేధించిన చంద్రబాబు.. నేడు కాపుల ఓట్ల కోసం పవన్‌కు ప్యాకేజీలు ఇచ్చి రంగం సిద్ధం చేసుకుంటున్నాడని విమర్శించారు. మూడు ప్రాంతాల సమానాభివృద్ధి కోసం నూతన సంవత్సరంలో ప్రభుత్వం అడుగులు ముందుకు వేయాలని, విశాఖ కేంద్రంగా పరిపాలన సాగించి వెనుకబాటుకు గురైన రాయలసీమ ప్రాంతాన్ని కూడా ముందుకు తీసుకెళ్తుందనే ఆశాభావం పలువురు వ్యక్తం చేశారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, కారుమూరి పుష్పరాజ్, పులి దాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

ఎకరాకు ఎరువుల ఖర్చు రూ.100

- 25 క్వింటాళ్ల దిగుబడి
- ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు



నారాయణరాజుపేటలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస (భీమిలి): భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీకి చెందిన రైతులు బాందేపురపు సంతోష్‌కుమార్, పకీరు కుటుంబ సభ్యులు ఎకరా వరి పంట సాగుకు కేవలం రూ.వంద సేంద్రీయ ఎరువుల ఖర్చుతో 25 క్వింటాళ్ల దిగుబడి సాధించి తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. సాధారణ రైతులు ఎకరా సాగుకు రూ.25 వేలు ఖర్చు చేస్తుండగా, ఇందులో రూ.4 వేలు వివిధ రసాయన ఎరువుల కోసం ఖర్చు చేస్తారు. కానీ ప్రకృతి వ్యవసాయం చేసిన సంతోష్‌కుమార్, పకీరు ఎకరాకు రూ.18,500 ఖర్చు చేశారు. ఈ రైతులు రసాయన ఎరువులకు బదులుగా తమకు అందుబాటులో ఉండే వస్తువులతో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం ఉచితంగా తయారు చేసుకుని మీనాస్త్రానికి మాత్రం రూ.100 ఖర్చు చేశారు. ఈ మీనాస్త్రం తయారీకి చేపల వ్యర్థాలు, బెల్లం కోసం దీనిని ఖర్చు పెట్టారు. వీళ్లు మొత్తం 2.20 ఎకరాలు సాగు చేయగా ఇందులో ఆహార అవసరాలకు గాను 1.80 ఎకరాలలో ఆర్‌జీఎల్, విత్తనాల కోసం 8 సెంట్ల వంతున చిట్టి సన్నాలు, చిట్టిముత్యాలు, 10 సెంట్లలో రత్నచోడి, 14 సెంట్లలో బ్లాక్ రైస్ సాగు చేశారు. ఆర్‌జీఎల్ విత్తనాలు కిలో రూ.35-40 ఉండగా దేశీయ వెరైటీలైన రత్నచోడి, బ్లాక్ రైస్, చిట్టి ముత్యాలు, చిట్టి సన్నాలు కిలో రూ.100 నుంచి 130 వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. గురు, శుక్ర వారాలలో వీరి పంట పొలాలలో జరిగిన పంట కోత ప్రయోగంలో 5''5 మీటర్ల వైశాల్యంలో పంటకు గాను 15.700 కిలోల ధాన్యం లభించింది. ఈ పంటకోత ప్రయోగంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా ప్రజారోగ్య పరిరక్షణ

- కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబకు వివరించిన సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి
- ఆరోగ్యం, పౌష్టికాహారంపై సీఎస్‌లతో గౌబ వీడియో సమావేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు పలు వినూత్నమైన ఆరోగ్య కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబకు తెలిపారు. నాన్ కమ్యునికల్ డిసీజెస్ (ఎన్‌సీడీ-సాంక్రామికేతర వ్యాధులు)ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్‌సీడీసీ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఇప్పటికే 70 శాతం జనాభాను స్క్రీనింగ్ చేసినట్లు కూడా చెప్పారు. అలాగే, 3 కోట్ల 60 లక్షల మందికి ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డులు రూపొందించడంతో పాటు 3 కోట్ల 50 లక్షల హెల్తు కార్డులను ఎబిడిఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్)తో అనుసంధానించినట్లు సీఎస్ తెలిపారు. ఇక జనవరి 5 నుంచి 7 వరకూ జరగనున్న జాతీయ ద్వితీయ చీఫ్ సెక్రటరీల సమావేశంలో చర్చించనున్న హెల్త్ అండ్ న్యూట్రిషన్ అంశంపై శుక్రవారం ఢిల్లీ నుండి కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్, మణిపూర్ రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు.

ఈ గ్రామాల్లో 4జినే లేదు!

దేశంలో ఇలాంటి గ్రామాలు 45,180 | 5.98 లక్షల గ్రామాలకే 4జి సేవలు

- అత్యధికంగా ఒడిశాలో 7,592 గ్రామాలకు 4జి సేవల్లేవు
- మహారాష్ట్రలో 3,793 గ్రామాలకు, ఏపీలో 3,169 గ్రామాలకు 4జి లేదు
- ఈ గ్రామాలకు 4జి సేవలందించాలంటే రూ.26,316 కోట్లు ఖర్చు
- కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో మొబైల్ సేవల రంగంలో అయిదో జనరేషన్ (5 జి) మొదలైంది. ఇంతకు ముందు 4జి, దానికి ముందు 2జి సేవలు అందించిన టెలికాం సంస్థలు ఇప్పుడు 5జిని అందిపుచ్చుకున్నాయి. సాంకేతికత వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దేశంలో ఇంకా 4జి సేవలే లేని గ్రామాలు ఉండటం ఆశ్చర్యం కలిగించే విషయం. కానీ ఇది నిజం. దేశంలో ఇప్పటికీ 45,180 గ్రామాలకు 4 జి మొబైల్ సేవలు అందుబాటులో లేవని లోక్ సభలో కేంద్ర కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల వెల్లడించారు. ఈ గ్రామాలకు సంతృప్త స్థాయిలో 4జి సేవలు అందించాలంటే రూ.26,316 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. దేశంలో 6,44,131 గ్రామాలుండగా ఇందులో 5,98,951 గ్రామాలకు 4జి మొబైల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంటే 93శాతం గ్రామాలకు 4 జి సేవలు ఉన్నాయి. మిగతా 7 శాతం గ్రామాలకు 4జి నెట్‌వర్క్ లేదు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 99 శాతం గ్రామాలకు 4జి సేవలు అందుబాటులో ఉన్నాయి. అత్యధికంగా ఒడిశాలో 7,592 గ్రామలకు 4జి కవరేజ్ లేదు. మహారాష్ట్రంలో 3,793 గ్రామాలకు 4జి లేదు. ఆంధ్రప్రదేశ్‌లో 3,169 గ్రామాల్లో 4జి అందుబాటులోకి రాలేదు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు 4జి సేవలందించేందుకు రూ.2,211 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ఉన్నత విద్యా మండలిలో 'పేటెంట్ సెల్'

నూతన సాంకేతికత పరిశ్రమలకు బదలాయింపు

- పరిశోధన, సృజన వాణిజ్యీకరణ
- నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం, ఆర్థిక ప్రయోజనాలు
- రీసెర్చి ప్రతిపాదనల నాణ్యత ధ్రువీకరణకు కమిటీ
- ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలతో అభివృద్ధి చేసే సాంకేతికతకు పేటెంట్ కల్పించడం, ఆ సాంకేతిక ఆవిష్కరణలను పరిశ్రమలకు బదిలీ చేయడం ద్వారా వాణిజ్యీకరణకు మార్గం వేయడం లక్ష్యంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 'పేటెంట్ సెల్'ను ఏర్పాటు చేయనుంది. విద్యార్థుల్లో నూతన సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు అలాంటి సృజనల ద్వారా ఆర్థిక ప్రయోజనాలను కూడా కల్పించనుంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలోని 'ఉన్నత విద్య ప్రణాళికా బోర్డు (హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రీజనల్ క్లస్టర్ గ్రూపుల రీసెర్చి ప్రతిపాదనల నాణ్యతను ధ్రువీకరించడానికి కమిటీని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించింది. బోర్డు రెండు రోజుల సమావేశాలు గుంటూరు నాగార్జున వర్సిటీలో శుక్రవారం ముగిశాయి. ఈ సమావేశాల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఇతర ప్రతినిధులు, వివిధ వర్సిటీల ఉప కులపతులు అనేక అంశాలపై చర్చించారు. పలువురు ప్రముఖులు వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సమావేశాల్లో ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మండలి చేపట్టిన అనేక కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. మండలి ఏర్పాటు చేసిన లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌లో 10 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీని ద్వారా వారి అభ్యాసానికి అన్ని వనరులు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. 'ఇండస్ట్రీ – ఇన్‌స్టిట్యూట్ కనెక్ట్' (ఐఐసీ) పోర్టల్‌కు మంచి స్పందన ఉందన్నారు. పరిశ్రమలు దీని ద్వారా వాటికి అవసరమైన విద్యార్థులను ఎంపిక చేసుకొని శిక్షణ, ఉపాధి కల్పించేలా చేశామన్నారు. 2 లక్షల మంది సంప్రదాయ డిగ్రీ కోర్సుల విద్యార్థులు స్వల్ప కాల ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో ఉన్నత విద్యలో బ్లెండెడ్ మోడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానం అమలు కానుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే డిజిటల్ లైబ్రరీల ద్వారా మారుమూల గ్రామాల్లో కూడా పిల్లలకు విజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. తొలిరోజు సమావేశంలో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి వర్చువల్‌గా ఈ సమావేశంలో మాట్లాడారు. ఉన్నత విద్యా మండలి కార్యక్రమాలను ఆయన ప్రస్తుతించారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ మాజీ వీసీ ప్రొఫెసర్ డీఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. కాలేజీ విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా మండలి వీసీ కె.రామ్మోహనరావు, విశాఖ ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు మాట్లాడారు.

నాడు-నేడు పనుల్లో భద్రత ముఖ్యం

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావుండరాదని పేర్కొన్నారు. నాడు-నేడు రెండోవిడత కింద రూ.8 వేల కోట్లతో 22,344 స్కూళ్లలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్న సంగతి తెలిసిందే. వీటిలో అదనపు తరగతి గదులు, కిచెన్‌షెడ్లు, భవనాలు తదితర నిర్మాణ పనులు కూడా ఎక్కువగా ఉన్నాయి. పాఠశాలల్లో పిల్లలు, ఇతర వ్యక్తులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

నాడు-నేడు కింద చేపడుతున్న పనులు ఇవే..

నాడు-నేడు రెండోవిడతలో ప్రభుత్వం 22,344 స్కూళ్లలో 9 రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.

- నిరంతర నీటిసరఫరాతో మరుగుదొడ్లు
- ఫ్యాన్లు, ట్యూబులైట్లతో విద్యుత్తు సదుపాయం
- మంచినీటి సదుపాయం
- విద్యార్థులు, టీచర్లకు ఫర్నిచర్
- స్కూలు అంతటికీ రంగులు
- మేజర్, మైనర్ రిపేర్లు
- గ్రీన్ చాక్‌బోర్డులు
- ఇంగ్లిష్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు
- స్కూళ్లకు ప్రహరీలు

నాడు-నేడు పనులు జరగుతున్న ప్రాంతాల్లో తప్పనిసరిగా తీసుకోవలసిన జాగ్రత్తలు

- హెడ్మాస్టరు, ఇంజనీర్, పేరెంట్సు కమిటీ సభ్యులు కలిసి పాఠశాల ఆవరణ మొత్తాన్ని తిరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను, వ్యక్తులకు గుచ్చుకునేలా ప్రమాదకరంగా ఉన్న వస్తువులను గుర్తించాలి.
- నిర్మాణ ప్రాంతం వైపు ఇతరులు వెళ్లకుండా దాన్ని ప్రత్యేకించేలా ఫెన్సింగ్, సేఫ్టీ టేప్‌లు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు, సిబ్బంది స్కూలులోకి సురక్షితంగా వెళ్లేలా మార్గాలు ఏర్పాటు చేయాలి.
- నిర్మాణ సామగ్రి, మిషనరీ, ఇతర మెటీరియల్‌ను స్కూలులోకి తెప్పించడం, నిర్మాణ వ్యర్థాలను స్కూలునుంచి బయటకు పంపించడం వంటి పనులను స్కూలు ప్రారంభంగాకముందు లేదా తరగతులు ముగిసిన తరువాత మాత్రమే చేయాలి.
- ప్రమాదానికి ఆస్కారముండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలి.
- పాత నిర్మాణాలను కూల్చే సమయంలో పక్కన ఉన్న భవనాలకు నష్టం జరగని విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్మాణాల ప్రాంతాల్లో గుంతలు తవ్వితే వాటిచుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. బ్లూసీట్లు, హోర్డింగులు పెట్టాలి.
- పనిచేసే ప్రతి కార్మికుడు హెల్మెట్, బూట్లు, గ్లవుజ్‌లు, మాస్కులు వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించేలా చూడాలి. నిర్మాణ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ పరికరాలను అందుబాటులో ఉంచాలి.
- నిర్మాణ ప్రాంతాల్లో గుంపులుగా చేరకుండా చూడాలి.
- ప్రమాదాలు జరిగే పక్షంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలను ముందుగానే ప్లాన్ చేయాలి.

నాడు-నేడు పనుల వివరాలు

కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
ప్రైమరీ	12,432	2,051
అప్పర్ ప్రైమరీ	2,163	556
హైస్కూళ్లు	5,045	4,931
అంగన్‌వాడీ కేంద్రాలు	2,236	182
జూనియర్ కాలేజీలు	468	280
మొత్తం	22,344	8,000

'ధర'హాసం



- రైతులకు ఎమ్మెస్పీ కంటే మిన్నగా మార్కెట్ రేట్లు

సాక్షి, అమరావతి : కనీస మద్దతు ధర కూడా లభించక ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్లుగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తద్వారా వ్యవసాయ, వాణిజ్య పంట ఉత్పత్తులు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు మించి రికార్డు స్థాయి రేట్లు పలుకుతున్నాయి. ధర తగ్గిన ప్రతిసారి ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకుని, అధిక ధరకు పంట కొనుగోలు చేయడం ద్వారా వ్యాపారులు కూడా అదే ధరకు కొనాల్సిన పరిస్థితి కల్పించింది. దీంతో వ్యాపారుల మధ్య పోటీని పెంచగలిగింది. ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి, మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పుడల్లా పంటలు కొనుగోలు చేస్తోంది. ఫలితంగా మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోంది. పత్తి, మిరప, వేరుశనగ, సజ్జలు, మొక్కజొన్నకు ఎమ్మెస్పీకి మించి లభిస్తోంది. పొగాకు సహా ప్రధాన వ్యవసాయ, వాణిజ్య పంటలైన జొన్నలు, రాగులు, కొర్రలు, మొక్కజొన్న, కందులు, పెసలు, మినుము, పసుపు, ఉల్లి, టమాటాకు మద్దతు ధర కల్పించింది. మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల ద్వారా మూడున్నరేళ్లలో 4.27 లక్షల మంది రైతుల నుంచి రూ.7,157 కోట్ల విలువైన 20.18 లక్షల టన్నుల పంట ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రస్తుత సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, సజ్జ, వేరుశనగను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచి పత్తి, మిరప, మినుము, వేరుశనగ, సజ్జలు, మొక్కజొన్న, పెసల ధరలు రికార్డు స్థాయిలో ఉండగా పసుపు, శనగ, సన్‌ఫ్లవర్ సీడ్ ధరలు ఎమ్మెస్పీకి కాస్త అటూ ఇటుగా ఉన్నాయి.

రికార్డు స్థాయి ధరలు

అంతర్జాతీయంగా పెరిగిన డిమాండ్‌తో మిరప రికార్డు స్థాయి ధర పలుకుతోంది. ఎమ్మెస్పీ క్వింటా రూ.7 వేలు కాగా కర్నూలు మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.37 వేలు, గుంటూరు యార్డులో రూ.30 వేలకు పైగా ఉండటం గమనార్హం. నల్లతామర పురుగుతో గతేడాది మిరప దెబ్బతినగా ఈదఫా ఆ ప్రభావం పెద్దగా లేదు. మార్కెట్‌లో ధరలు రికార్డు స్థాయిలో ఉండడంతో రైతన్నలు మంచి లాభాలను ఆర్జించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పత్తి పొడుగు పింజ రకం ఎమ్మెస్పీ క్వింటాల్ రూ.6,380 కాగా రూ.7,659, మధ్యస్థ పింజ రకం ఎమ్మెస్పీ రూ.6,080 కాగా రూ.7,359 పలుకుతోంది. ఈ సీజన్‌లో గరిష్ఠంగా రూ.9,500 పలికింది. మిగిలిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో కనీస మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. అపరాలకు కూడా ప్రస్తుత సీజన్‌లో మంచి రేటు లభిస్తోంది. మినుము ఎమ్మెస్పీ రూ.6,600 కాగా ప్రస్తుతం రూ.8,400కిపైగా పలుకుతోంది. పెసలు ఎమ్మెస్పీ రూ.7,755 కాగా ప్రస్తుతం రూ.8 వేలు దాటింది. కందులు ఎమ్మెస్పీ రూ.6,300 కాగా ప్రస్తుతం రూ.7,500 పలుకుతోంది. మొక్కజొన్న ఎమ్మెస్పీ రూ.1,860 కాగా మార్కెట్‌లో రూ.2,600 ఉంది. వేరుశనగ ఎమ్మెస్పీ రూ.5,850 కాగా ప్రస్తుతం రూ.7 వేలు పలుకుతోంది. సజ్జలు ఎమ్మెస్పీ రూ.2,350 కాగా ప్రస్తుతం రూ.2,600 చొప్పున గరిష్ఠ ధర లభిస్తోంది.



ఉల్లి ఎమ్మెస్పీ రూ.770 కాగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1,000 నుంచి రూ.1,200 వరకు పలుకుతోంది.

మార్కెట్ ఆశాజనకం

మార్కెట్ చాలా ఆశాజనకంగా ఉంది. మిరప, పత్తి, మొక్కజొన్న, అపరాలు, సజ్జలు మినహా చిరుధాన్యాలు ఎమ్మెస్పీ మించి ధర పలకడం శుభ పరిణామం. నిరంతరం సీఎం యాప్ ద్వారా ధరలను పర్యవేక్షిస్తున్నాం. రానున్న రోజుల్లో ఇవి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులకు మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

ఏపీలో పారిశ్రామిక పరుగులు

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఏపీలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోందని, జీడీపీ గణనీయంగా పెరిగిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. రూ.4 వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్యానల్స్ పరిశ్రమకు వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తామన్నారు. జనవరి నెలాఖరులోగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పట్టించుకోని పారిశ్రామిక రంగానికి సీఎం జగన్ ప్రభుత్వం ఊతమిచ్చిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆదిత్య బిర్లా, లక్ష్మీమిట్టల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు కూడా ఎదురుచూస్తున్నారని చెప్పారు. గత మూడున్నరేళ్లలో రూ.73 వేల కోట్లతో 21 భారీ, అతి భారీ పరిశ్రమలు వచ్చాయని, 60 వేల మందికి ఉపాధి కల్పించామని అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పలు పాలసీల కింద రూ.15 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు తెస్తామని, 12 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో మరో 58 ప్రాజెక్టులు రూ.90 వేల కోట్ల పెట్టుబడులతో వస్తున్నాయన్నారు. ఫిబ్రవరి నాటికి నూతన పారిశ్రామిక విధానం తీసుకువస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం కావలసిన వారికి భూములు కట్టబెడుతున్నారంటూ కొందరు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. ఎవరైనా పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తే వారికి ప్రభుత్వం అన్ని రాయితీలు ఇస్తుందన్నారు.

ధాన్యం రైతుకు డబ్బులు

- రూ.1,096.52 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు 18.52 లక్షల టన్నుల సేకరణ
- 2.84 లక్షల మంది రైతులకు రూ.2,924.53 కోట్లు చెల్లింపు

సాక్షి, అమరావతి: ధాన్యం రైతులకు శుభవార్త! ఆర్బీకేల ద్వారా రైతన్నల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రూ.1,096.52 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 3.29 లక్షల మంది రైతుల నుంచి రూ.3,781 కోట్ల విలువైన 18.52 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. తాజా చెల్లింపుతో మొత్తం 2.84 లక్షల మంది రైతులకు రూ.2,924.53 కోట్లను ఖాతాల్లో జమ చేసినట్లయింది. రైతులకు మద్దతు ధర కల్పించడంతోపాటు ప్రభుత్వం వేగంగా చెల్లింపులు కూడా జరుపుతోంది. 21 రోజుల్లోపు చెల్లించాలని నిర్ణయించినప్పటికీ ధాన్యం కొనుగోలు చేసిన వారం నుంచి పది రోజుల లోపే రైతుల ఖాతాలకు నగదు జమ చేసిన దాఖలాలున్నాయి. కొన్ని చోట్ల మాత్రం సాంకేతిక సమస్యల వల్ల ఒకటి రెండు రోజులు చెల్లింపులు ఆలస్యమయ్యాయి.

తొలిసారిగా అదనపు సాయం..

ధాన్యం సేకరణలో తొలిసారిగా తెచ్చిన ఆన్‌లైన్ విధానంతో రైతులకు పారదర్శకంగా మద్దతు ధర లభిస్తోంది. గోనె సంచులు, రవాణా చార్జీలు, హమాలీ ఖర్చులను సైతం రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోంది. వీటి కింద ఇప్పటివరకు రూ.45.91 కోట్లు విడుదల చేసింది. ఇందులో దాదాపు 50 శాతం చెల్లింపులను పూర్తి చేసింది. గత సర్కారు హయాంలో ఇవేమీ లేకపోగా రైతులకు ధాన్యం సొమ్ములను నెలలు తరబడి బకాయిలు పెట్టారు. మిల్లర్లు, దళారులకు లబ్ధి చేకూర్చేందుకు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేసింది. ఫలితంగా రైతన్నల్లో ఆందోళన రేకెత్తించి నష్టానికే మధ్యవర్తులకు ధాన్యం విక్రయించుకోవాల్సిన దుస్థితి కల్పించింది. ఇలాంటి వాటిని అరికడుతూ రైతులే తొలి ప్రాధాన్యంగా 21 రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర జమ చేయాలని నిర్ణయించి సీఎం జగన్ పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో గత సీజన్ల కంటే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి.

సంక్రాంతి నాటికి పూర్తి

ఖరీఫ్ ధాన్యం సేకరణను సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. ఉత్తరాంధ్రలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించాం. ఆన్‌లైన్ విధానంతో రైతులకు సంపూర్ణ మద్దతు ధర లభిస్తోంది. పండగ సీజన్లను దృష్టిలో పెట్టుకుని నిర్ణీత సమయం ప్రకారం చెల్లింపులు చేస్తున్నాం.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ, జి.వీరపాండియన్, ఎండీ, పౌరసరఫరాల సంస్థ

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ (డిసెంబర్ 30 నాటికి)

సంవత్సరం	లక్షల టన్నుల్లో
2019-20	14.39
2020-21	15.20
2021-22	10.99
2022-23	18.52

జిల్లాలవారీగా ధాన్యం సొమ్ము జమ ఇలా..

జిల్లా	మొత్తం రూ.కోట్లలో
పశ్చిమ గోదావరి	528.07
ఏలూరు	457.94
తూర్పు గోదావరి	413.49
కోనసీమ	425.22
కాకినాడ	352.60
కృష్ణా	304.62
శ్రీకాకుళం	161.01
విజయనగరం	123.29
పార్వతీపురం మన్యం	88.18
ఎన్టీఆర్	50.34
అల్లూరి సీతారామరాజు	5.36
గుంటూరు	6.65
బాపట్ల	4.45
విశాఖపట్నం	2.28
ఇతర జిల్లాలు	0.98
మొత్తం	2,924.53

ఈ ఖరీఫ్‌లో ధాన్యం రైతులకు చెల్లింపులు ఇలా..

రోజులు	రూ.కోట్లు	రోజులు	రూ.కోట్లు
2	0.30	9	141.12
3	6.88	10	133.91
4	18.11	11	137.15
5	18.22	12	98.91
6	58.55	13	130.13
7	45.91	14	144.50
8	118.97	15	122.47
		16	149.36
		17 - 24	1,600.04



జిల్లా వార్తలు

వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు

టీటీడీ ఆధ్వర్యంలో జనవరి 1, 2 తేదీలలో నిర్వహణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జనవరి 1, 2 తేదీలలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు టీటీడీ డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి పి.వెంకటయ్య తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందర్ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోనూ గుంటూరు జిల్లా వెంకటపాలెంలోని దేవాయలంలోనూ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జనవరి 1వ తేదీ నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. సూపరింటెంట్ ఎ.రామచంద్రరావు మాట్లాడుతూ కోవిడ్ నిబంధనలు భక్తులు పాటించాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లతోపాటు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశి వివరాలు వెల్లడిస్తున్న వెంకటయ్య, వేదికపై రామచంద్రరావు, సీవీకే ప్రసాద్

క్యాలెండర్లు, డైరీల విక్రయాలు..

టీటీడీ ప్రచురించిన 2023 సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలను శనివారం ఉదయం 10 గంటలకు విక్రయిస్తామని అధికారులు తెలిపారు. క్యాలెండర్లు 130, డైరీలు 150 లభ్యతను బట్టి విక్రయిస్తామని తెలిపారు.

దక్షిణ భారత స్విమ్మింగ్ చాంపియన్లుగా లాస్యశ్రీ, తీర్థు

విజయవాడ స్పోర్ట్స్: సౌత్ జోన్ నేషనల్స్ స్విమింగ్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను విజయవాడ క్రీడాకారులు లాస్యశ్రీ, తీర్థుసామ్‌దేవ్ కైవసం చేసుకున్నారు. కేరళ త్రివేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో ఇరువురు క్రీడాకారులు సత్తా చాటారు. గ్రూప్-2 బాలుర విభాగం 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్, 800 మీటర్ల ఫ్రీస్టయిల్, 200 మీటర్ల ఫ్రీ స్టయిల్, 400 ఫ్రీస్టయిల్, ఇడ్యువిడ్యువల్ మిడ్‌లే(ఐఎం) విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. 25 పాయింట్లతో గ్రూప్‌లో మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. అదే విధంగా లాస్యశ్రీ గ్రూప్-3 బాలికల విభాగం 200 మీటర్ల ఫ్రీ స్టయిల్, 400 మీటర్ల ఫ్రీ స్టయిల్, 100 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో గోల్డ్, 100 మీటర్ల బటర్ ఫ్లైలో సిల్వర్ మెడల్ సాధించింది. మొత్తం 18 పాయింట్లతో గ్రూప్ విన్నర్‌గా నిలిచి చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. వీరిద్దరినీ ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ అభినందించారు.



దక్షిణ భారత స్విమ్మింగ్ పోటీల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను సాధించిన లాస్యశ్రీ, తీర్థుసామ్‌దేవ్

యోగా పోటీలలో రాజేష్ సత్తా

మధురానగర్(విజయవాడసెంట్రల్): పాండిచ్చేరిలో ఇండియన్ యోగా ఫెడరేషన్, పుదుచ్చేరి అమెచ్యూర్ యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన 41వ నేషనల్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీలలో విజయవాడ మధురానగర్‌కు చెందిన మలిపెద్ది రాజేష్ ప్రథమ స్థానం సాధించాడు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన సీనియర్ బాయ్స్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. పలు రాష్ట్రాల నుంచి 30 మంది అభ్యర్థులు యోగాసన పోటీలలో పాల్గొనగా రాజేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం మధురానగర్‌కు చెందిన స్థానిక నాయకులు పెద్దలు రాజేష్‌ను అభినందించారు.



యోగాసన పోటీలలో ప్రథమ స్థానం సాధించిన రాజేష్

రైతు మోములో చిరునవ్వు!

- ఖరీఫ్ ధాన్యం సొమ్ము రైతు ఖాతాలకు జమ
- కృష్ణాలో రూ 167.79 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో రూ 27.34 కోట్లు చెల్లింపు
- సమర్థంగా సాగుతున్న ధాన్యం సేకరణ

కంకిపాడు: ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతు మోములో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. సంక్షేమానికే ప్రాధాన్యమిస్తూ ప్రణాళికాబద్ధంగా పని చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని రుజువు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి విపత్తులతో రైతుకు కష్టం వాటిల్లకుండా అండగా నిలిచింది. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ యంత్రాంగం అప్రమత్తమై ధాన్యం సేకరణ సమర్థంగా సాగించింది. ధాన్యం విక్రయించిన అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో నిర్ణీత గడువులోపే సొమ్ము జమ చేసింది. ధాన్యం సొమ్ము చేతికి అందటంతో మూడు రోజులు ముందే కొత్త ఏడాది సంబరం వచ్చిందంటూ అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతకు అండగా...లక్ష్యానికి అనుగుణంగా..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని వేళలా ప్రభుత్వం, యంత్రాంగం అన్నదాతలకు అండగా నిలిచాయి. ముందస్తుగా సాగునీరు, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా సరఫరా చేయటంతో సాగుకూడా ముందస్తుగానే జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 3.95 లక్షల ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 1.13 లక్షల ఎకరాలు వరి సాగు జరిగింది. పంట చేతికి రావటంతో ప్రభుత్వ మార్గదర్శకాలతో గత నెల రెండో వారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. కృష్ణాజిల్లాలో 10.86లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి 1.24 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం ఏర్పరుచుకున్నారు. ఇందుకు గానూ కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో 316 రైతు భరోసా కేంద్రాల ద్వారా 21158 మంది రైతుల నుంచి రూ.385.13 కోట్లు విలువైన 1,89,441.52 మెట్రిక్ టన్నులు ఇప్పటి వరకూ సేకరించారు.



కంకిపాడు పై ఓవర్ వద్ద ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 180 రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ 63.88 కోట్లు విలువైన 43 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం 6099 మంది రైతుల నుంచి కొనుగోళ్లు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ కృష్ణాజిల్లాలో అత్యధికంగా కంకిపాడు మండలంలో జరిగింది. 29000 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ అంచనా వేయగా, ఇప్పటికే 28,393 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు.

నిర్ణీత గడువులోపే చెల్లింపులు...

రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు నిబంధనలకు అనుగుణంగా ఏ గ్రేడు ధాన్యం క్వింటాకు రూ 2060, కామన్ రకం క్వింటాకు రూ.2040 చెల్లించేలా యంత్రాంగం సమర్థంగా చర్యలు తీసుకుంది. ఈనెల 11వ తేదీ వరకూ ఎఫ్‌టీఓ జనరేట్ అయిన ప్రకారం రైతులు, కౌలురైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్మును పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వం జమ చేసింది. ఇందులో కృష్ణాజిల్లాలో రూ 167.79 కోట్లు జమ కాగా ఇంకా రూ 215.71 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో రూ 27.34 కోట్ల చెల్లింపులు జరగ్గా, రూ 36.54 కోట్లు విడుదల అవ్వాల్సి ఉంది. ఈ మొత్తానికి సంబంధించి శాఖాపరమైన ఆమోదం కూడా పూర్తయ్యింది. నిర్ణీత గడువులోపు ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కావటం, మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టనుండటంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేవు.

అడుగడుగునా అండగా....

రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం ఆన్‌లైన్‌లో కేటాయించిన మిల్లులకు చేర్చే వరకూ రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగం సమర్థంగా చర్యలు తీసుకుంది. పంట చేతికి వచ్చాక విరుచుకుపడ్డ ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు కష్టం వాటిల్లకుండా ధాన్యం సేకరణ, తేమ శాతం పరిశీలనలో మోసం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ధాన్యం సేకరణ చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకంగా, దళారులు, మధ్యవర్తులకు ఆస్కారం ఇవ్వకుండా ధాన్యం సేకరణ జరుగుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

వ్యవసాయం పండుగలా ఉంది



గ్రామంలో పదెకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నా. దళారులు వల్ల రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చేపట్టిన విధానం చాలా బావుంది. పదెకరాల్లో పంటను రైతు భరోసా కేంద్రం ద్వారా మిల్లుకు పంపాను. మద్దతు ధర వచ్చింది. నా పేరున తోలిన ధాన్యంకు రూ 3.20 లక్షలు నా ఖాతాకు వచ్చాయి. 20 రోజుల్లోపు నాకు డబ్బు వచ్చింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పని చేస్తుంది. దళారుల ఆటకట్టింది. వ్యవసాయం పండుగలా మారింది అని చెప్పటానికి చాలా గర్వంగా ఉంది.

– మసిముక్కు సాంబశివరావు, కౌలురైతు, దావులూరు గ్రామం, కంకిపాడు మండలం

అన్ని వేళలా అండగా ఉంటాం..



రైతు పండించిన ధాన్యం సమర్థంగా సేకరిస్తున్నాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ రైతులకు అన్యాయం జరగనివ్వం. తేమశాతంలో తేడాతో రైతులకు మద్దతు ధర నష్టపోకుండా చూస్తున్నాం. మద్దతు ధర కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. నిర్ణీత గడువు లోపుగా ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. పెండింగ్ సొమ్ము కూడా త్వరితగతిన జమ అయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతాం. రైతాంగం ఆందోళన పడొద్దు.

– అపరాజిత సింగ్, జేసీ, కృష్ణాజిల్లా

అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీకి సన్నాహాలు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ కేంద్రంగా అంతర్జాతీయ మాస్టర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ డాక్టర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. జనవరి రెండో తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని శాప్ టెన్నిస్ అకాడమిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌కు దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులతో పాటు పలు దేశాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. తన తండ్రి ఎస్.వి.రామయ్య జ్ఞాపకార్థం 'ఎస్.వి.రామయ్య మెమోరియల్ ఎంటీ-100 ప్రపంచ టెన్నిస్ మాస్టర్స్-2023'గా టోర్నీకి నామకరణం చేశామన్నారు. టోర్నీకి సంబంధించిన వివరాలున స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్(ఏపీఎల్‌టీఏ) పర్యవేక్షణలో పురుషుల 45, 55, 60, 65, 70, 75 వయసు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మహిళల 35 ప్లస్ సింగిల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. టోర్నీకి చీఫ్ రిఫరీగా ప్రవీణ్‌కుమార్‌నాయక్ (న్యూఢిల్లీ), డైరక్టర్‌గా బరుణ్‌లాలా (కోల్‌కతా) వ్యవహరిస్తారన్నారు. విజేతలకు రూ.2 లక్షల నగదుతో పాటు ట్రోఫీలను బహుమతిగా అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో రాణించి ఉత్తమ ర్యాంకింగ్ పొందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని చెప్పారు. రాష్ట్రంలోనూ ప్రపంచ స్థాయి టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోనే బస ఏర్పాటు చేశామని, ఈ పోటీలను ఆ రోజు సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ప్రారంభిస్తారని వివరించారు. 6వ తేదీతో ఈ పోటీలు ముగుస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో ఏపీఎల్‌టీఎస్ ప్రతినిధులు డాక్టర్ కె.పట్టాభిరామయ్య, రాధాకృష్ణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు. తొలుత టోర్నమెంట్ ట్రోఫీలను, జెర్సీలను ఆవిష్కరించారు.



ప్రపంచ మాస్టర్ టెన్నిస్ టోర్నీ ట్రోఫీ, జెర్సీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

3 పీలే గెలిచిన ప్రపంచకప్‌ల సంఖ్య. 1958, 1962, 1970లలో బ్రెజిల్ ప్రపంచకప్ టైటిల్స్ నెగ్గడంలో పీలే కీలకపాత్ర పోషించాడు. మూడు ప్రపంచకప్‌లు సాధించిన ఒకే ఒక్క ఫుట్‌బాలర్‌గా పీలే రికార్డు నెలకొల్పాడు.

17 బ్రెజిల్ తొలిసారి 1958లో విశ్వవిజేతగా నిలిచినపుడు జట్టులో సభ్యుడిగా ఉన్న పీలే వయస్సు. ప్రపంచకప్‌లో పాల్గొన్న, ప్రపంచకప్‌ను సాధించిన పిన్న వయస్సు ప్లేయర్‌గా పీలే పేరిట ఉన్న రికార్డు ఇప్పటికీ చెక్కు చెదరలేదు.

92 అధికారిక, అనధికారిక మ్యాచ్‌ల్లో కలిపి పీలే సాధించిన హ్యాట్రిక్‌ల సంఖ్య.

30 మ్యాచ్‌లో పీలే నాలుగు గోల్స్ చొప్పున 30 సార్లు సాధించాడు.

1283 పీలే 1954 నుంచి 1977 మధ్య కాలంలో అధికారిక, అనధికారిక, ఫ్రెండ్లీ మ్యాచ్‌లు కలిపి మొత్తం 1363 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగి 1283 గోల్స్ సాధించాడు.

6 మ్యాచ్‌లో పీలే కనీసం ఐదు గోల్స్ చొప్పున ఆరుసార్లు నమోదు చేశాడు.

77 బ్రెజిల్ జాతీయ జట్టు తరఫున 92 మ్యాచ్‌లు ఆడి పీలే చేసిన గోల్స్.

12 ప్రపంచకప్ టోర్నీలలో పీలే సాధించిన గోల్స్.



అల్విదా పీలే...



ఆటే అతని లోకం... ఆటే అతని ప్రాణం...
చురుకుదనంలో అతనో పాదరసం...
గోల్ చేస్తే లోకమే దాసోహం... అతను
డ్రిబ్లింగ్ చేస్తే బిత్తరపోవాల్సిందే...
అటాకింగ్‌కు దిగితే చేతులెత్తేయాల్సిందే...
ఫార్వర్డ్‌గా అతని విన్యాసాలకు సలాం కొట్టాల్సిందే... ఇంత గొప్ప ఆటగాడు ఫుట్‌బాల్‌లో ఉన్నందుకు ఆ క్రీడే మురిసింది.
తమ జట్టులో ఆటగాడైనందుకు బ్రెజిల్ అదృష్టం చేసుకుంది. దీంతో ఈపాటికే అందరికి అర్థమై ఉంటుంది... అతనేవరో కాదు సాకర్ సమున్నత శిఖరం పీలే అని!
నిజం... అతని ఆట అద్భుతం. అతని గోల్స్ అసాధారణం. అతని అంకితభావం నిరుపమానం.
వరం పొందిన బ్రెజిల్‌కు... అంకితమైపోయిన ఫుట్‌బాల్‌కు... మెప్పించిన గోల్స్‌కు...
అతనితో ఆడి అలసిన ప్రత్యర్థులకు...
తమకిది భాగ్యమనుకున్న ప్రేక్షకులకు...
కురిపించిన ఆదరాభిమానాలకు సెలవు చెప్పాడు పీలే!

- దివికేగిన సాకర్ శిఖరం
- క్యాన్సర్‌తో పోరాడుతూ మృతి
- శోక సంద్రంలో బ్రెజిల్, ఫుట్‌బాల్ లోకం
- జనవరి 3న అంత్యక్రియలు

సావోపాలో: అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో తన శకం లిఖించిన బ్రెజిల్ దిగ్గజం పీలే ఇక లేడు. మూడుసార్లు 'ఫిఫా' ప్రపంచకప్‌ను గెలిపించిన బ్రెజిలియన్ సాకర్ కింగ్ పీలే గురువారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచాడు. సావోపాలోలోని అల్బర్ట్ ఐన్‌స్టీన్ హాస్పిటల్‌లో 82 ఏళ్ల పీలే కన్నుమూశాడు. గతేడాది పెద్దపేగు క్యాన్సర్ బారిన పడిన అతను అప్పటి నుంచి పోరాటం చేస్తున్నాడు. గతనెల ఆరోగ్యం విషమించడంతో అతన్ని ఐన్‌స్టీన్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే అవయవాలన్నీ క్రమంగా పాడైపోవడంతో అతని శరీరం చికిత్సకు స్పందించ లేదు. చివరకు గురువారం క్యాన్సర్‌తో పోరాటాన్ని విరమించి లోకాన్ని వీడాడు.

పది దేశాలు (శాశ్వత) ఆడే క్రికెట్‌లో విశిష్ట క్రికెటర్లు (ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్) ఎంతో మంది ఉన్నారు. కానీ రెండొందల దేశాలు ఆడే ఫుట్‌బాల్‌లో మాత్రం అత్యుత్తమ ఆటగాళ్లు అతికొద్ది మందే! అదికూడా వేళ్లమీద లెక్కపెట్టేంత మందే సాకర్ సూపర్‌స్టార్లు ఉన్నారు. వారిలో పీలే మాత్రం కచ్చితంగా అగ్రగణ్యుడు అంటే ఆశ్చర్యం, అతిశయోక్తి లేనేలేదు. అందుకే అతన్ని 'ద కింగ్' అంటారు. బంతి మైదానంలో పారాడితే కాళ్లతో డ్రిబ్లింగ్... గాల్లో ఉంటే ఛాతీతో కంట్రోల్... గోల్‌పోస్ట్ వద్ద ఎగిరొస్తే హెడర్... కింది నుంచి పాస్ అయితే చక్కని కిక్ షాట్... ఇలా బంతి ఎటునుంచి వచ్చినా... తన చుట్టు అడుగడుగునా ప్రత్యర్థులు మాటువేసినా... డిఫెండర్లు గోడ కట్టినా... గోల్ కీపర్ కంచెలా నిలుచున్నా... పీలే కచ్చితమైన లక్షిత షాట్‌ను ఎవరూ అడ్డుకోలేదు. అంతటి మంత్రముగ్ధమైన ప్రదర్శనతో, ప్రత్యర్థి శిబిరాన్ని నిశ్చేష్టుల్ని చేసే ఆటతీరుతో గోల్స్ కొట్టే నైపుణ్యం పీలేకు మాత్రమే సాధ్యం.

అచ్చుతప్పు పిలుపుతో...

మినాస్ గెరయిస్ రాష్ట్రంలోని చిన్న గ్రామం ట్రెస్ కొరకోస్‌లో 1940 అక్టోబర్ 23న జన్మించిన పీలే అసలు పేరు అది కాదు. నిజానికి అది పేరులోంచి తెచ్చుకున్న పదం కూడా కాదు. పీలే పేరు... ఎడ్సన్ అరాంట్స్ డో నాసిమియాంటో! ఇతనికి ఫుట్‌బాల్ అంటే పిచ్చి. తండ్రి ఫుట్‌బాలర్ కావడంతో ఆ పిచ్చి కాస్త వయసుతో పాటే పెరిగింది. 11 ఏళ్ల ప్రాయంలో అతని నైపుణ్యాన్ని గుర్తించిన స్థానిక ప్రొఫెషనల్ ప్లేయర్ ఒకరు సాంటోస్ యూత్ క్లబ్‌లో చేర్పించాడు. అచిరకాలంలోనే సీనియర్ జట్టులోకి వచ్చేశాడు. స్కూల్‌లో చదివే రోజుల్లో వాస్కోడి సావో లౌరెంకో క్లబ్ గోల్ కీపర్ 'బిలే' పీలే ఫేవరెట్ ఆటగాడు. అతడిని 'బీలే'గా కాకుండా పీలేగా తప్పుగా పిలిచేవారు. ఆ తర్వాత సహచర విద్యార్థులు ఈ పేరును పీలేకు పెట్టేశారు. ఆ పేరు ఇప్పుడు ఫుట్‌బాల్ చరిత్రలో చెరగని సంతకం చేసింది.

అటకెక్కిన అంతర్యుద్ధం

ఆతని ఆటన్న... అతనికి ఉన్న క్రేజన్న ఎంటో ఈ ఒక్క ఉదంతంతో తెలుస్తుంది. 1969లో నైజీరియా అంతటా అంతర్యుద్ధంతో అట్టుడుకుతోంది. పీలే అప్పటికే విశ్వవ్యాప్త ఆదరాభిమానాలు సంపాదించుకున్నాడు. కానీ ఏమూలో అనుమానం... ఈ అగ్గితో సాంటోస్ క్లబ్, స్టేషనరీ స్పోర్ట్స్ క్లబ్ మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ జరుగుతుందా? అని... అయితే ఈ అనుమానాలు పటాపంచలు చేస్తూ నైజీరియాలోని రెండు వర్గాలు పీలే ఆట కోసం విరామం ప్రకటించాయి. దీంతో కాసేపు అంతర్యుద్ధం అటకెక్కగా ... ఆట మైదానంలో ఉరకలెత్తించింది. అట్లుంటది పీలేతోని!

ఖాళీగా కూర్చోలేదు

రిటైర్మెంట్ తర్వాత... ఇన్ని పేరు ప్రఖ్యాతలు, అవార్డులు, రివార్డులు సాధించాక ఇక ఆటపాట నాకెందుకని ప్రశాంతంగా కూర్చోలేదు. ఆటగాడిగా బిజీగా గడిపిన తర్వాత డాక్యుమెంటరీ నటుడిగాను మెప్పించాడు. ఆల్బమ్‌లను రూపొందించాడు. పలు ఆటోబయోగ్రఫీలను కూడా ప్రచురించాడు. వ్యాపారవేత్తగాను విజయవంతమయ్యాడు. అనంతరం ఈ విశిష్ట ఫుట్‌బాలర్‌ను 1994లో యునెస్కో గుడ్‌విల్ అంబాసిడర్‌గా నియమించింది. మరుసటి ఏడాది బ్రెజిల్ అధ్యక్షుడు... తమ దేశ క్రీడల మంత్రిగాను నియమించారు. 1997లో క్వీన్ ఎలిజబెత్-2 చేతుల మీదుగా 'నైట్‌హుడ్'ను కూడా అందుకున్నాడు.

ఇంత చేసినా... ఇతనికి తప్పలేదు

ఫుట్‌బాల్ ఆట ప్రభను పెంచి... బ్రెజిల్ సాకర్ సత్తాను చాటి... క్రీడకే నిలువెత్తు నిదర్శనంలా నిలిచిన పీలేకు 'నల్లజాతి' అవమానాలు తప్పలేదు. అభిమానులు, సాకర్ లోకం అతన్ని వేనోళ్ల స్తుతిస్తే మతిలేని మంద, గిట్టని ప్రబుద్ధులు కొందరు అతని వర్ణం సాకుతో గేలిచేశారు. నల్ల కోతిలాంటి వెకిలి చేష్టలతో ఇబ్బంది పెట్టేవారు. కానీ దీపం మండే కొద్దీ వెలుగును ప్రభవించినట్లే... ఆడే కొద్దీ తన ఆటతీరుతో పీలే ఫుట్‌బాల్ క్రీడకే వన్నె తెచ్చాడు తప్ప తలొగ్గే పని, తలదించుకునే పని ఏనాడూ చేయలేదు.



మూడు వరల్డ్‌కప్ విజయాల్లో...

బ్రెజిల్ జట్టులోకి రాగానే తనకు మాత్రమే సాధ్యమైన ఆటతీరుతో పీలే కీలక ఆటగాడిగా మారాడు. దీంతో 16 ఏళ్లకే 1956లో బ్రెజిల్ జాతీయ జట్టుకి ఎంపికయ్యాడు. మైదానంలో మెరికలాంటి ఆటతో అందరికంటా పడ్డాడు. 1958 ప్రపంచకప్ కోసం స్వీడన్‌కు రిజర్వ్ ఆటగాడిగా వెళ్లిన పీలే కీలక ఆటగాడిగా స్వదేశానికి తిరిగొచ్చాడు. 17 ఏళ్ల టీనేజ్‌లో ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసిన పీలే బ్రెజిల్ చాంపియన్‌షిప్‌లో కీలకభూమిక పోషించాడు. మరో ప్రపంచకప్ (1962) నాటికి స్టార్ హోదాతో బరిలోకి దిగాడు. తన జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డిన పీలే తన కొచ్చిన 'స్టార్‌డమ్'కు న్యాయం చేశాడు. రెండో ప్రపంచకప్ విజయంలో భాగమయ్యాడు. 1966 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ అయిన బ్రెజిల్ గ్రూప్ దశలోనే వెనుదిరగడం, తదనంతర పరిస్థితులతో అదే తన చివరి ప్రపంచకప్ అని పీలే ప్రకటించాడు. తర్వాత మనసు మార్చుకున్న ఈ దిగ్గజం 1970 ప్రపంచకప్ ఆడి బ్రెజిల్ విజయానికి బాట వేశాడు. అలా 14 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో 12 గోల్స్ చేశాడు. మూడు ప్రపంచకప్ విజేత జట్లలో భాగమైన ఏకైక ఫుట్‌బాలర్‌గా నిలిచాడు.

వ్యక్తిగతం

జన్మదినం: అక్టోబర్ 23, 1940
ఎక్కడ: ట్రెస్ కొరకోస్, బ్రెజిల్.
అసలు పేరు: ఎడ్సన్ అరాంట్స్ డో నాసిమియాంటో.
తల్లిదండ్రులు: సెలెస్టె అరాంట్స్, జొవో రామోస్ నాసిమియాంటో.
పెళ్లిళ్లు 3: రోజ్‌మెరి (1966-78), అసిరియా (1994-2010), మార్సియా (2016 నుంచి)
సంతానం: కెలీ, ఎడ్సన్, జెన్నిఫర్, సాండ్రా (మృతి), ఫ్లావియా, జోషువా, సెలెస్టె.

భారత్‌తో అనుబంధం...






బ్రెజిల్ దిగ్గజం పీలేకు భారత్‌తో చక్కని అనుబంధమే ఉంది. కెరీర్‌లో, అనంతరం బిజీబిజీగా ఉండే పీలే మూడు సార్లు భారత పర్యటనకు వచ్చాడు. ముందుగా 1977లో కలకత్తా (ఇప్పటి కోల్‌కతా)కు వచ్చిన పీలే... న్యూయార్క్ కాస్మోస్ టీమ్ తరఫున మోహన్ బగాన్ క్లబ్ జట్టుతో ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడాడు. ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరిగింది. పీలే రాకతో కలకత్తా సాకర్ ప్రియుల ఆనందానికి అవధుల్లేవ్! సాకర్ మేనియాలో నగరం తడిసిముద్దయ్యింది. అనంతరం మళ్లీ 2015లోనూ ఇక్కడికొచ్చాడు. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నీలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సహ యజమానిగా ఉన్న అట్లెటికో డి కోల్‌కతా క్లబ్‌కు చెందిన కార్యక్రమంలో గంగూలీతో, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, విఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌లతో కలసి పీలే పాల్గొన్నాడు. అక్కడి నుంచి ఢిల్లీకి పయనమైన పీలే స్కూల్ విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడాడు. 'భారతీయ చిన్నారులతో ప్రపంచ ప్రఖ్యాత క్రీడ ఫుట్‌బాల్ ఆడటం ఎంతో ఆనందంగా ఉంది' అని ఈ సందర్భంగా అన్నాడు. 2018లో కూడా పీలే వచ్చినప్పటికీ ఓ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో పాల్గొని ఎలాంటి హడావుడి చేయకుండా వెళ్లిపోయాడు.


దక్షిణాఫ్రికా దివంగత అధ్యక్షుడు నెల్సన్ మండేలాతో...


రష్యా అధ్యక్షుడు పుతిన్, అర్జెంటీనా దివంగత సాకర్ స్టార్ మారదోనాతో...


అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో...


'బాక్సింగ్ గ్రేట్' దివంగత మొహమ్మద్ అలీతో...


ఫార్ములావన్ దిగ్గజ డ్రైవర్ మైకేల్ షుమాకర్‌తో...


తల్లి దోనా సెలెస్టెతో...

3న అంత్యక్రియలు

ప్రపంచానికి తన సత్తా చాటిన విలా బెల్మిరా స్టేడియంలో పీలే పార్థివదేహాన్ని ఉంచుతారు. సావోపాలో శివారులో ఉన్న ఈ స్టేడియంలో సోమవారం అభిమానులు నివాళులు అర్పించాక సాంటోస్‌లోని మెమోరియల్ నెక్రోపోలె ఎక్యుమెనికలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. కేవలం పీలే కుటుంబసభ్యులే దీనికి హాజరవుతారు. మంచానికి పరిమితమైన పీలే మాతృమూర్తి చూసేందుకు వీలుగా ఆయన అంతిమయాత్రను పీలే ఇంటిముందు నుంచి తీసుకెళ్తారు.

ఫుట్‌బాల్ 'కింగ్'కు అతిరథుల నివాళి



సాకర్ స్టార్, ఫుట్‌బాల్ కింగ్ పీలే ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత. నాపై మీరు కురిపించిన ప్రేమానురాగాలు నేనెప్పటికీ మరచిపోలేను. -క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్)

అతడిక లేడన్నది చేదు నిజం... కానీ అతని ఆట చిరస్మరణీయం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి కింగ్ పీలే. -ఎంబాపే (ఫ్రాన్స్)

స్పోర్టింగ్ లెజెండ్ పీలే. ఫుట్‌బాల్ కింగ్‌కు ఘనమైన నివాళి. - బోల్ట్ (దిగ్గజ స్ప్రింటర్)

ఆటను అందంగా తీర్చిదిద్దిన యోధుడు. ఫుట్‌బాల్‌ను కళాత్మకంగా మార్చిన లెజెండ్ పీలే. -నెమార్ జూనియర్ (బ్రెజిల్)

ఆల్‌టైమ్ సాకర్ సూపర్ స్టార్ పీలే. మీరే మా అందరికీ స్ఫూర్తి. -మెస్సీ (అర్జెంటీనా)

పీలే లేని లోటు పూడ్చలేనిది. తన ఆటతో, అద్భుత విన్యాసాలతో ఎల్లలెరుగని అభిమానాన్ని సంపాదించుకున్నాడు. అతని స్ఫూర్తిమంతమైన జీవితం భావి తరాలకు ప్రేరణగా నిలుస్తుంది. -భారత ప్రధాని మోదీ

హంపి అద్భుతం

ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్



అల్మాటీ (కజకిస్తాన్): ఊహకందని ఆటతీరుతో అదరగొట్టిన భారత మహిళా చెస్ స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో మెరిసింది. నిర్ణీత 17 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 35 ఏళ్ల హంపి 12.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. తొలి రోజు గురువారం తొమ్మిది రౌండ్లు ముగిశాక హంపి 5 పాయింట్లతో 44వ ర్యాంక్‌లో ఉండటంతో ఆమెకు పతకం నెగ్గే అవకాశాలు లేవని భావించారు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ హంపి రెండో రోజు జరిగిన ఎనిమిది గేముల్లో అద్భుత ప్రదర్శన చేసింది. ఏడు గేముల్లో గెలవడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో గేమ్‌ను 'డ్రా' చేసుకొని 44వ స్థానం నుంచి ఏకంగా రెండో ర్యాంక్‌కు చేరుకుంది. 13 పాయింట్లతో బిబిసారా అసుబయేవా (కజకిస్తాన్) విజేతగా నిలువగా... 12 పాయింట్లతో పొలీనా షువలోవా (రష్యా) కాంస్య పతకాన్ని సాధించింది. బిబిసారాకు 40 వేల డాలర్లు (రూ. 33 లక్షల 11 వేలు), హంపికి 30 వేల డాలర్లు (రూ. 24 లక్షల 83 వేలు), పొలీనాకు 20 వేల డాలర్లు (రూ. 16 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 10.5 పాయింట్లతో హారిక 13వ ర్యాంక్‌లో నిలిచింది. 21 రౌండ్లపాటు జరిగిన ఓపెన్ విభాగంలో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే; 16 పాయింట్లు) టైటిల్ సాధించగా... ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 13 పాయింట్లతో 17వ ర్యాంక్‌లో, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 12 పాయింట్లతో 42వ ర్యాంక్‌లో నిలిచారు.

3 ప్రపంచ ర్యాపిడ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ చరిత్రలో హంపి సాధించిన మొత్తం పతకాలు. ర్యాపిడ్ విభాగంలో 2012లో కాంస్యం నెగ్గిన హంపి, 2019లో స్వర్ణ పతకం గెలిచింది. బ్లిట్జ్ విభాగంలో రజతం రూపంలో తొలిసారి పతకం సాధించింది.

స్వర్ణం నెగ్గిన గురు



చెన్నై: జాతీయ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శనపతి గురు నాయుడు స్వర్ణ పతకాన్ని సాధించాడు. శుక్రవారం జరిగిన యూత్ పురుషుల 55 కేజీల విభాగంలో విజయనగరం జిల్లాకు చెందిన 16 ఏళ్ల గురు నాయుడు మొత్తం 233 కేజీలు (స్నాచ్‌లో 104+క్లీన్ అండ్ జెర్క్‌లో 129) బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఏడాది మెక్సికోలో జరిగిన ప్రపంచ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గురు నాయుడు 55 కేజీల విభాగంలో మొత్తం 230 కేజీలు బరువెత్తి బంగారు పతకం సాధించాడు. తాజాగా జాతీయ టోర్నీలో అతను అదనంగా మరో మూడు కేజీలు ఎక్కువ బరువెత్తడం విశేషం.

పాక్, కివీస్ టెస్టు 'డ్రా'

కరాచీ: చివరి సెషన్‌లో వెలుతురు మందగించడంతో ఉత్కంఠభరిత ముగింపు లభిస్తుందనుకున్న పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు 'డ్రా' అయింది. పాక్ నిర్దేశించిన 138 పరుగుల లక్ష్యాన్ని 15 ఓవర్లలో ఛేదించడానికి బరిలోకి దిగిన న్యూజిలాండ్ 7.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది. ఈ దశలో వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను నిలిపి వేశారు. దాంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. అంతకుముందు పాక్ రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 8 వికెట్లకు 311 పరుగులవద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

మరో అవార్డుపై స్మృతి గురి

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వార్షిక అవార్డుల్లో భాగంగా మహిళల విభాగంలో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం రేసులో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నిలిచింది. శుక్రవారం ఐసీసీ ఈ విభాగంలో నలుగురు క్రికెటర్లను నామినేట్ చేసింది. భారత్ నుంచి స్మృతి రెండుసార్లు (2018, 2021), జులన్ గోస్వామి (2007) ఒకసారి ఈ పురస్కారం గెల్చుకున్నారు. గురువారం ప్రకటించిన టి20 'మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు కూడా స్మృతి నామినేట్ అయిన సంగతి తెలిసిందే.

పంత్‌కు పెను ప్రమాదం

- గాయాలతో బయటపడ్డ భారత క్రికెటర్
- ఢిల్లీ నుంచి రూర్కీకి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టిన పంత్ కారు




దగ్ధమైన పంత్ కారు

న్యూఢిల్లీ/డెహ్రాడూన్: భారత స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ శుక్రవారం ఉదయం పెను ప్రమాదానికి గురయ్యాడు. ఢిల్లీ నుంచి ఉత్తరాఖండ్‌లోని తన స్వస్థలం రూర్కీకి వెళ్తుండగా పంత్ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. శుక్రవారం ఉదయం 5 గంటల 30 నిమిషాలకు ఈ సంఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే పంత్ కారులో మంటలు చెలరేగాయి. అటువైపు వెళ్తున్న హరియాణా రోడ్‌వేస్‌కు చెందిన బస్ డ్రైవర్ సుశీల్ మాన్ ప్రమాద దృశ్యాన్ని చూసి బస్సు ఆపి అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే పంత్ కారు కిటికీ అద్దాలు పగులగొట్టుకొని బయటకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ తర్వాత సుశీల్ సహాయంతో పంత్ కారు బయటకు వచ్చాడు. ఆ వెంటనే పంత్‌ను అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారని హరిద్వార్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజయ్ సింగ్ తెలిపారు. ప్రమాద తీవ్రతకు పంత్ కారు పూర్తిగా దగ్ధమైంది. తల్లికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్వస్థలం చేరుకొని సర్‌ప్రైజ్ ఇద్దామనుకొని పంత్ స్వయంగా కారు నడుపుతూ ఢిల్లీ నుంచి బయలుదేరాడు. ప్రమాదంలో పంత్ నుదురు చిట్లింది. వీపుపై గాయాలయ్యాయి. కుడి మోకాలి లిగ్మెంట్ స్థానభ్రంశమైంది. ప్రస్తుతం పంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని... అతని మెదడుకు, వెన్నెముకకు ఎలాంటి గాయాలు కాలేదని ఎంఆర్ఐ స్కాన్‌లలో తేలినట్లు బీసీసీఐ తెలిపింది. పంత్ చికిత్సకయ్యే ఖర్చులన్నీ తామే భరిస్తామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రకటించారు. అయితే పంత్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్ కావడంతో చికిత్స ఖర్చులను తాము చెల్లిస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. పంత్ తొందరగా కోలుకోవాలని జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఆకాంక్షించాడు. భారత ప్రధాని నరేంద్ర మోదీతోపాటు దిగ్గజం సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, శిఖర్ ధావన్, వీరేంద్ర సెహ్వాగ్, పాక్ క్రికెటర్ షాహిన్ షా అఫ్రిది, ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం, హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తదితరులు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ పంత్‌కు ధైర్యం చెప్పారు. అతడు త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. వచ్చే నెలలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే ఆరు మ్యాచ్‌ల సిరీస్‌కు పంత్ దూరంగా ఉన్నాడు. ఇప్పటి వరకు పంత్ 33 టెస్టులు ఆడి 2,271 పరుగులు సాధించాడు. 30 వన్డేల్లో, 66 టి20 మ్యాచ్‌ల్లోనూ పంత్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

మహారాష్ట్ర చేతిలో ఆంధ్ర ఓటమి


ప్రదీప్ ధాడె

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు రెండో పరాజయం ఎదుర్కొంది. మహారాష్ట్ర జట్టుతో శుక్రవారం ముగిసిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 131 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 240 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 38.1 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 100/4తో చివరిరోజు ఆట కొనసాగించిన ఆంధ్ర కేవలం ఎనిమిది పరుగులు జతచేసి మిగతా ఆరు వికెట్లను కోల్పోవడం గమనార్హం. ఆంధ్ర ఆఖరి రోజు చేజార్చుకున్న ఆరు వికెట్లలో ఐదింటిని మహారాష్ట్ర మీడియం పేసర్ ప్రదీప్ ధాడె (6/20) తీయడం విశేషం. కెప్టెన్ హనుమ విహారి (36; 3 ఫోర్లు) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు వద్దే అవుటవ్వగా... కరణ్ షిండే (7) ఒక పరుగు జోడించి నిష్క్రమించాడు. నితీశ్ కుమార్, షోయబ్ ఖాన్, కార్తీక్ రామన్ 'డకౌట్'గా వెనుదిరగ్గా... కేవీ శశికాంత్ (7) చివరి వికెట్‌గా అవుటవ్వడంతో ఆంధ్ర ఓటమి ఖరారైంది. తొలి మ్యాచ్‌లో ముంబై చేతిలో తొమ్మిది వికెట్ల తేడాతో ఓడిన ఆంధ్ర... రెండో మ్యాచ్‌లో ఎనిమిది పరుగుల తేడాతో తమిళనాడుపై గెలిచింది. జనవరి 3 నుంచి విశాఖపట్నంలో జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో హైదరాబాద్‌తో ఆంధ్ర తలపడుతుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽ 293	60,841	
నిఫ్టీ ▽ 86	18,105	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,392	▽	86
డోజోన్స్	33,033	▽	187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	▽	61
డాక్స్	13,924	▽	148
షాంఘై	3,089	△	16
నికాయ్	26,094	△	1

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 54,867	△	216
బంగారం (99.5 స్వచ్ఛత) 54,647	△	215
వెండి (కిలో) 68,092	△	252

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.01	83.68
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.80	89.89
€	యూరో	ఎస్‌బీఐ	98.24	101.53
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.47	63.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.02	57.42
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.65	62.60
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.86	12.86

నవంబర్‌లో మౌలిక పరిశ్రమ 5.4 శాతం అప్

న్యూఢిల్లీ: ఎనిమిది రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమల గ్రూప్ నవంబర్‌లో 5.4 శాతం (2021 ఇదే నెలతో పోల్చి) పురోగమించింది. బొగ్గు (12.3 శాతం), ఎరువులు (6.4 శాతం), స్టీల్ (10.8%), సిమెంట్ (28.6 శాతం), విద్యుత్ (12.1 శాతం) రంగాలు మంచి ఫలితాలను నమోదుచేసుకోవడం దీనికి నేపథ్యం. అధికారిక గణాంకాల ప్రకారం, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టుల నవంబర్ ఉత్పత్తిలో అసలు వృద్ధిలేక పోగా క్షీణత నమోదుచేసుకుంది.



అక్టోబర్‌లో ఈ గ్రూప్ వృద్ధిరేటు 0.9 శాతం కాగా, గత ఏడాది ఇదే నెల్లో 3.2 శాతం. ఇక 2022-23 మొదటి తొమ్మిది (ఏప్రిల్-నవంబర్) నెలల్లో గ్రూప్ వృద్ధిరేటు 8 శాతంకాగా, గత ఏడాది ఇదే కాలంలో వృద్ధి రేటు 13.9 శాతం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ 40.27 శాతం. ఐఐపీ నవంబర్ గణాంకాలు 2023 జనవరి రెండవ వారంలో విడుదల కానున్నాయి.

జనవరి 4న 'బీమా' సమ్మె

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల్లో పునర్‌వ్యవస్థీకరణ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ ఆయా కంపెనీల ఉద్యోగుల్లో కొన్ని వర్గాలు జనవరి 4న సమ్మెకు పిలుపునిచ్చాయి. ప్రతిపాదిత పునర్ వ్యవస్థీకరణతో ప్రభుత్వ రంగ సంస్థలు బలహీనం అవుతాయని జాయింట్ ఫోరం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (జేఎఫ్‌టీయూ) ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల లాభాల్లో ఉన్న ఆఫీసులతో పాటు పలు కార్యాలయాలను విలీనం చేయడమో లేదా మూసివేయడమో జరుగుతుందని పేర్కొంది. గత కొన్నేళ్లుగా దాదాపు 1,000 కార్యాలయాలు మూతబడ్డాయని జేఎఫ్‌టీయూ తెలిపింది. ఇవన్నీ ఎక్కువగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఉండేవని వివరించింది. ఫలితంగా పాలసీదారులపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంది. ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ సౌరభ్ మిశ్రా ఇష్టా రీతిగా వ్యవహరిస్తూ నేషనల్ ఇన్సూరెన్స్ బోర్డుపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని జేఎఫ్‌టీయూ తెలిపింది. నేషనల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అష్యూరెన్స్, జీఐసీ రీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల్లోని 50,000 మంది పైచిలుకు ఉద్యోగులు, అధికారులు జనవరి 4న ఒక రోజు సమ్మెకు దిగనున్నట్లు జేఎఫ్‌టీయూ తెలిపింది.



ఆర్‌బీఐ ఉత్కర్ష్ 2.0 ఆవిష్కరణ

న్యూఢిల్లీ: 2023-25 సంవత్సరాలకు గాను పాటించే మధ్యకాలిక వ్యూహ ప్రణాళిక 'ఉత్కర్ష్ 2.0'ను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ఆవిష్కరించారు. నిర్దిష్ట మైలురాళ్లను సాధించేందుకు, విధుల నిర్వహణలో ఆర్‌బీఐ అత్యుత్తమ పనితీరు కనపర్చేందుకు పాటించాల్సిన విధానాలకు ఇది మార్గదర్శిగా ఉండనుంది. ఇందులో డేటా విశ్లేషణకు సంబంధించి కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్)ను మరింత విస్తృతంగా వినియోగించనున్నారు. 2023-2025 మధ్య కాలంలో ఆర్‌బీఐ ప్రాధాన్యమివ్వాల్సిన అంశాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, సాధించాల్సిన ఫలితాలు మొదలైనవి ఉత్కర్ష్ 2.0లో ఉంటాయి. 2019-2022 మధ్య కాలంలో తొలి ఉత్కర్ష్‌ను అమలు చేశారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెను సవాళ్ల నెలకొన్న తరుణంలో భారత్ జీ-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఏడాదే ఉత్కర్ష్ 2.0 కూడా ప్రారంభమవుతోందని ఆర్‌బీఐ పేర్కొంది.



డేటా సేకరణ, సమాచార వెల్లడిలో రిజర్వ్ బ్యాంక్ రెండు రకాల పాత్రలు పోషించాల్సి ఉంటుందని తెలిపింది. దీంతో అర్థవంతమైన, సరైన సమాచారాన్ని ఇచ్చేందుకు తాను సేకరించే డేటా కచ్చితమైనదిగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆర్‌బీఐపై ఉంటుందని వివరించింది. డేటాకు ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో విశ్లేషణ మొదలైన అవసరాల కోసం ఏఐ, ఎంఎల్ ఆధారిత సాధనాలను ఉత్కర్ష్ 2.0లో విస్తృతంగా వినియోగించనున్నట్లు పేర్కొంది.

చిన్న పొదుపు పథకాలకు బూస్ట్

- 1.1 శాతం వరకు రేట్ల పెంపు
- ప్రకటించిన కేంద్ర సర్కారు
- జనవరి-మార్చి త్రైమాసికానికి అమలు

న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. వీటిపై వడ్డీ రేట్లను ఒక శాతం వరకు పెంచుతూ కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి - మార్చి కాలానికి కొత్త రేట్లు అమలు కానున్నాయి. ఆర్‌బీఐ ఈ ఏడాది ఇప్పటి వరకు 2.25 శాతం మేర కీలకమైన రెపో రేటును పెంచడం తెలిసిందే. దీంతో చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లను సవరించినట్టు తెలుస్తోంది. వివిధ పథకాలపై పెంపు 0.20-1.1 శాతం మధ్య ఉంది. తాజా పెంపు తర్వాత కొన్ని పెట్టుబడి పథకాలు ఆకర్షణీయంగా మారాయి. ప్రధానంగా జీవిత లక్ష్యాలకు ఉపకరించే, దీర్ఘకాలంతో కూడిన పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై రేట్లు పెరగలేదు. అలాగే, సేవింగ్స్ డిపాజిట్, ఐదేళ్ల టైమ్ డిపాజిట్ రేట్లలోనూ ఎలాంటి మార్పులు చేయలేదు. నాలుగేళ్ల విరామం తర్వాత ఈ పథకాల రేట్లను కేంద్ర సర్కారు 2022 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సవరించడం గమనార్హం. అప్పుడు 0.10-0.30 శాతం మేర మూడు పథకాల రేట్లను పెంచింది. తాజా సవరణ తర్వాత బ్యాంక్ ఎఫ్‌డీ రేట్లకు, ఈ పథకాల రేట్లకు పెద్దగా వ్యత్యాసం లేదు.



పథకం	ప్రస్తుత రేటు(%)	సవరణ తర్వాత(%)
సేవింగ్స్ డిపాజిట్	4	4
ఏడాది టైమ్ డిపాజిట్	5.5	6.6
రెండేళ్ల టైమ్ డిపాజిట్	5.7	6.8
మూడేళ్ల టైమ్ డిపాజిట్	5.8	6.9
ఐదేళ్ల టైమ్ డిపాజిట్	6.7	7.0
ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్	5.8	5.8
సీనియర్ సిటిజన్ సేవింగ్స్	7.5	8
పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్	6.7	7.1
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	6.8	7.0
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.1	7.1
కిసాన్ వికాస్ పత్ర	7	7.2
సుకన్య సమృద్ధి యోజన	7.6	7.6

2022కు నష్టాలతో వీడ్కోలు

- ఆఖరి గంటలో అమ్మకాలు
- లాభాల్లోంచి నష్టాల్లోకి సూచీలు
- 293 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 18,150 దిగువకు నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్ ఈ 2022 ఏడాదిని నష్టాలతో ముగించింది. ఇన్వెస్టర్లు ఏడాది చివరి ట్రేడింగ్ రోజు కావడంతో అప్రమత్తంగా వ్యవహరించారు. మాంద్యం భయాలు తెరపైకి వస్తున్న తరుణంలో కొత్త ఏడాది అవుట్‌లుక్‌పై ఆందోళనకు గురయ్యారు. అంతర్జాతీయ సానుకూల పరిణామాలతో శుక్రవారం ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 195 పాయింట్లు పెరిగి 61,329 వద్ద, నిఫ్టీ 68 పాయింట్లు పెరిగి 18,259 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి సెషన్‌లో లాభాలతో కదలాడిన సూచీలు యూరప్ మార్కెట్ల బలహీన ప్రారంభంతో క్రమంగా నష్టాల్లోకి మళ్లాయి. ముఖ్యంగా చివరి గంటలో బ్యాంకింగ్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీ అమ్మకాలు తలెత్తాయి. ఫలితంగా సెన్సెక్స్ 293 పాయింట్లు నష్టపోయి 60,841 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్లు పతనమై 18,105 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంక్స్, మెటల్, రియల్టీ షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,951 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,266 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది. ఈ ఏడాదిలో దేశీ కరెన్సీ డాలర్ మారకంలో ఏకంగా 11.36% (844 పైసలు) క్షీణించింది.



స్టాక్ మార్కెట్‌కు కలిసిరాని 2022...

స్టాక్ మార్కెట్‌కు ఈ ఏడాది(2022) కలిసిరాలేదు. గతేడాది(2021) ఏకంగా 22% రాబడినిచ్చిన దలాల్ స్ట్రీట్ ఈ క్యాలెండర్ సంవత్సరంలో కేవలం నాలుగున్నర శాతం స్వల్పలాభంతో సరిపెట్టింది. సెన్సెక్స్ 2,586 పాయింట్లు (4.44%), నిఫ్టీ 751 పాయింట్లు(4.32%) చొప్పున ఆర్జించాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంపు, రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం హెచ్చరికల భయాలు మార్కెట్ అస్థిరతకు కారణమయ్యాయి. ఇదే ఏడాదిలో స్టాక్ మార్కెట్లో రూ.16.45 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. డిసెంబర్ ఒకటో తేదీన సెన్సెక్స్ 63,583 పాయింట్ల వద్ద, నిఫ్టీ 18,888 పాయింట్లు జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. ఫిబ్రవరి 15న అత్యధికంగా లాభపడగా.. ఫిబ్రవరి 24న అత్యధిక నష్టాలను చవిచూశాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు భారీగా ర్యాలీ చేయగా, ఐటీ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- క్రాఫ్ట్‌మెన్ ఆటోమిషన్ షేరు 14% ర్యాలీ చేసి రూ.3710 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. డాక్టర్ యాక్సిన్ ఇండియాను రూ.375 కోట్లకు చేజిక్కించుకోవడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది. చివర్లో కొంత లాభాల స్వీకరణ జరగడంతో 8% శాతం లాభంతో రూ.3,507 వద్ద స్థిరపడింది.
- హరియాణాలో రూ.624 కోట్ల రోడ్డు ప్రాజెక్ట్ దక్కడంతో హెజీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ 7% బలపడి రూ.616 వద్ద స్థిరపడింది.

లిస్టింగ్ రోజే ఎలీన్ ఎలక్ట్రానిక్స్ డీలా

ఎలీన్ ఎలక్ట్రానిక్స్ షేరు లిస్టింగ్ రోజే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.247)తో పోలిస్తే ఒకటిన్నర శాతం నష్టంతో రూ.244 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో ఎనిమిదిన్నర శాతం క్షీణించి రూ.226 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 8% నష్టంతో రూ.228 వద్ద స్థిరపడింది.

అదానీ గ్రూప్ గూటిలో ఎన్‌డీటీవీ

- ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌ల వాటా కొనుగోలు
- ప్రస్తుతం అదానీ వాటా 64.71 శాతానికి

న్యూఢిల్లీ: వార్తా చానళ్ల దిగ్గజం న్యూఢిల్లీ టెలివిజన్ (ఎన్‌డీటీవీ)లో అదానీ గ్రూప్ తాజాగా 27.26 శాతం వాటాను సొంతం చేసుకుంది. వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌ల నుంచి ఈ వాటాను కొనుగోలు చేసినట్లు అదానీ గ్రూప్ పేర్కొంది. దీంతో మీడియా సంస్థలో అదానీ గ్రూప్ వాటా 64.71 శాతానికి ఎగసింది. వెరసి ఎన్‌డీటీవీపై పూర్తి నియంత్రణను సాధించింది. గత వారం రాయ్ జంట తమకుగల 27.26 శాతం వాటాను అదానీ గ్రూప్‌నకు విక్రయించనున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఎన్‌డీటీవీలో రాయ్‌లకు సంయుక్తంగా 32.26 శాతం వాటా ఉంది. తాజా లావాదేవీ తదుపరి రాయ్‌ల వాటా(2.5 % చొప్పున) 5 శాతానికి పరిమితమైంది. షేరుకి రూ. 342.65 ధరలో 1.75 కోట్ల షేర్లను చేజిక్కించుకున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. మైనారిటీ వాటాదారులకు చెల్లించిన(ఓపెన్ ఆఫర్) ధరతో పోలిస్తే ఇది 17 శాతం అధికంకాగా.. తద్వారా రాయ్ జంట రూ. 602 కోట్లు అందుకుంది. అనుబంధ సంస్థ ఆర్‌ఆర్‌పీఆర్ హోల్డింగ్స్ ద్వారా వాటా కొనుగోలును పూర్తి చేసినట్లు అదానీ గ్రూప్ తెలియజేసింది.

రాయ్‌ల రాజీనామాలు

యాజమాన్య నియంత్రణ పూర్తిస్థాయిలో చేతులు మారిన నేపథ్యంలో వ్యవస్థాపకులు ప్రణవ్ రాయ్, రాధికా రాయ్‌సహా మరో నలుగురు డైరెక్టర్లు బోర్డుకు రాజీనామా చేసినట్లు ఎన్‌డీటీవీ పేర్కొంది. అంతేకాకుండా కనీస వాటా మాత్రమే మిగిలిన మాజీ ప్రమోటర్లు కంపెనీలో తమను పబ్లిక్ కేటగిరీ వాటాదారులుగా పరిగణించమంటూ బోర్డుని అభ్యర్థించారు. ఇందుకు బోర్డు అనుమతించగా.. స్టాక్ ఎక్స్చేంజీలు, వాటాదారులు ఆమోదముద్ర వేయవలసి ఉన్నట్లు ఎన్‌డీటీవీ తెలియజేసింది. బోర్డు నుంచి తప్పుకున్న డైరెక్టర్లలో దారియస్ తారాపోర్వాలాతోపాటు, స్వతంత్ర డైరెక్టర్లు కౌశిక్ దత్తా, ఇంద్రాణి రాయ్, జాన్ మార్టిన్ ఓలోన్ ఉన్నారు. ఇప్పటివరకూ ప్రణవ్ రాయ్, రాధికా రాయ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ కోచైర్‌పర్సన్ పదవిలో ఉన్న విషయం విదితమే. మరోవైపు అమన్ కుమార్ సింగ్‌ను నాన్‌ఎగ్జిక్యూటివ్ అదనపు డైరెక్టర్‌గా, సునీల్ కుమార్‌ను స్వతంత్ర నాన్‌ఎగ్జిక్యూటివ్ అదనపు డైరెక్టర్‌గా బోర్డు ఎంపిక చేసినట్లు ఎన్‌డీటీవీ వెల్లడించింది.



ఈ వార్తల నేపథ్యంలో ఎన్‌డీటీవీ షేరు 2.6% లాభపడి రూ. 348 వద్ద ముగిసింది.

సినిమా

ఎండ్ పంచ్

2022 ఎండ్ అవుతోంది... ఈ ఎండింగ్ హ్యాపీకి దారి తీయాలంటూ 2023కి వెల్‌కమ్ చెప్పడానికి రెడీ అవుతున్నాం. ఈ ఇయర్ ఎండింగ్‌ని కొన్ని పంచ్ డైలాగ్స్‌తో ఎండ్ చేద్దాం. 2022లో రిలీజైన చిత్రాల్లో పాపులర్ డైలాగ్స్ చాలా ఉన్నాయి. వాటిల్లో కొన్ని పంచ్ డైలాగ్స్, లవ్ డైలాగ్స్, కామెడీ డైలాగ్స్, ఎమోషనల్ డైలాగ్స్ ఈ విధంగా ...



బంగార్రాజు: ఏంటే ఈ మనుషులు.. బతికున్నప్పుడు ప్రాణం విలువ తెలీదేంటే వీళ్లకి.. పోతేనే తెలుస్తుందా? నాకు తెలుసే దాని విలువ.. చిన్న చిన్న గొడవల కోసం ఎందుకే జీవితాంతం కొట్టుకుని చస్తారు.. బతికున్నప్పుడే కదా ఈ ప్రేమలు.. పోయాక ఏం మిగులుతుందే.. ఫొటోలు తప్ప.

గుడ్ లక్ సఖి: గోలీ రాజు ఏంటి గోలీ రాజు? స్టేజి మీద నా పేరు రామారావు.. నువ్వు రామారావు అయితే నేను సావిత్రి.

ఖిలాడి: ఎప్పుడూ ఒకే టీమ్‌కి ఆడటానికి నేషనల్ ప్లేయర్‌ని కాదు.. ఐపీఎల్ ప్లేయర్. ఎవడెక్కువ పాడుకుంటే వాడికే ఆడతాను.

డీజే టిల్లు: ఇంట్లో ఒక శవాన్ని, బిల్డింగ్‌లో సీసీటీవీ కెమెరాల్ని పెట్టుకుని కూడా నువ్వు నన్ను పేరంటానికి పిలిచినట్టు పిలిస్తే నేను మొహానికి పౌడర్ కొట్టుకుని వచ్చేసినా చూడు అట్లుంటది మనతోని ముచ్చట.

సన్ ఆఫ్ ఇండియా: నేను చీకటిలో ఉండే వెలుతురిని.. వెలుతురులో ఉండే చీకటిని.. నేను కసక్ అంటే మీరందరూ ఫసక్.

ఆడవాళ్ళు మీకు జోహార్లు: వీకెండ్ అంటే ఏం ఉంటుందండి.. తాగటం, తినడం, తొంగోవడం.. అలా అందరిలా కాకుండా అంతర్వేది, అన్నవరం వెళ్లొద్దామనుకుంటున్నానండి.

రాధేశ్యామ్: ఏంట్రా.. నువ్వేమైనా రోమియో అనుకుంటున్నావా?, ఆడు ప్రేమ కోసం చచ్చాడు.. నేను ఆ టైపు కాదు.

ఆచార్య: పాఠాలు చెప్పే అలవాటు లేకపోయినా అందరూ ఎందుకో ఆచార్య అంటుంటారు.. బహుశా గుణపాఠాలు చెబుతాననేమో?

- ఆపదొస్తే ఆ అమ్మోరు తల్లే మాలో ఆవహించి ముందుకు పంపుద్ది.. ధర్మస్థలి అధర్మస్థలి కాకూడదు.

సర్కారువారి పాట: మీరు ఒక అమ్మాయితో మాట్లాడుతున్నారనే విషయం మర్చిపోవద్దు.

- దీనికున్న అలవాట్లకి, దీనికున్న వ్యసనాలకి అమ్మాయి అంటారా దీన్ని.

మేజర్: టైమ్‌కి మనం వెళ్లకపోవడం వల్ల ఒక్క ప్రాణం పోయినా కూడా లైఫ్‌లో నన్ను నేను సోల్జర్ అనుకోలేను సర్.

పక్కా కమర్షియల్: సెల్యూట్ కొట్టించుకోవడానికి నేను హీరోని కాదురా.. విలన్.

ది వారియర్: ఒంటి మీద యూనిఫామ్ లేకపోయినా రౌండ్ ద క్లాక్ డ్యూటీలో ఉంటాను.



థ్యాంక్యూ: లైఫ్‌లో ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు.. ఎన్నో వదులుకుని ఇక్కడికొచ్చాను.

బింబిసార: బింబిసారుడు అంటే మరణ శాసనం.. ఇక్కడ రాక్షసుడైనా, భగవంతుడైనా ఈ బింబిసారుడొక్కడే.

సీతారామం: చూడండీ... అడ్రస్ దొరికింది కదా అని వచ్చేస్తారేమో? అంత సాహసం మాత్రం చేయకండే!

కార్తికేయ 2: శక్తి, సామర్థ్యాలతో పాటు బుద్ధి, గుణం వల్లే రాముడు, శివుడు, శ్రీకృష్ణుడు దేవుళ్లయ్యారు.

లైగర్: లోపాలు అందరికీ ఉంటాయి. నీకు నత్తి ఉంది అంటున్నారు కదా. రేపు నీ మాట కూడా అందరికీ పాట లెక్క వినపడతది.. వినపడేటట్టు చేయాలి.

గాడ్‌ఫాదర్: నేను రాజకీయం నుంచి దూరంగా ఉన్నాను.. కానీ, నా నుంచి రాజకీయం దూరం కాలేదు.

జిన్నా: నమ్మకం లేని ప్రేమ.. కర్రల్లేని టెంటు నిలబడవు రేణుకా.

ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం: అన్యాయంగా బెదిరించేవాడికన్నా న్యాయం కోసం ఎదిరించే వాడే బలమైనవాడు.

హిట్ ది సెకండ్ కేస్: అవతలి టీమ్ వీక్ అని మన గోల్ కీపర్‌కి రెస్ట్ ఇవ్వలేం కదా సర్.

ధమాకా: నేను వెనకున్న వాళ్లను చూసుకుని ముందుకొచ్చినవాణ్ణి కాదు రోయ్.. వెనక ఎవడూ లేకపోయినా ముందుకు రావొచ్చు అని ఎగ్జాంపుల్ సెట్ చేసిన వాణ్ణి.

18 పేజెస్: ప్రేమించడానికి రీజన్ ఉండకూడదు.. ఎందుకు ప్రేమించాం అంటే ఆన్సర్ ఉండకూడదు.

పండగ మీద పండగ చేసుకోవాలి

- రవితేజ




వివేక్, భీమ్స్, టీజీ విశ్వప్రసాద్, రవితేజ, శ్రీలీల, త్రినాథరావు

"పండగ చేసుకుని రెండేళ్లయింది. మళ్లీ ఇప్పుడు పండగ ('ధమాకా' హిట్‌ని ఉద్దేశిస్తూ...). ఇకపై పండక్కి గ్యాప్ ఇవ్వొద్దు. పండగ మీద పండగ చేసుకోవాలి. మీ సపోర్ట్ (అభిమానులు, ప్రేక్షకులు) ఇలానే కొనసాగాలి" అని రవితేజ అన్నారు. రవితేజ హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ధమాకా'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాలో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో రవితేజ మాట్లాడుతూ- "'ధమాకా' సినిమాకు దర్శకుడు త్రినాథరావు డ్రైవర్ అయితే.. నేను కండక్టర్‌ని (నవ్వుతూ..). ఈ సినిమా సక్సెస్‌కి కారణమైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు" అన్నారు. "'ధమాకా' విజయం సమిష్టి కృషి" అన్నారు నక్కిన త్రినాథరావు. "రవితేజగారితో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాం" అన్నారు టీజీ విశ్వప్రసాద్. "'ధమాకా' విజయానికి ప్రధాన కారణం రవితేజ అన్న, ఆయన అభిమానులు" అన్నారు ఈ చిత్ర కథా రచయిత ప్రసన్నకుమార్ బెజవాడ. ఈ కార్యక్రమంలో కె. రాఘవేంద్రరావు, హరీష్ శంకర్, బండ్ల గణేష్, తేజా సజ్జా పాల్గొని 'ధమాకా' విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అభిప్రాయభేదాలు ఉంటే మంచిదే!

- సాయిమాధవ్ బుర్రా



"డైలాగ్ రైటర్‌గా నాకు ప్రతి కొత్త సినిమా ఓ సవాలే. హీరో పాత్ర, సన్నివేశం, హీరో ఇమేజ్‌ను బ్యాలెన్స్ చేస్తూ డైలాగ్స్ రాయాలి. కేవలం స్టార్ ఇమేజ్‌ను మాత్రమే దృష్టిలో పెట్టుకుని డైలాగ్స్ రాయడం అనేది కరెక్ట్ కాదని నా భావన. నేను అలా రాయను" అన్నారు రచయిత సాయిమాధవ్ బుర్రా. బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్ర సంభాషణల రచయిత సాయిమాధవ్ బుర్రా చెప్పిన విశేషాలు.

- బాలకృష్ణ గారితో నేను చేసిన నాలుగో సినిమా 'వీరసింహారెడ్డి'. అలాగే 'క్రాక్' తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితో నేను చేసిన రెండో సినిమా కూడా ఇదే. ఈ సినిమా కథా చర్చల సమయం నుంచే నేను ఈ ప్రాజెక్ట్‌తో అసోసియేట్ అయ్యాను. ఈ సినిమాలో ఓ కొత్త పాయింట్ ఉంది. ఒక పక్కా కమర్షియల్ సినిమాకు ఇలాంటి ఓ కొత్త పాయింట్ కలవడం అనేది చాలా అరుదు. ఎమోషన్, యాక్షన్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా, బాలకృష్ణగారి నుంచి కోరుకునే అన్ని అంశాలతో 'వీరసింహారెడ్డి' రూపొందింది.
- కథ చర్చల్లో భాగంగా అభిప్రాయభేదాలు ఉండొచ్చు. అవి ఉన్నప్పుడే పని కరెక్ట్‌గా జరుగుతున్నట్లు అర్థం. అన్నీ కూడా సినిమా అవుట్‌పుట్ బాగా రావడం కోసమే. ఒకసారి కథను ఓకే చేశాక బాలకృష్ణగారు అందులో ఇన్‌వాల్వ్ అవ్వరు. సందర్భానుసారంగా కొన్ని డైలాగ్స్ ఇంప్రొవైజేషన్స్ ఉండొచ్చు. ఇవన్నీ సినిమా జర్నీలో భాగం. కన్విన్స్ చేయడం, కన్విన్స్ అవ్వడం.. ఈ రెండు లక్షణాలు ఉన్న గొప్ప దర్శకుడు గోపీచంద్ మలినేనిగారు. మైత్రీ మూవీ మేకర్స్ వంటి నిర్మాతల వల్ల ఇండస్ట్రీ పచ్చగా ఉంటుంది.
- కొంతమంది రచయితలు ఇండస్ట్రీకి దర్శకులు కావాలని వచ్చి, రైటర్స్‌గా మొదలై, ఫైనల్‌గా దర్శకుడిగా గమ్యస్థానాన్ని చేరుకుంటారు. నేను రచయితను కావాలనే ఇండస్ట్రీకి వచ్చాను. రైటర్‌గా రాణిస్తున్నాను. ప్రస్తుతానికైతే డైరెక్షన్ ఆలోచన లేదు.
- 2017 సంక్రాంతికి చిరంజీవిగారి 'ఖైదీ నంబర్ 150', బాలకృష్ణగారి 'గౌతమిపుత్ర శాతకర్ణి' చిత్రాలు విడుదలయ్యాయి. ఈ రెండు సినిమాలకూ నేను పని చేశాను. రెండూ విజయం సాధించాయి. ఇప్పుడు మళ్లీ చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహా రెడ్డి' చిత్రాలు సంక్రాంతికి విడుదలవుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య'కు నేను చేయకపోయినా అదీ నా సినిమాగానే భావిస్తాను. ఎందుకంటే చిరంజీవిగారికి నేనంటే అభిమానం. దర్శకుడు బాబీ నా మిత్రుడు. ఈ రెండు చిత్రాలూ సక్సెస్ అవ్వాలి.
- ప్రస్తుతం ప్రభాస్ 'ప్రాజెక్ట్ కె', పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు', హీరో రామ్ చరణ్-దర్శకుడు శంకర్ కాంబినేషన్ సినిమా, అర్జున్ దర్శకత్వంలోని సినిమా, నిర్మాత కేఎస్ రామారావు సినిమాలు చేస్తున్నాను.

హంట్ అప్పుడే



సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'హంట్'. మహేశ్ దర్శకత్వంలో వి. ఆనందప్రసాద్ నిర్మించిన ఈ సినిమాలో సుధీర్‌బాబు, శ్రీకాంత్, భరత్ పోలీసాఫీసర్లుగా నటించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 26న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వి. ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ - "రిపబ్లిక్ డే కానుకగా 'హంట్' సినిమాను జనవరి 26న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తయ్యాయి. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన పలు చిత్రాలకు పని చేసిన యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రేనాడ్ ఫవెరో, బ్రయాన్ విజియర్ 'హంట్' సినిమాకు యాక్షన్ స్టంట్స్ కొరియోగ్రఫీ చేశారు. వాళ్ల డిజైన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా నిలుస్తుంది" అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, కెమెరా: అరుల్ విన్సెంట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.

వచ్చినవాడు గౌతమ్



పాలక్ లల్వాని, అశ్విన్, దామోదర ప్రసాద్

అశ్విన్ బాబు, పాలక్ లల్వాని హీరో హీరోయిన్లుగా ఎం.ఆర్. కృష్ణను దర్శకుడిగా పరిచయం చేస్తూ డీఎస్ఆర్ నిర్మిస్తున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నిర్మాత బెల్లంకొండ సురేష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత దామోదర ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత అనిల్ సుంకర గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత డీఎస్ఆర్ మాట్లాడుతూ - "నిర్మాతగా చాలా రోజులు బ్రేక్ తీసుకుని నేను తీస్తున్న సినిమా ఇది. దర్శకుడు ఎం.ఆర్. కృష్ణ చెప్పిన మెడికో థ్రిల్లర్ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాను. రెండు షెడ్యూల్స్‌లోనే చిత్రీకరణను ముగించి, సినిమాను మేలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలో ఓ యూత్ హీరోతో నేను చేయనున్న మరో సినిమా గురించిన వివరాలను వెల్లడిస్తాను" అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: హరి గౌర, కెమెరా: శ్యామ్ కె. నాయుడు, సహనిర్మాతలు: చందు, వెంకట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: రమేష్ తోట, గిరిధర్.

మొదట రైతు బిడ్డ.. తరువాతే ఎంపీ!



శరభన్నపాలెం సమీపంలో భర్త శివప్రసాద్‌తో కలిసి ధాన్యం ఎత్తుతున్న ఎంపీ మాధవి

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు ఎంపీ గొడ్డేటి మాధవి.. రైతు కుటుంబానికి చెందిన ఆమె జీవనశైలి చాలా సాధారణంగా ఉంటుంది. ఎంపీ కాకముందు కూడా ఆమె తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొనేవారు. ఇప్పుడు కూడా ఆమె తీరిక దొరికినప్పుడల్లా వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఆమె తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే దేముడుకి వ్యవసాయ పనుల్లో సాయపడేవారు. వరి పంట చేతికందొచ్చిన వేళ ఆమె భర్త శివప్రసాద్‌తో కలిసి శుక్రవారం పొలం పనుల్లో పాల్గొన్నారు. నూర్చిన ధాన్యాన్ని వారే నేరుగా బస్తాల్లోకి వేశారు. ఎంపీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి వ్యవసాయం అంటే ఇష్టమన్నారు. ఆమెతోపాటు వ్యవసాయ పనుల్లో ఎంపీ తల్లి చెల్లయమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్నప్పుడు రూ.1000 చేతిలో ఉంచుకోవచ్చు

ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఉన్న రూ.500 పరిమితిని రూ.1000కి పెంచిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు తమ చేతిలో ఉంచుకునే మొత్తాన్ని ప్రభుత్వం రూ.1000కి పెంచింది. గతంలో ఇది రూ.500గా ఉండేది. మారిన పరిస్థితుల నేపథ్యంలో సమీక్షించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులిచ్చింది. జిల్లాలు, హెచ్‌వోడీలు, రాష్ట్ర సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు తమ దగ్గర రూ.500, పర్యటనలో ఉన్నప్పుడు రూ.10 వేలు ఉంచుకోవచ్చని గతంలో నిబంధన ఉండేది. ఏసీబీ దీన్ని సమీక్షించి చేతిలో ఉంచుకునే మొత్తాన్ని రూ.1000కి పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ యాప్స్ విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో చేతిలో డబ్బు ఉంచుకోవాల్సిన అవసరం పెద్దగా ఉండదని తెలిపింది. అయినా ఆ మొత్తాన్ని కొద్దిగా పెంచి రూ.1000కి పరిమితం చేయాలని సూచించింది. దీనికి సాధారణ పరిపాలన శాఖ ఆమోదం తెలిపి జీవో ఇచ్చింది.

3న పద్మావతి మహిళా వర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో జనవరి మూడో తేదీన పీజీ స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య సువర్ణ లతాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ, అప్లయిడ్ మైక్రో బయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, బోటనీ, జువాలజీ, సెరీకల్చర్, అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సైన్సెస్, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, క్లినికల్ సైకాలజీ, స్టాటిస్టిక్స్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంఏ ఇంగ్లిష్, తెలుగు, సోషల్ వర్క్, ఎకనామిక్స్, జెండర్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, మ్యూజిక్, భరతనాట్యం, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌తోపాటు కామర్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. ఏపీపీజీ సెట్–2022లో ర్యాంకులు పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు www. spmvv. ac. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 31 । డిసెంబర్ । 2022

థ్యాంక్యూ సర్..

రాష్ట్రంలో రెండు రోజుల పర్యటన పూర్తి చేసుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు శుక్రవారం విజయవాడ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు పలువురు న్యాయమూర్తులు, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ పి.జాషువా తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

- విమానాశ్రయం(గన్నవరం)



న్యూస్‌రీల్

కృష్ణా వర్సిటీ జూడో జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: అంతర్ విశ్వవిద్యాలయాల జూడో పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు విజయవాడ సప్తగిరి కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ పీవీడీ శ్రీదేవి తెలిపారు. ఇటీవల కళాశాల ప్రాంగణంలో యూనివర్సిటీ అంతర్ కళాశాలల జూడో పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన కె.కల్యాణ్‌కుమార్(సప్తగిరి కళాశాల, విజయవాడ), ఎం.వరప్రసాదరావు(ప్రభాస్ కళాశాల, విజయవాడ), పి.అభిషేక్(వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మొవ్వ), వై.వంశీ(ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, విజయవాడ), ఎస్.చందు(వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మొవ్వ) యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. జనవరి రెండో తేదీ నుంచి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టు మేనేజర్, కోచ్‌గా ఇ.శ్రీను వ్యవహరిస్తారన్నారు. జట్టు బృందాన్ని సప్తగిరి కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ మన్మథరావు, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఆర్.రఘురామ్ అభినందించారు.

వేంకటేశ్వరుని హుండీ ఆదాయం రూ. 30.78 లక్షలు



తిరుమలగిరి (జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ. 30,78,380 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ శ్రీరామవరప్రసాదరావు శుక్రవారం పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో పై ఆదాయంతో పాటు బంగారం 60 గ్రాములు, వెండి 380 గ్రాములు వచ్చిందన్నారు. ఇది నాలుగు నెలలకు సంబంధించిన ఆదాయమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఆలయ ఇన్‌స్పెక్టర్ అనురాధ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

1.95 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి రూ. 397.95 కోట్ల విలువైన 1,95,778 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కృష్ణా జేసీ అపరాజితసింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ. 303.85 కోట్లు రైతులకు చెల్లించినట్లు ఆమె తెలిపారు. రైతులు అమ్మిన ధాన్యానికి డిసెంబర్ 22వ తేదీ వరకు నగదు చెల్లించినట్లు స్పష్టం చేశారు.

శాంతి భద్రతలు భేష్

- గతేడాదితో పోల్చితే 13 శాతం తగ్గుముఖం
- చోరీ కేసుల్లో 85 శాతం సొత్తు రికవరీ
- మహిళా సంబంధిత కేసుల్లో 35 మంది నిందితులకు జైలు శిక్ష
- స్వల్పంగా పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె. రాణా

ఎన్టీఆర్ జిల్లాలో పెరిగిన భద్రత.. తగ్గిన నేరాలు



మీడియాతో మాట్లాడుతున్న సీపీ టి.కె. రాణా, చిత్రంలో డీసీపీ విశాల్ గున్ని తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జిల్లాలో శాంతిభద్రతలను సంరక్షిస్తూ.. నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించామని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యటనలు, సభలు, సమావేశాలను, దసరా, వినాయక చవితి, భవానీ దీక్షల విరమణల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సమర్థంగా విధులు నిర్వర్తించామన్నారు. స్థానిక పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించి, అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు.

13 శాతం తగ్గిన నేరాలు..

గత ఏడాది నేరాల సంఖ్య 17,174 కాగా, ఈ ఏడాది 15,329 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. తద్వారా 13 శాతం తగ్గాయన్నారు. 217 చోరీ కేసుల్లో రూ.9.43 కోట్ల సొత్తుకుగానూ, రూ.7.99 కోట్లు(85శాతం) రికవరీ చేశామన్నారు. 41 హత్యలు, 100 దాడి ఘటనల్లో 95 శాతం కేసులు ఛేదించి వెంటనే కోర్టులో చార్జిషీటు దాఖలు చేశామన్నారు. 159 సైబర్, 97 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేశామన్నారు. 2021తో పోల్చితే 9శాతం మేర హత్యలు తగ్గాయన్నారు. ఈ ఏడాది 135 మందిపై రౌడీషీట్లు తెరిచామని, 14 మందిని నగర బహిష్కరణ చేశామన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. నగరంలో 1800 సీసీ కెమెరాలున్నాయని, వీటిల్లో 330 సీసీ కెమెరాల సాయంతో కీలకమైన కేసులు ఛేదించేందుకు దోహదపడ్డాయన్నారు.

ఎక్సైజ్ కేసుల్లో..

103 గంజాయి అక్రమ రవాణా కేసుల్లో 205 మందిని అరెస్ట్ చేసి రూ.38.25 లక్షల విలువైన 765 కేజీల గంజాయిని, 18 వాహనాలను అదుపులోకి తీసుకున్నామని సీపీ రాణా చెప్పారు. 210 గుట్కా కేసుల్లో 226 మందిని అరెస్ట్ చేసి రూ.27.89 లక్షలు విలువ చేసే గుట్కా ప్యాకెట్‌లను, 3 వాహనాలను సీజ్ చేశామన్నారు. 1,685 అక్రమ, నకిలీ మద్యం కేసులలో 1,757 మందిని అరెస్ట్ చేసి రూ.69.32 లక్షల విలువైన 31,906 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇటీవల 1992 నుంచి పట్టుబడిన 22.5 వేల కేజీల గంజాయిని కాల్చివేశామన్నారు. అలాగే 2019 నుంచి పట్టుబడిన 5.18 లక్షల మద్యం బాటిళ్లను, నాటుసారాకు ఉపయోగించే 14 వేల కేజీల బెల్లం ఊటను, 225 కేజీల పటికను, 20 వేల లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశామన్నారు.

'కొత్త' వేడుకలకు అనుమతి తప్పనిసరి

క్లబ్‌లు, రెస్టారెంట్‌లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునేందుకు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని ఈ సందర్భంగా సీపీ రాణా సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి నగరంలోని ఫ్లై ఓవర్‌లను మూసివేస్తున్నట్లు చెప్పారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు..

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య స్వల్పంగా పెరిగిందని సీపీ చెప్పారు. గత ఏడాది 1,133 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 1,360 కేసులు నమోదయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాలను నివారించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

ఛేదించిన ముఖ్య కేసులు..

కృష్ణ లంక పోలీస్ స్టేషన్ పరిధిలో బందర్‌రోడ్‌లో ప్రముఖ బంగారం షాపులో జరిగిన చోరీలో నిందితుని అరెస్టు చేసి, రూ. 41లక్షలను రికవరీ చేశామని సీపీ చెప్పారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్ ఆఫీస్ ద్వారా అక్రమంగా ఎఫిడ్రిన్ మాదక ద్రవ్యాన్ని ఆస్ట్రేలియాకు పంపిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 1.58 కోట్ల విలువైన ఫారెన్ సిగరెట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. హవాలా రూపంలో ఉన్న నగదును రూ. 2.71కోట్లు పట్టుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో డీసీపీలు విశాలగున్ని, శ్రీనివాసరావు, మోకాసత్తిబాబు, ఉదయరాణి ఏడీసీపీలు వెంకటరత్నం, లక్ష్మీపతి, సర్కార్, ఏసీపీలు ఖాదర్‌బాషా, రవికిరణ్,హనుమంతరావు, చెంచిరెడ్డి, రమణమూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన భద్రత..

మహిళలకు మెరుగైన భద్రతను కల్పించామని సీపీ రాణా వెల్లడించారు. చేరువ వాహనం ద్వారా ప్రతి రోజూ రెండు ప్రదేశాల్లో మహిళలకు పలు రకాల నేరాలపై అవగాహన కల్పించామన్నారు. 911 మహిళా సంబంధిత కేసుల్లో 79 మైనర్ బాలికలపై జరిగిన ఘటనలు వెలుగు చూశాయన్నారు. ఈ ఘటనల్లో 35 మంది నిందితులకు కఠిన శిక్షలు పడినట్లు చెప్పారు. జిల్లాలో 14, 95, 244 మందితో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేయించామని, దిశా సిబ్బంది నిత్యం పెట్రోలింగ్ చేస్తూ మహిళలకు రక్షణకు పాటుపడ్డారన్నారు.

నేడు వైద్య శాఖలో ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

మచిలీపట్నం: వైద్య ఆరోగ్యశాఖలో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు (మేల్) గా పనిచేస్తున్న వారికి మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారిగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పద్మా శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జోన్- 2 పరిధిలో 37 మందికి ఉద్యోగోన్నతుల జాబితా విడుదల చేశారు. ఇందులో ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించి 18 మందికి చోటు దక్కింది. వీరంతా శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రాజమండ్రి ఆర్జేడీ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన 143 ఉత్తర్వులు ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓ పక్క రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. మరోపక్క అర్హులైన ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించడంలోనూ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

ట్రాఫిక్ సీఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్

విజయవాడ స్పోర్ట్స్: విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన 5వ పట్టణ ట్రాఫిక్ స్టేషన్ సీఐ వై.రవికుమార్, కానిస్టేబుల్ జి.రాంబాబును సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ విజయవాడ పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఏర్పాట్లను డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. బెంజిసర్కిల్, బందరురోడ్డులోని వివంత హోటల్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో వాహనచోదకులు పడిన ఇబ్బందులును డీజీపీ గమనించారు. డీజీపీ ఆదేశాలతో ఆయా ప్రాంతాల్లో విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ట్రాఫిక్ సీఐ, కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేసినట్లు సీపీ చెప్పారు.

బెజవాడ.. ప్రగతి పతాక

- 2022లో అన్ని రంగాల్లో అభివృద్ధి
- ప్రగతి నివేదిక సమర్పించిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్



మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి. చిత్రంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్, డెప్యూటీ మేయర్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థను ప్రగతి పథాన నడిపేందుకు అహర్నిశలు పాటుపడుతున్నామని మేయర్ భాగ్యలక్ష్మి తెలిపారు. 2022లో రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలను సమర్థంగా నిర్వహించామని స్పష్టం చేశారు. శుక్రవారం వీఎంసీ కౌన్సిల్‌హాల్లో 2022లో సాధించిన ప్రగతిపై కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మేయర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ రాయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో రూ.38.25 కోట్లతో 16 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 18 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు నిర్మించామన్నారు. అలాగే రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.6.4 కోట్లు వెచ్చించామన్నారు. మురుగునీటి పారుదలకు 6.2 కిలోమీటర్ల మేర రూ.6.20 కోట్లు ఖర్చు చేయటమే కాకుండా రెండు డీపీ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నేతల దృష్టికి వచ్చిన 200 సమస్యల పరిష్కారానికి రూ. 23 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. నాడు-నేడు ద్వారా రూ.13 కోట్లు వెచ్చించి 89 పాఠశాలల్లో ఆధునిక హంగులను సమకూర్చామన్నారు. నగరంలోని 16 పార్కులను రూ. 11 కోట్లతో ఆధునికీకరించామన్నారు. వీఎంసీలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య పద్ధతిలో 21 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు.

పట్టణ ప్రజల సాధికారతే లక్ష్యం..

సంక్షేమంలోనూ ఎక్కడా వెనుకడుగు వేయకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నవరత్న పథకాల ద్వారా వీఎంసీ పరిధిలో 2,05,722 మందికి రూ. 509.1 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు మేయర్ వివరించారు. రెవెన్యూ ఆదాయంలో విషయంలో కూడా గణనీయమైన వృద్ధి కనిపిస్తోందన్నారు. 2021లో ఆదాయం రూ 123.17 కోట్లు కాగా.. ఈ ఏడాదిలో రూ. 171.55కోట్లు వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ. 48. 38కోట్లు రెవెన్యూ ఆదాయం పెరిగిందని మేయర్ చెప్పారు.

పట్టణ ప్రణాళిక విభాగంలో..

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనధికారిక అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల క్రమబద్ధీకరణ ద్వారా రూ. 33.55 కోట్లు ఆర్జించామని, కన్‌స్ట్రక్షన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫైన్ల ద్వారా రూ. 2.81లక్షలు, నగరంలో ఈఏడాది భవన నిర్మాణ అనుమతులకు మొత్తం 2,250 దరఖాస్తులు నుంచి రూ.50.26 కోట్లు వచ్చాయని మేయర్ చెప్పారు. ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా 1067 దరఖాస్తులకు 653 పరిష్కరించామని వాటి ద్వారా రూ. 19.43 కోట్లు ఆదాయం వచ్చిందని మేయర్ రాయన తెలిపారు.

స్వచ్ఛతలో మరింత మెరుగ్గా..

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో 5వ ర్యాంకు సాధించామని, వాయు సర్వేక్షణ్ జాతీయ స్థాయిలో పాల్గొంటున్నామని, అర్బన్ గ్రీనరీలో నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో, ఫ్లై ఓవర్ల పిల్లర్లకు పెయింటింగ్‌లు, వర్టువల్ గార్డెన్‌లు ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌లో ఈ-వేస్ట్, ఫ్లవర్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ రెడ్డి అడిషనల్ కమిషనర్ సత్యవతి పాల్గొన్నారు.





నడిచొచ్చిన తెలుగింటి విరిబోణి

ఉత్సాహంగా సిద్ధార్థ ఫెట్-2022

మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంప్రదాయ వస్త్ర ధారణలో విద్యార్థినులు అలరించారు. విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫెట్-2022 శుక్రవారం ముగిసింది. దీనిలో భాగంగా చివరి రోజు వివిధ పోటీలు నిర్వహించారు. మిస్ ఫెట్, మిస్ సిద్ధార్థ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. ఆయా కార్యక్రమాల్లో విజేతలకు ఫార్మాస్యూటికల్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లెల కృష్ణ బహుమతులు అందజేశారు.

- లబ్బీపేట(విజయవాడ తూర్పు)

పశు ప్రాణం.. పదిలం

మూగ జీవాల వైద్యానికి కేరాఫ్‌గా విజయవాడ పశు వైద్యశాల

- సూపర్ స్పెషాలిటీ సేవలతో పశువులు, పెంపుడు జంతువులకు సంజీవని
- అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్యం
- వ్యాధి నిర్ధారణకు ల్యాబొరేటరీ, టెక్నికల్ సిబ్బంది
- శస్త్ర చికిత్సల కోసం ఆధునిక ఆపరేషన్ థియేటర్
- రోజుకు 300 వరకు ఓపీ నమోదు
- నెరవేరుతున్న మహానేత వైఎస్సార్ సంకల్పం



టామీకి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏ సంకల్పంతోనైతే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో విజయవాడ కేంద్రంగా సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల ఏర్పాటుకు అంకురార్పణ చేశారో.. అది నేడు అక్షరాల నెరవేరుతోంది. ప్రస్తుత ప్రభుత్వం పశువైద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆధునిక పరికరాలు సమకూరాయి. ఫలితంగా జీవాలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. నగరంలోని పెంపుడు జంతువులు, పశువులతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పశువులను మెరుగైన వైద్యం కోసం సంచార పశువైద్యశాల వాహనాలతో ఇక్కడకు తరలిస్తున్నారు. ముఖ్యంగా శస్త్ర చికిత్సలు అవసరమైన వాటికి ఈ ఆస్పత్రి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ పశు వైద్య శాలలో శస్త్ర చికిత్సలు 2016లో ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ 1504 మేజర్ శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు పశు వైద్యులు చెబుతున్నారు. ప్రతిరోజూ 250 నుంచి 300 వరకూ యానిమల్స్‌కు వైద్య పరీక్షలు చేస్తుండగా, వాటిలో 80 శాతం పెంపుడు జంతువులు ఉంటున్నట్లు వివరిస్తున్నారు.

98శాతం సక్సెస్ రేటుతో..

శస్త్ర చికిత్సలు అవసరమైన జంతువులను విజయవాడ నుంచే కాకుండా, పొరుగు జిల్లాల నుంచి కూడా ఇక్కడకు తరలిస్తుంటారు. ఇక్కడ అందుబాటులో ఉన్న అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. ఇప్పటి వరకూ 1504 శస్త్ర చికిత్సలు 98శాతం సక్సెస్ రేటుతో నిర్వహించారు.

రెండు షిఫ్టుల్లో సేవలు..

ప్రస్తుతం సూపర్‌స్పెషాలిటీ పశువైద్యశాలలో ఒక జాయింట్ డైరెక్టర్, నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్‌లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఐదుగురు ఉన్నారు. వీరితో పాటు మరో 40 మంది పారామెడికల్, టెక్నికల్, హెల్పింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో సేవలు అందిస్తున్నారు. దీనిని 24/7 సేవలు అందించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ప్రతిరోజూ 250 నుంచి 300 అన్ని రకాల జంతువులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

శస్త్ర చికిత్సలు ఇలా..

సంవత్సరం	చేసిన శస్త్రచికిత్సలు
2016-17	148
2017-18	150
2018-19	234
2019-20	291
2020-21	248
2021-22	213
2022 (ఏప్రిల్- డిసెంబర్)	220

వ్యాధి నిర్ధారణ పరికరాలు..

సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాలలో అత్యాధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. ఇక్కడ శస్త్ర చికిత్స అయిన పెట్స్, పశువులకు ఇన్‌ఫెక్షన్స్ సోకకుండా స్టెరిలైజేషన్ చేసిన పరికరాలే వినియోగిస్తారు. అంతేకాదు పశువులకు సోకిన వ్యాధిని గుర్తించేందుకు ల్యాబొరేటరీ అందుబాటులో ఉంది. ట్యూమర్స్‌ని సైతం నిర్ధారించే సౌకర్యాలు ఉన్నాయి. ఎక్స్‌రే మెషీన్ కూడా ఏర్పాటు చేశారు. పశువులు ఈనడంలో ఇబ్బందులు తలెత్తినప్పుడు, ఇక్కడకు తరలించి వాటికి సిజేరియన్‌లు చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం..



విజయవాడ నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా సంచార పశు వైద్యశాల వాహనాల్లో మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు తరలిస్తున్నారు. వాటికి అవసరమైన శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. అత్యాధునిక సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. వ్యాధి నిర్ధారణ ల్యాబొరేటరీ, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం రెండు షిఫ్టుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ పనిచేస్తున్నాం. 24 గంటలు పనిచేసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ జీఎస్ఆర్ ఠాగూర్, జేడీ, ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి

అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తున్నాం..



అరుదైన, క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. వాటిలో సిజేరియన్స్‌తో పాటు, క్యాన్సర్ సర్జరీలు, ట్యూమర్ సర్జరీలు, హెర్నియా సర్జరీలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 1500లకు పైగా శస్త్ర చికిత్సలకు 98శాతం సక్సెస్ రేటుతో నిర్వహించాం. శస్త్ర చికిత్స తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై వాటి పోషకులకు వివరిస్తాం.

– డాక్టర్ కె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్, ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్రాప్ అవుట్స్‌పై రెవెన్యూ, విద్యాశాఖ, సీఆర్‌పీలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి బయట పిల్లలు బడిలోనే ఉండాలని, ఇందుకు పాఠశాలల స్థాయిలోనే వారి వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. జిల్లాలో నేటి వరకు 5,975 మంది బడిబయట పిల్లలు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. వీరిలో జిల్లాలోని 15 మండలాల్లో 2,402 మందికి పైగా విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. మిగిలిన వారిని కూడా బడిలో చేర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల డ్రాప్‌అవుట్‌ల వివరాలు నమోదు చేయని జగ్గయ్యపేట, విజయవాడ రూరల్ మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే నివేదికలు అందించాలని ఆదేశించారు. 14 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉన్న 381 మంది వివరాలను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 56 మంది బడి మానేసిన విద్యార్థులు తిరిగి బడిలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. వీరిలో 43 మంది కంచికచర్లలోనే ఉన్నారని, కార్మిక, ఇతర శాఖాధికారులతో సమన్వయం చేసుకుని బడిలో చేర్పించాలన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను..

ప్రత్యేక అవసరాలు కలిగిన 22 మంది విద్యార్థులను భవిత, మేడోనా, విజయ మేరీ వంటి ప్రత్యేక అవసరాలు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అనారోగ్య కారణాలతో బడి మానేసిన 25 మంది విద్యార్థులను గుర్తించి, వారి ఆరోగ్య స్థితిని బట్టి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఈఓ సీవీ రేణుక డెప్యూటీ డీఈఓ కె. రవికుమార్‌పాల్గొన్నారు.

క్షత్రియ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. తమ ఆరాధ్య దైవం నిమిషాంబ దేవి చిత్రపటంతో నూతన సంవత్సర క్యాలెండ్‌ను రూపొందించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటగణేష్ తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం సహించం

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో మెరక, అప్రోచ్ రహదారుల పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మండల అధికారులతో శుక్రవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు లేఅవుట్లలో మెరక పనులు జాప్యం జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు ఫైనల్ కాలేదని కుంటి సాకులు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాప్యం జరిగితే ఇకపై ఎంతమాత్రం సహించేది లేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7 వేలకు పైగా గృహాలు పూర్తయ్యాయన్నారు. మచిలీపట్నం లేఅవుట్‌లో ఎక్కువగా గృహనిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. మరో రెండు వారాల్లో 8,175 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జగనన్న లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు పెండింగ్ ఉండకూడదన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల్లో కూడా ప్రగతి ఉండటం లేదన్నారు. త్వరితగతిన భవనాల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బిల్లులను పదిరోజుల్లో క్లియర్ చేయాలన్నారు. షరతులు కలిగిన పట్టాలను నిషేధిత జాబితాల నుంచి తొలగించే కార్యక్రమాన్ని వేగవంతంగా చేసినందుకు రెవెన్యూ అధికారులను కలెక్టర్ అభినందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వెంటనే అప్‌లోడ్ చేయాలని, ఆ పనులను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. వైఎస్సార్ శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం ద్వారా రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం చేయాలన్నారు. 2022లో జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేశారని, అలాగే రాబోయే సంవత్సరంలో కూడా జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని అధికారులు, సిబ్బందికి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఈరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రండి.. ప్రకృతి అందాలను ఆస్వాదించండి

భవానీ ఐలాండ్‌లో హ్యాండ్‌లూమ్ స్టాల్ ప్రారంభించిన మంత్రి రోజా



భవానీ ఐలాండ్‌లో హ్యాండ్‌ల్యూమ్ ఎగ్జిబిషన్‌లోని స్టాల్‌లో చీరలు పరిశీలిస్తున్న మంత్రి ఆర్కే రోజా, చిత్రంలో టూరిజం శాఖ ఉన్నతాధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదీ తీరాన ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన భవానీ ద్వీపానికి రండి.. ఆడుతూ పాడుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించండి... అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలోని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీ ఐలాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా భవానీ ద్వీపంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్‌ను జనవరి 17 వరకు కొనసాగిస్తామని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు భవానీ ద్వీపంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఈవెంట్స్‌కు కుటుంబ సమేతంగా వచ్చి ఆనందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోవిందరావు, డెప్యూటీ సీఈవో రాముడు, బీఐటీసీ ఈడీ బలరామిరెడ్డి, రెలిజియస్ టూరిజం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కనకదుర్గ, అసిస్టెంట్ డైరెక్టర్ లజ్వంతి నాయుడు, డీవీఎం సీహెచ్ శ్రీనివాస్, ఐలాండ్, బెరంపార్క్ మేనేజర్లు డి.సుధీర్, సత్యారావు పాల్గొన్నారు.

క్వారీలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని గ్రావెల్, రోడ్ మెటల్ క్వారీలకు తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. వినియోగంలో లేని క్వారీలకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేసి, వినియోగంలోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో గనులు, భూగర్భ, పర్యావరణం, క్వారీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గ్రావెల్, రోడ్డు మెటల్, క్వార్జ్, బ్లాక్ గ్రానైట్ ఖనిజాలకు సంబంధించి 198 లీజులు ఉన్నాయని, వీటిలో 126 క్వారీలలో మాత్రమే కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన 72 క్వారీలలో పనులు జరగడం లేదని, వీటిలో గనులు, భూగర్భ శాఖ విజయవాడ పరిధిలో 16 క్వారీలు, నందిగామ పరిధిలో 56 క్వారీలు ఉన్నాయన్నారు. ఈ క్వారీలకు అవసరమైన పర్యావరణ అనుమతులను నిబంధనల మేరకు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహించే క్వారీలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ నుపూర్ అజయ్, గనులు, భూగర్భ శాఖ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పర్యావరణశాఖ ఎస్ఈ ప్రసాదరావు ఉన్నారు.

పిల్లలకు బలమైన ఆహారాన్ని అందించండి

జేసీ డాక్టర్ అపరాజితసింగ్

కోనేరుసెంటర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు బలమైన ఆహారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్ తెలిపారు.గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె బందరు మండలం అరిశేపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా జేసీ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించారు. కేంద్రం నిర్వహణ ఏవిధంగా ఉన్నదీ ప్రత్యక్షంగా చూశారు. హాజరుపట్టికలో హాజరు శాతం పరిశీలించారు. చిన్నారులకు ఎటువంటి ఆహారం అందిస్తున్నారు, గుడ్లు ఇస్తున్నారా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఏ విధంగా ఉంటుందనే విషయంపై తల్లులతో మాట్లాడి తెలుసుకున్నారు. పిల్లల బరువులు చూస్తున్నారా, అవసరమైన ఆట వస్తువులు ఉన్నాయా, బాలామృతం ఎలా అమలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల విషయంలో అంగన్‌వాడీలు కన్న తల్లుల్లా వ్యవహరించాలన్నారు. పిల్లల ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారుచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం రైతు భరోసాకేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతున్నదీ పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. తేమ శాతం పరిశీలించే విషయంలో రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బందరు తహసీల్దార్ డి.సునీల్ బాబు, సచివాలయం, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వాసం పెరిగేలా సేవలందించాలి

ప్రభుత్వ వైద్యులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ వైద్యులపై నమ్మకం కలిగేలా వైద్య సేవలందించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వైద్యాధికారులను ఆదేశించారు. మాతాశిశు మరణాల నివారణ, హై రిస్క్ డెలివరీలపై కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా శిశు మరణాలను పూర్తి స్థాయిలో నివారించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హై రిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. నవంబరు, డిసెంబర్ మాసాలలో జిల్లాలో 1843 ప్రసవాలు జరిగాయని, ప్రసవ సమయంలో నలుగురు తల్లులు, ముగ్గురు శిశువులు మరణించారన్నారు. మరణాలకు గల కారణాలను పూర్తి స్థాయిలో అన్వేషించాలన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టిపెట్టాలి

కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్ హెచ్‌ఓ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.

వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి

- వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా ఏర్పాట్లు
- అవసరమైన వారిని ఫారిన్ సర్వీస్ కింద సర్దుబాటు
- ఆధునికీకరణ పనులు సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గంటా వరప్రసాద్



ప్రిన్సిపాల్‌తో సమావేశమైన సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్

మచిలీపట్నం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బందరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంటా వరప్రసాద్ అన్నారు. ఆసుపత్రిలో సేవలకు ఆటంకం లేకుండా వైద్యుల సర్దుబాటుపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ కుమారి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయ కుమార్‌తో శుక్రవారం తన చాంబర్ లో సమీక్షించారు. అనంతరం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ వైద్య విద్య పరిధిలోకి విలీనం అయినందున బందరు ఆస్పత్రిలో రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్వహించే ఈ ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది నియామకం శరవేగంగా జరుగుతుందన్నారు. నిపుణులైన వైద్యులు ఇప్పటికే వచ్చారని, అర్హతలను బట్టి ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో అవసరం మేరకు ఫారిన్ సర్వీసు కింద సేవలు వినియోగించుకుంటున్నామన్నారు. సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత అనేది లేదన్నారు. మెడికల్ కాలేజీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 150 సీట్లతో తరగతులు నిర్వహించాల్సి ఉన్నందున, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆసుపత్రిని త్వరలోనే కేంద్ర నిపుణుల బృందం పరిశీలించేందుకు వస్తుందని, ఈ లోగానే ఆధునికీకరణ పనులను పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో వైద్యపరంగా బందరు కేంద్రంగానే పరిశోధనలు జరిగే అవకాశం ఉందన్నారు. మెడికల్ హబ్‌గా మారి ఈ ప్రాంతం అభివృద్ధి చెందనుందన్నారు. మెడికల్ కాలేజీ అందుబాటులోకి వస్తే అత్యవసర సమయంలో రోగులను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే, బందరులోనే మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ విజయ కుమారి తెలిపారు.

11మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

- రూ. 36,500 స్వాధీనం

కంచికచర్ల: శిబిరాలు నిర్వహించి పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ హెచ్చరించారు. కంచికచర్ల ఓసీ రిక్రియేషన్ క్లబ్‌లో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న 11మందిని పట్టుకుని వారినుంచి రూ.36,500 నగదు స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. పేకాట రాయళ్లను సోమవారం నందిగామ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పర్చుతానని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

ఆటోనగర్(విజయవాడతూర్పు): మత్తు మాత్రలు మింగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటమటలోని చినవంతెన సెంటరులో జరిగింది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చినవంతెన సెంటరులో నివసిస్తున్న ఎం.శివ(47) కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. తరచూ మాత్రలను మింగుతుంది. గురువారం ఉదయం ఒకేసారి 7 షీట్ల టాబ్లెట్లను వేసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఆమెకు అమ్మ, నాన్న లేరు. వివాహం కాలేదు. మృతురాలి అన్న సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానూరు శివార్లలో మహిళ మృతదేహం



మృతి చెందిన గౌరమ్మ

పెనమలూరు: విజయవాడ గుణదలకు చెందిన మహిళ మృతదేహం కానూరు శివారులో నిర్మానుష్య ప్రాంతంలో ఉండడం శుక్రవారం నగరంలో సంచలనం కలిగించింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల ఈఎస్ఐ ప్రాంతంలో ముమ్మిడివరపు గౌరమ్మ (50) భర్త దాసుతో ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆమె మహానాడు రోడ్డులో ఒక హోటల్‌లో పనిచేస్తోంది. ఆమె స్వస్థలం మండపేట మండలం అచ్యుతాపురం. ఆమె గత పదేళ్లుగా గుణదలలో ఉంటుంది. గురువారం మధ్యాహ్నం ఆమె పనికి అని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం కానూరు శివారు పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ కాలనీ ప్లాట్‌లలో గౌరమ్మ శవమై కనిపించింది. పశువులు మేపే శ్రీనివాసమూర్తి ఆమె శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ గోవిందరాజు సిబ్బందితో ఘటనా స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. నిర్మానుష్యంగా ఉన్న ప్లాట్‌లలో దట్టమైన పొదల మధ్య గౌరమ్మ విగతజీవిగా పడి ఉంది. ఆమె మృతి చెందిన ప్రాంతంలో మద్యం సీసాలు ఉన్నాయి. ఆమె ముక్కు, నోటి నుంచి రక్తం మరకలు ఉన్నాయి. ఆమె మృతదేహానికి తుమ్మచెట్ల ముళ్లు గుచ్చుకుని ఉన్నాయి. క్లూస్ టీం రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించారు. ఆమె సెల్‌ఫోన్ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వాస్తవానికి గురువారం ఇంటి నుంచి పనికని చెప్పి వెళ్లిన గౌరమ్మ పనికి హాజరుకాలేదు. ఆమె ఎవరితో కలిసి గుణదల నుంచి కానూరు శివారుకు వచ్చిందనే విషయం తెలియాల్సి ఉంది. పోలీసులకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు. ఫోన్ డేటా వివరాలు, పీఎం నివేదిక అందితే కాని గౌరమ్మ మరణంపై మిస్టరీ వీడదు. మృతురాలి కుమార్తె మానస ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడిన నేరస్తులు అరెస్ట్

800 గ్రాముల గంజాయి, 50 వేల విలువైన వస్తువులు, నగదు స్వాధీనం



చోరీలకు పాల్పడిన నేరస్తులు, స్వాధీనం చేసుకున్న నగదు, కత్తులతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న చోరీలకు సంబంధించి ఇద్దరు నేరస్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రూ.50 వేల విలువైన వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎ.నాగమురళి చోరీలకు సంబంధించి అరెస్ట్ చేసిన నేరస్తుల వివరాలు, స్వాధీనం చేసుకున్న గంజాయి, రికవరీ చేసిన నగదు వివరాలు వెల్లడించారు. పట్టణంలో జరుగుతున్న చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు, డీసీపీ మేరీ ప్రశాంతి, నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తనతో పాటు ఎస్ఐ రామారావు, సిబ్బంది సురేష్, లక్ష్మీనారాయణ, హరికృష్ణ స్పెషల్ టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కోదాడ రోడ్‌లోని మార్కెట్ యార్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా, బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా స్థానిక తొర్రగుంటపాలెంకు చెందిన 32 ఏళ్ల మీసాల వెంకటేశ్వరరావు, విలియంపేటకు చెందిన 22 ఏళ్ల ఇరుకు సాయి(చికెన్ సాయి)లుగా గుర్తించినట్లు తెలిపారు. పట్టణంలో ఇటీవల జరిగిన చోరీలు తామే చేశామని ఒప్పుకున్నారని, తాము హైదరాబాద్ వెళ్లి 800 గ్రాముల గంజాయి, మూడు కత్తులను కొనుగోలు చేసి వస్తున్నట్లు తెలిపారు. వారిపై గంజాయి, ఏఆర్ఎంఎస్ యాక్ట్ కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల విలువైన వస్తువులు, నగదు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

పాడి గేదెల కొనుగోలుకు రుణాలు

ఎస్‌బీఐతో కృష్ణా మిల్క్ యూనియన్ ఎంఓయూ



ఎస్‌బీఐ డీజీఎం రంగరాజన్ నుంచి ఎంఓయూ పత్రాలు అందుకుంటున్న చైర్మన్ చలసాని

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాడి గేదెలను కొనుగోలు చేసేందుకు ఒక్కో రైతుకు రూ.1.60 లక్షలు రుణ సదుపాయం కల్పించేలా ఎస్‌బీఐతో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) ఒప్పందం చేసుకుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ల సమావేశం శుక్రవారం పాలప్రాజెక్టు ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎస్‌బీఐ డీజీఎం రంగరాజన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రతి గ్రామంలో 10 నుంచి 20 మంది రైతులు రుణాలు తీసుకుని నాణ్యమైన పాడి గేదెలు కొనుగోలు చేసేలా కృష్ణా మిల్క్ యూనియన్ సహకరిస్తుందన్నారు. ఒక్కో పాడి రైతుకు రూ.1.60 లక్షల మేర రుణ సదుపాయాన్ని బ్యాంక్ కల్పిస్తుందన్నారు.

పాల సేకరణ ధర రూ.50 పెంపు

పాడి రైతులకు నూతన సంవత్సర కానుకగా పాల సేకరణ ధరను రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. లీటర్‌కు 10 శాతం వెన్న గల పాలకు రూ.730 నుంచి రూ.780కు పెంచామన్నారు. ఆవుపాలకు రూ.260 నుంచి రూ.270కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ ఏడాది రైతులకు రెండు విడతలుగా రూ.35 కోట్లు బోనస్‌గా అందజేశామని, పాడి రైతుల సంక్షేమ పథకాల కింద రూ.10 కోట్లు ఖర్చు చేశామన్నారు. కృష్ణా జిల్లా వీరవల్లిలో 4 లక్షల లీటర్ల కెపాసిటీ, 6 లక్షల విస్తరణ సామర్థ్యంతో నిర్మిస్తున్న నూతన డెయిరీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు ఎర్నేని సీతాదేవి, దాసరి బాలవర్ధనరావు, వుయ్యూరు అంజిరెడ్డి, వేమూరి సాయి వెంకట రమణలతో పాటు పాలక వర్గ సభ్యులందరూ హాజరయ్యారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

కంచికచర్ల: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ మహిళ మెడలో మరో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి బంగారు చైను అపహరించిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం నందిగామ రైతుపేటకు చెందిన ఏలూరు లైలా ఆమె భర్త సుబ్బారావు కంచికచర్లలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నందిగామ వెళుతుండగా పేరకలపాడు క్రాస్ రోడ్డు దాటిన తర్వాత నేషనల్ హైవేపై గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వెంబడించి లైలా మెడలో ఉన్న 48 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఆమె కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు కంచికచర్ల పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్


సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ దేశానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అరోపించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాణిగారితోట, 17వ డివిజన్‌లోని 79వ వార్డు సచివాలయం పరిధిలో వలిఅహ్మద్ వీధి, గుడ్‌మార్నింగ్ హోటల్ రోడ్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వారికి వివరించి, సంక్షేమ లబ్ధి వివరాల బ్రోచర్‌ను అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా పేదరికమే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తమకు సంక్షేమ పథకాలు అందలేదని, జగనన్న సీఎం అయ్యాక నేరుగా తమ ఇంటికే సంక్షేమ పథకాలు చేరువవుతున్నాయని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు తన ప్రచారం పిచ్చితో చిన్న సందుల్లో మీటింగ్‌లు పెడితే జనం బాగా కనిపిస్తారని, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవచ్చని ఎనిమిది మంది మృతికి కారణమయ్యారని విమర్శించారు. దానిని కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదేమి ఖర్మ అంటూ చంద్రబాబు తిరుగుతుంటే చంద్రబాబుకు ఇదేమి ఖర్మ పట్టిందని ప్రజలు చీదరించుకుంటున్నారనానరు. టీడీపీ మీటింగ్‌లో ప్రజలు చనిపోతే మానవత దృక్పథంతో సీఎం జగన్ స్పందించి వారి కుటుంబాలకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారన్నారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల అయ్యపురెడ్డి, డి.వెంకటేశ్వరరావు, వెన్నా తిరుపతిరెడ్డి, గీతాకుమారి, కాశీ పాల్గొన్నారు.

కందుకూరి ఘటనను పక్కదారి పట్టించేందుకు యత్నం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్


మాట్లాడుతున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎనిమిది మంది టీడీపీ కార్యకర్తలు చనిపోయిన కందుకూరు ఘటనను పక్కదారి పట్టించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ పార్టీ నాయకులపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం జరిగింది. అవినాష్ మాట్లాడుతూ కందుకూరులో ఎనిమిది మంది టీడీపీ కార్యకర్తలు చనిపోవడానికి చంద్రబాబునాయుడు కారణమన్నారు. కందుకూరు ఘటనను వైఎస్ జగన్‌కు ముడిపెట్టడానికి చంద్రబాబునాయుడుకి సిగ్గుందా అని ప్రశ్నించారు. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో కూడా చంద్రబాబునాయుడు ప్రచార ఆర్భాటం కోసం పుష్కరఘాట్ గేట్లు మూసివేసి, తొక్కిసలాటకు గురిచేసి అమాయకులను బలి తీసుకున్నాడన్నారు. టీడీపీ నాయకులు బొండా ఉమా తనపైన, వైఎస్సార్ సీపీ పైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని అవినాష్ పేర్కొన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే బొండా ఉమా చేసిన భూకబ్జాలపై విచారణ జరిపిందని, చంద్రబాబునాయుడు కాళ్లు పట్టుకుని బొండా ఉమా ఆ కేసుల్లో నుంచి బయటకు వచ్చాడన్నారు. బొండా ఉమా వల్లనే నగరంలో రేవ్ పార్టీల సంస్కృతి వచ్చిందన్నారు. బైక్, కార్ రేసులు నగరంలో నిర్వహించిన సంస్కృతి బొండా ఉమా కుమారులదేనన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మంత్రి పదవి కోసం పార్టీ అధినేత చంద్రబాబునాయుడినే బ్లాక్ మెయిల్ చేసిన చరిత్ర బొండా ఉమాది అని ఆరోపించారు. ప్రజల్లో తిరుగుతూ వారి కష్టాలు తెల్సుకునే ప్రయత్నం చేస్తున్నాను కాబట్టే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి తనకు ప్రోత్సాహం ఉందని చెప్పారు. వైఎస్సార్ సీపీపైన, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన మరొకసారి బొండా ఉమా లేనిపోని విమర్శలు చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు. దేవినేని నెహ్రూ చనిపోయి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఆయనను ఇప్పటికీ టార్గెట్ చేసి విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇకపై దేవినేని నెహ్రూ పేరు ప్రస్తావిస్తూ టీడీపీ నాయకులు ఆరోపణలు చేస్తే తాను లీగల్‌గా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అంబేడ్కర్, వియ్యపు అమర్‌నాథ్, నిర్మలాకుమారి, ప్రవల్లిక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణలంక పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని హైస్కూల్ పరిసరాల్లోని కొంత ఏరియా, తిరుమలరావు వీధి కొంత ఏరియా, సబ్బరాయనగర్ కొంత ఏరియా, ఆర్చ్ రోడ్డు, రామాలయం వీధి, భ్రమరాంబపురం కొత్త ఏరియాలలో ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 2023 జనవరి 2వ తేదీ ముక్కోటిన ఆలయంలోని ప్రధాన మూలవిరాట్‌కు వజ్రకవచంతో అలంకరించడం జరుగుతుందని, ఆలయ ఆస్థాన మండపంలో ఉత్తర ముఖంగా స్వామి భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. తెల్లవారుజామున మూడు గంటలకు స్వామికి సుప్రభాత సేవ, అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అర్చకులు రామ రత్నమాచార్యులు తెలిపారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు దక్షిణావృత శంఖంతో తీర్థం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామికి నిర్వహించే నగరోత్సవ సేవలో ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడిచేసిన యువకుడిపై కేసు

గన్నవరం: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడిచేసిన యువకుడిపై గన్నవరం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురు యువకులను అర్ధరాత్రి 2 గంటల సమయంలో నైట్ బీట్‌లో ఉన్న కానిస్టేబుల్ మణిందర్‌కుమార్ నిలపాడు. అయితే కానిస్టేబుల్‌తో బైక్‌పై ఉన్న పి. రోహిత్ గొడవకు దిగాడు. ఆగ్రహానికి గురైన రోహిత్ కానిస్టేబుల్‌ను తీవ్రంగా దూషించడంతో పాటు దాడిచేసి కొట్టాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయాలు

చాట్రాయి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చీపురుగూడెంకి చెందిన మోరంపూడి అవినాష్, యర్రవారి గూడెం గ్రామానికి చెందిన బాలవెంకట దుర్గారామ్ పోలవరం–చాట్రాయి గ్రామాల మధ్య ఎదురెదురుగా తమ ద్విచక్ర వాహనాలపై వస్తూ ఢీ కొన్నారు. ఈ ఘటనలో అవినాష్ తలకి తీవ్ర గాయాలు కాగా, దుర్గారామ్‌కి కుడి కాలు విరిగింది. వీరిద్దరిని చాట్రాయి 108 వాహనంలో చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విస్సన్నపేట: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న నడ్డి సోమయ్యకు తీవ్రగాయాలైన ఘటన పుట్రేల రోడ్డులో చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో సోమయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని 108 సిబ్బంది మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించారు.

శునకాలు, వానరాలతో బెంబేలు


వీధిలో తిరుగుతున్న శునకాలు



ఇళ్ల ముందు ఉన్న వానరాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 14వ డివిజన్‌లో శునకాలు, వానరాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత నెల నుంచి ఈ ప్రాంతంలో కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. అంతే కాకుండా ఇళ్లల్లోకి జొరబడుతున్నాయి. దీంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత కార్పొరేషన్ అధికారులకు ఇక్కడి ప్రజలు విన్నవించారు. వీటి దాటికి పిల్లలు, మహిళలు రోడ్డు మీద వెళ్లాలంటే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలు, చెట్లు ఎక్కువగా ఉండటంతో రాత్రి సమయాల్లో చెట్ల మీద ఉంటున్నాయి. ఇకపోతే శునకాలతో కూడా నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటి భారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

లోపాల్లేకుండా పథకాలు అమలు చేయాలి


వణుకూరులో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమల్లో లోపాలు లేకుండా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ విజయ్‌కుమార్ అన్నారు. వణుకూరులో శుక్రవారం జరిగిన గ్రామదర్శిని కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రతి ఒక్కరికీ పథకాలు అమలు చేయాలని సూచించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మించుకునేలా ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పూర్తి సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద నాణ్యతను చూశారు. మెనూ ప్రకారం జగనన్న గోరు ముద్ద అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించాలని ఆయన రికార్డులు తనిఖీ చేశారు. రైతుభరోసా కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎండీపీవో సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్వామి వివేకానంద నేటి యువతరానికి ఆదర్శ ప్రాయమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్ అన్నారు. వివేకానంద స్వామి జయంతిని పురస్కరించుకుని ఆయన జీవిత ఆశయాలపై విశాఖపట్నం యోగా భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రాంతి హైస్కూల్లో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ వెనిగళ్ల అమ్మాజీతో కలసి పోటీల పోస్టర్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. వివేకానంద పిన్న వయస్సులో భారతదేశ సంస్కృతి సాంప్రదాయలు ప్రపంచానికి చాటి చేప్పేందుకు కృషి చేశారన్నారు. 110 మంది వివేకానందస్వామి జీవిత చరిత్ర, ఆయన ఆశయాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు.

పద్యనాటకరంగ ధ్రువతార గుమ్మడి జైరాజ్


జైరాజ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాపీఠం నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: పద్యనాటకరంగ ధ్రువ తార గుమ్మడి జయరాజ్ అని జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి గోళ్ల నారాయణ రావు పేర్కొన్నారు. గుమ్మడి జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జైరాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు, గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి దిశానిర్దేశం చేసిన కళాకారులు జైరాజ్‌గా అభివర్ణించారు. ఆయన ప్రతిభను గుర్తించిన కళాసంస్థలు పలు సందర్భాలలో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. జైరాజ్ విగ్రహానికి పూలమాలల వేసి, నివాళులర్పించారు. గుమ్మడి జైరాజ్ కళాపీఠం అధ్యక్షుడు విజయకుమార్ జైరాజ్ నాటకరంగ సేవలను వివరించారు. కళాపీఠం నిర్వాహకులు జీవన్‌కుమార్, అన్వేష్, డాక్టర్ గుమ్మడి జైదీప్, రంగస్థల ప్రముకుడు బొబ్బిళ్లపాటి సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

166 మందికి ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ నిర్మలాకుమారి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక టీఎంఆర్ అండ్ సీఎంసీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 166 మంది విద్యార్థులకు రెండో డివిజన్ కార్పొరేటర్ నిర్మలా కుమారి శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు నాడు–నేడులో భాగంగా నిధులు వెచ్చిస్తున్నారని నిర్మలాకుమారి పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ఎంప్లాయీస్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ క్యాలెండర్‌ను శుక్రవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు గుంజా అజయ్, ఉపాధ్యక్షులు గుర్రం ఆంజనేయులు, కార్యదర్శి టి. బ్రహ్మారెడ్డి, డైరెక్టర్ ప్రభావతితో కలిసి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సొసైటీ నిర్వహించే కార్యకలాపాలను వివరించారు. అనంతరం సీఈ ఎం.ప్రభాకర్ రావు, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతిని కలిసి క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సహాయ కార్యదర్శి ఎస్.మస్తానరావు, డైరెక్టర్లు బి.రాజేష్, టి.శివశంకర్, భూపతి గోవిందరావు, జి.ప్రభాకర రెడ్డి, టి.నాగరాజు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ 7.62 లక్షలు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మకు భక్తులు హుండీల ద్వారా కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ.7,62,315 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను శుక్రవారం దేవదాయశాఖాధికారి ఎస్. భవానీ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ 3 నెలల 3 రోజులకు గానూ ఆలయంలోని హుండీలను లెక్కించగా పై ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు నూకల పుల్లయ్య, దొండపాటి అచ్యుతరావు, మంగిసెట్టి చైతన్య, చాగంటిపాటి పద్మావతి, మెండె వరలక్ష్మి, సాయి సేవ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక బస్సు సర్వీసులు

నూజివీడు: నూజివీడు నుంచి ద్వారకాతిరుమల (చిన్నతిరుపతి)కి వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 31న ఉదయం 7.30 నుంచి, 8గంటలకు రెండు స్పెషల్ బస్సులు నడుపుతున్నామన్నారు. ఒకటో తేదీన ఉదయం 7.30 నుంచి 8.30గంటల లోపు ఐదు స్పెషల్ బస్సులను, 2న ఉదయం 7.30 నుంచి 9.30గంటల లోపు ఐదు స్పెషల్ బస్సులను నడుపుతున్నామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

మన్యదర్శిని స్పెషల్ సర్వీసు ఏర్పాటు

ప్రయాణికుల సౌకార్యార్థం శీతాకాలంలో నూజివీడు నుంచి మన్యదర్శిని పేరుతో ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 5 గంటల నుంచి స్పెషల్ సర్వీసును ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.వెయ్యి టికెట్‌తో కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి దిగువ ఆలయం, బాపనమ్మ దేవాలయం, రంపచోడవరం, మారేడుమిల్లి హిల్ వ్యూపాయింట్, జలతరంగిణి వాటర్‌ఫాల్స్ తదితర ప్రదేశాలను సందర్శించవచ్చని తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం రాత్రి 10 గంటలకు స్పెషల్ సర్వీసు ద్వారా భద్రాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చన్నారు. దీనికి టికెట్ రూ.1,300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన తోకల నాగేంద్రం కూలీ పనులు చేస్తాడు. అతను పెనమలూరులో కూలీ పనులకు వచ్చి పనులు ముగించుకుని సోమవారం రాత్రి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. కానూరు సిరీస్ కంపెనీ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం అతడ్ని ఢీ కొట్టింది. ఘటనలో నాగేంద్రం గాయపడడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సుషుమ్న క్రియా యోగ పురాతనమైనది

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం సుషుమ్న క్రియా యోగ సాధన చేయాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు పేర్కొన్నారు. ఇది అత్యంత పురాతనమైనదని, పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మ ఎంతో సాధన చేసి, అద్భుతాలు సాధించారని ఆయన పేర్కొన్నారు. 2023 జనవరి ఒకటో తేదీ సాయంత్రం బందరు రోడ్డులోని ఏ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్న సుషుమ్న క్రియా యోగ ధ్యాన శిక్షణ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రక్రియపై మాతా ఆత్మానందమయి ఎన్నో ఏళ్లు పరిశోధన చేశారన్నారు. మాతా ఆనందమయి చెప్పిన అంశాలపై డాక్టర్లు సైతం సైంటిఫిక్ రీసెర్చ్ చేశారన్నారు. ఎన్నో అద్భుత ఫలితాలు వచ్చాయన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక ప్రాంతాల్లో ఈ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. తొలిసారిగా విజయవాడలోనూ ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రక్రియలో ఆసనాలు, మానవాళి కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సుషుమ్న క్రియా యోగ ఎంత పురాతనమైనదో అంతే అధునాతనమైనదని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో ఆసనాలు, సాధన చేయాల్సిన అవసరం లేదన్నారు. మానసిక ఒత్తిడిని జయించడం ఎలా? గర్భిణులు సుఖప్రసవం పొందడం ఎలా? మానసిక ఎదుగుదల లేని పిల్లల్ని ఏవిధంగా తీర్చిదిద్దాలి ? తదితర అంశాలపై ఈ ప్రక్రియలో శిక్షణ ఇస్తారన్నారు. అన్ని వయసుల వారు, అన్ని ఉద్యోగాల వారు ఈ ప్రక్రియను సులువుగా ఇంటి వద్దనే సాధన చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ నూతన సంవత్సర కానుకగా సుషుమ్న క్రియా యోగ ధ్యాన శిక్షణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ సభ్యురాలు రుద్రరాజు శిరీష దేవి మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు భాస్కరరావు, అనిల్ కుమార్, శృతకీర్తి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ రూపొందించడం అభినందనీయం

కలెక్టర్ ఢిల్లీరావు


స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఉపయోగపడే విధంగా స్టడీ మెటీరియల్ రూపొందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే మెంటల్ ఎబిలిటీ టెస్ట్ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 10 వేల పుస్తకాలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్సీ లక్ష్మణరావును అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు మాత్రమే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష ఉత్తీర్ణులైతే సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు విద్యార్థులకు స్కాలర్ షిప్ అందుతుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో పి.మురళీకృష్ణ, జ్యోత్స్న, వాణి, మనోహర్, కె. శ్రీనివాసరావు, రత్నకుమల్ పాల్గొన్నారు.

నలందలో న్యూ ఇయర్ కార్నివాల్


న్యూ ఇయర్ కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో శుక్రవారం న్యూ ఇయర్ కార్నివాల్ ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఒకరోజు ముందుగానే 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉత్సాహంగా విద్యార్థుల హర్షధ్వానాల మధ్య కార్నివాల్ ప్రారంభమైంది. అందులో భాగంగా మ్యాజిక్ షో, సెల్ఫీ స్టాల్, గన్ షూటింగ్, రింగ్ గేమ్, కంప్యూటర్ గేమ్ వంటి పల రకాల ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. తొలుత కార్నివాల్‌ను నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ ప్రారంభించారు. నూతన సంవత్సరం అందరికీ శుభదాయకం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులతో కలిసి డీజేలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.


ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదు


విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న హరీష్

పటమట(విజయవాడతూర్పు): ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభ గల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే హ్యాపీ ఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్థాపించినట్లు ఆ సంస్థ సభ్యులు గుడిసేవా హరీష్ తెలిపారు. మంగళగిరికి చెందిన షేక్ షఫ్రీన్ తండ్రి కొన్ని ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో అప్పటి నుంచి కుటుంబ భారం తల్లిపై పడింది. ఈ క్రమంలో గత ఏడాది షఫ్రీన్ కళాశాలలో చేరేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంది. విషయం తెలుసుకున్న హ్యాపి ఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు షఫ్రీన్‌ను కలిసి ఇంటర్ రెండేళ్ల ఫీజు తాము చెల్లిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా గత ఏడాది ఇంటర్ మొదటి ఏడాది ఫీజు రూ.30 వేలు అందజేశారు. రెండో ఏడాది కళాశాల ఫీజు నిమిత్తం శుక్రవారం పటమటలోని హ్యాపీ ఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో సంస్థ సభ్యులు గుడిసేవా హరీష్, ప్రసాదులు షఫ్రీన్‌కు రూ.34 వేలను అందజేశారు.

లయోలా కళాశాలలో అడ్వాన్స్‌డ్ ఎంప్లాయిబులిటీ కోర్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దృష్టి లోపం ఉన్న వారికి అడ్వాన్స్‌డ్ ఎంప్లాయిబిలిటీ కోర్స్ ఫర్ ద విజువల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ కోర్సును పూర్తి చేయడం వల్ల కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఎనేబుల్ ఇండియా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొర్రెపాటి మోజేస్ చౌదరి పేర్కొన్నారు. లయోలా కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో అడ్వాన్స్‌డ్ ఎంప్లాయిబిలిటీ కోర్స్ ఫర్ ద విజువల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ కోసం ఉపాధి కోర్సును కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోజేస్ చౌదరి మాట్లాడుతూ చూపు తక్కువగా ఉన్న వారు ఈ కోర్సు చేయడానికి అర్హులని తెలిపారు. ఈ కోర్సు కాల వ్యవధి ఐదు నెలలు ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో కొంచెం కఠినంగా ఉన్నా పూర్తి చేసిన తర్వాత చాలా ఉపాధి పొంది చాలా సంతోషంగా ఉంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ఎనేబుల్ ఇండియా సంస్థతో తమ కళాశాల ఒప్పందం చేసుకుందన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి ఈ కోర్సులో శిక్షణను ఉచితంగా ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న వారు కళాశాలలో సంప్రదించాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ సగయరాజ్, డాక్టర్ సహాయ భాస్కరన్‌తో పాటుగా ఎనేబుల్ ఇండియా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మూస నిర్ణయాలు వద్దు పాత నిర్లక్ష్యాలూ వద్దు

'జిమ్‌లో చేరాలి'
'టైమ్‌కి భోజనం చేయాలి'
'వాకింగ్ మొదలెట్టాలి'
'స్మోకింగ్ మానేయాలి'...
ఇలా కొత్త సంవత్సరం నిర్ణయాలు తీసుకోవడం,
మర్చిపోవడం, జోక్‌గా మార్చడం ఇకపై వద్దు.
కొత్తగా ఆలోచించండి.
'నాలో నుంచి ద్వేషం తీసేస్తాను'
'ఇక పై సహనాన్ని సాధన చేస్తాను'
'జ్ఞానాన్ని పెంచుకుంటాను'
'డిజిటల్ సమయాన్ని తగ్గించుకుని
కుటుంబానికి కేటాయిస్తాను'
ఎంత బాగున్నాయి ఇలాంటి నిర్ణయాలు.
రాబోయే కాలం వ్యక్తిగతంగా, కుటుంబపరంగా,
సామాజికంగా మీకెన్నో సవాళ్లు విసరొచ్చు.
వాటి కోసం సిద్ధం కండి.
చెదరని సంకల్పాలు ఈ సంవత్సరం తీసుకోండి.

'ఈ పని చేసి తీరాలి', 'ఇది జరిగి తీరాలి' అని హెచ్చరించుకోకపోతే మనిషి ఏ పనీ చేయడు. తనకు తాను గట్టిగా చెప్పుకోవడం కూడా అవసరమే. 'నిర్ణయం' (డెసిషన్) తీసుకుంటే దానిని మార్చుకునే అవకాశం ఉంది. కాని సంకల్పం (విల్) తీసుకోవాలి. ఒక పని సంకల్పించాక దానిని ఇక మార్చకూడదు. పూర్వం దీక్షా కంకణాలు కట్టేవారు పెద్దలు. ఒక పని అనుకున్నాక పూర్తయ్యే వరకు ఆ పనిని గుర్తు చేస్తూ కట్టే కంకణం అన్న మాట. పని పూర్తయ్యాకే కంకణం విప్పాలి. ఇప్పుడు 365 రోజుల పాటు విప్పడానికి వీల్లేని మనో కంకణం కట్టుకోవాలి కొత్త సంవత్సర సంకల్పంగా. ఎందుకు? ఎప్పటికప్పుడు జీవితాన్ని మెరుగు పర్చుకోవడానికి. సరి చేసుకోవడానికి. క్వాలిటీ ఆఫ్ లైఫ్ గడపడానికి. అర్థవంతంగా గడపడానికి. జీవితం జోక్ కాదు. తేలిగ్గా తీసుకునేది అంతకన్నా కాదు. చిన్న రాయి దెబ్బకు కూడా కకావికలం కావచ్చు జీవితం. అందువల్ల అప్రమత్తంగా ఉండటానికి కూడా కొత్త సంవత్సర సంకల్పాలు తీసుకోవాలి. 2023లో వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజికంగా ఎటువంటి మెరుగుదలకు సంకల్పాలు తీసుకోవచ్చో చూద్దాం.

వ్యక్తిగతంగా...

1 **భౌతికంగా ఎలా ఉన్నారు?:** లావు, సన్నం తర్వాత. ముందు మీరు చురుగ్గా ఉన్నారా లేదా చూసుకోండి. ఆరోగ్యకరమైన శరీరం సగం సంతోషాన్ని, దేనినైనా ఎదుర్కొనవచ్చనే ధైర్యాన్ని ఇస్తుంది. మీకు మీరు దిలాసా ఇచ్చుకోవడానికి శరీరాన్ని చురుగ్గా ఉంచండి. వ్యాయామం, హెల్త్ చెకప్ అవసరం. సొంత వైద్యం మానాలి. అదే తగ్గిపోతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు. శరీరమే ఆయుష్షు. మీ చర్యలతో మీకు మీరే ఆయుష్షు పోసుకోండి.

2 **మానసికంగా:** మానసిక ఉద్వేగాలు శరీరంపై ప్రభావం చూపుతాయి. కొన్ని లక్షణాలు జన్మతః, కొన్ని లక్షణాలు స్వభావరీత్యా ఏర్పడతాయి. వాటిలో పనికిమాలినవి వదిలేయండి. ఉదాహరణకు: ఈ సంవత్సరం అసూయ పడను అనుకుంటే చాలా మంది బంధువులు, స్నేహితులు, కలీగ్స్ మీకు ఆత్మీయులు అయిపోతారు. అసూయతోనే వారికి మీరు దూరం అవుతారు. అసూయ లేకపోతే ఇంత బలగం వస్తుంది. ద్వేషం, అత్యాశ, త్వరగా అందలం ఎక్కేయాలన్న కుతి... ఇవి వదులుకోవడం చాలా అవసరమైన సంకల్పాలు. 'నా ప్రయాణం ఆరాంగా చేస్తాను. అంచెలంచెలుగా ముందుకు సాగుతాను. నా రేంజ్‌లో ఎంత పొందవచ్చో అంతా పొందుతాను. మిగిలినవారిని చూసి పోల్చుకోను' అనుకోవడం మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరం.

3 **ఉద్యోగపరంగా:** వృత్తి నైపుణ్యం పెంచుకుంటాను అని సంకల్పించాలి. ఉన్న చోట ఉండిపోవడం తెలిసినదానితో ఆగిపోవడం సరి కాదు. పనిలో నైపుణ్యం పెరిగే కొద్దీ అందుకు అవసరమైన పరిజ్ఞానం పెంచుకునే కొద్దీ మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. 'ఈ ఉద్యోగం పోతే ఎలా' అనే భయం పోతుంది. 'ఎక్కడైనా బతకొచ్చు' అనే ధైర్యం వస్తుంది. పని నేర్చుకోండి. మీ పనికి విలువ ఇచ్చే చోటుకు మారిపోండి.

కుటుంబపరంగా...

1 **మొదట కుటుంబం:** కుటుంబం మొదటి ప్రాధాన్యం అనుకోవాలి. భార్య లేదా భర్త ఉద్యోగాలు చేస్తున్నా వేరే అభిరుచుల్లో ఉన్నా పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నా కుటుంబమే మొదటి ప్రాధాన్యం. 'రోజూ రాత్రి భోజనం కలిసి చేయాలి' నిర్ణయాన్ని తప్పనిసరిగా అమలు చేస్తే ఇల్లు దాదాపుగా ఒక దారికి వచ్చినట్టు. 'చెప్తాను... వింటాను' అనేది కూడా చాలా పెద్ద సంకల్పం. భార్యకు/భర్తకు చెప్పాలనుకున్నది చెప్పకపోవడం, వారు చెప్పేది వినకపోవడం కుటుంబాల్లో అగాధాలకు కారణం. పిల్లల విషయంలో 'అడుగుతాను/వింటాను' అనే సంకల్పం. పిల్లలు ఏం చేస్తున్నారు... వారి రొటీన్... స్నేహితులు... ఇవి అడగడం 365 రోజులూ చేయాల్సిందే. వారి మనసులో ఏముందో మాటల్లో పెట్టి వినాల్సిందే. 'ఫోన్ టైమ్ తగ్గించుకుంటాను' అని సంకల్పించుకుంటే, సోషల్ మీడియా టైమ్ కట్ చేసుకుంటే రాబోయే సంవత్సరం మీకెన్నో కౌటుంబిక ఆనందాలు ఇస్తుంది.

2 **ఆర్థిక నిర్లక్ష్యం వద్దు:** ఇతర నిర్లక్ష్యాల కంటే ఆర్థిక నిర్లక్ష్యం మూలాల మీద కొడుతుంది. అప్పులను దూరం చేస్తుంది. చేతులు నులుముకునేలా చేస్తుంది. 'ఆర్థిక విషయాల్లో మరింత జాగ్రత్తగా ఉంటాను' అనేది ముఖ్య సంకల్పం. కుటుంబం మొత్తం కలిసి 'అనవసరమైనవి కొనం/ అనవసర ఖర్చులు చేయం/వేస్ట్‌ను నివారిస్తాం' అనుకుంటే చాలా మంచి జరుగుతుంది. లైట్లు, గీజర్లు, స్టౌ, టీవీ, కంప్యూటర్ సమయానికి అందరూ ఆపినా చాలా పెద్ద విషయమే. 'రాబోయే అవసరాలకు ఇప్పుడు ఎంత ఉంది' అని చూసుకుంటే జాగ్రత్త అదే వస్తుంది.

3 **చైతన్యంగా ఉంటాం:** కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా బాగున్నా చైతన్యం లేకుండా అజ్ఞానంతో ఉంటే ఎలా? పేపర్ తెప్పించండి. కుటుంబంలో ప్రతి ఒక్కరూ నెలకు ఒక పుస్తకమైనా చదవాలి అని సంకల్పించుకోవడం ఇంటికి వెలుతురు తీసుకురావడం.

సామాజికంగా...

మంచి పౌరుడిగా మారండి: రోడ్డు మీద ఉమ్మను... ట్రాఫిక్ నియమాలు పాటిస్తాను.. అని అనుకోవడం కూడా చాలా పెద్ద విషయమే. ఒకటి సంస్కారం.. రెండోది ప్రాణానికి భద్రత. సమాజంలో ఒకరికి హాని చేసే ద్వేషాన్ని ప్రచారం చేయకుండా, ఒకరికి నష్టం చేసే అబద్ధంలో భాగంగా కాకుండా, 'తెలిసీ కావాలనీ తప్పని తెలిసినా' అలాంటి పనులు చేసి సామాజిక కలనేతకు నష్టం కలిగించకుండా ఉంటాను అనుకోవడం అత్యంత ముఖ్యమైన సంకల్పం.


ఇక దీక్ష బూనడం మీ వంతు.

ముగ్గు ముచ్చట

20 చుక్కలు: 2 వరుసలు 2 వచ్చేవరకు: సరిచుక్క



19 చుక్కలు 3 వరుసలు 3 వచ్చేవరకు





ఎం.చాముండేశ్వరి
జహీరాబాద్,
సంగారెడ్డి జిల్లా

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
★ అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.



బి.శకుంతల,
104 ఏరియా,
ఇండస్ట్రియల్ ఎస్టేట్, విశాఖపట్నం

బ్యూటిప్స్



- ఒక కప్పులో రెండు కోడి గుడ్లలోని పచ్చసొన తీసుకోవాలి. ఇందులో అర టీ స్పూన్ తేనె, మూడు చుక్కల బాదం నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికిపట్టించి 20 నిమిషాల పాటు ఉంచి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- ఒక కప్పు పెరుగులో టేబుల్ స్పూన్ నిమ్మరసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తరువాత చన్నీటితో కడిగేయాలి.
- రెండు క్యారట్ల తురుము, కోడిగుడ్డులోని తెల్లసొన, అర కప్పు పాలు. ఈ మూడింటినీ ఒక బౌల్‌లో వేసి బాగా కలపాలి. కలుపుకున్న ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, 20 నిమిషాల తరువాత కడిగేయాలి.

తగినన్ని నీళ్లు తాగుతున్నారా?



వేసవిలో చాలా దాహం వేస్తుంది. కానీ శీతాకాలంలో వాతావరణం చల్లగా ఉంటుంది. అందువల్ల అంతగా దాహం వేయక చాలామంది నీరు తగినంత తీసుకోరు. దీనివల్ల చాలా నష్టాలున్నాయి. అవేమిటో తెలుసుకుందాం.

చలికాలం శరీరం లోపలి వాతావరణం వేడిగా ఉంటుంది. దీని కారణంగా నీటి కొరత ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు ఈ వాతావరణంలో కిడ్నీలు ఎక్కువ మూత్రాన్ని వడబోస్తాయి. అందుకే చెమట పట్టకపోయినా తగినంత నీరు తాగడం మర్చిపోవద్దు.

డీహైడ్రేషన్ ప్రమాదం: శరీరానికి కావల్సినంత నీరు అందకపోవడాన్ని డీహైడ్రేషన్ అంటారు. చాలా అధ్యయనాల ప్రకారం తక్కువ నీరు తాగే వ్యక్తులు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, మూత్రపిండాల్లో రాళ్లు, యూరిన్ ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంది. డీ హైడ్రేషన్ వల్ల వాపులు, ధమనులు గట్టిపడటం, రక్తపోటు, గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదం ఉంటుంది. రోజువారి నీటి అవసరం అనేది పర్యావరణం, ఉష్ణోగ్రత వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మీరు క్రీడాకారులు అయితే ప్రతిరోజూ నాలుగు గంటల పాటు వర్కవుట్ చేస్తే ఎక్కువ నీరు అవసరం. ఫెడరల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ ప్రకారం మహిళలు ప్రతిరోజూ 2.7 లీటర్ల నీరు తాగాలి. పురుషులు ప్రతిరోజూ 3.7 లీటర్ల నీరు తాగాలి. చలికాలంలో చల్లటి నీరు మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కానీ బాగా చల్లగా ఉంటే గోరువెచ్చని నీరు తాగండి. ఇది హైడ్రేటెడ్‌గా ఉండటానికి కేలరీల వినియోగాన్ని తగ్గించడానికి పనిచేస్తుంది.

లైఫ్ @360

రేపటినుంచి కొత్త సంవత్సరంలో కాలు పెట్టనున్నాం.
ఈ సందర్భంగా చాలామంది కొత్త తీర్మానాలు తీసుకుంటూ ఉంటారు.
అందులో ఆరోగ్యంగా... ఆనందంగా ఉండాలనుకోవడం కూడా ఒకటి అయితే
ఈ సూచనలు మీకోసమే.

విష్ యూ ఎ హెల్దీ న్యూ ఇయర్



ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరం సందర్భంగా ఒక తీర్మానం తీసుకుంటారు. ఈ ఏడాది ఖచ్చితంగా ఇది పాటించాలి అని పెట్టుకుంటారు. అది బరువు తగ్గడం కావచ్చు లేదా ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండటం కావచ్చు... జంక్‌ఫుడ్ కి దూరంగా ఉండటం కావచ్చు.. ఇలా రకరకాల తీర్మానాలు తీసుకుంటారు. కానీ వాటిని పాటించే వాళ్ళు చాలా తక్కువ మంది. కొంతమంది కొన్ని నెలలపాటు కష్టం మీద పాటిస్తే.. మరికొంతమంది మాత్రం కేవలం వారం రోజుల్లోనే గుడ్ బై చెప్పేస్తారు.

మంచి కోసం మనం తీసుకునే తీర్మానాలు నెరవేరకపోవడానికి ముఖ్యమైన రెండు కారణాలు. అవేంటంటే..

- ఇంతకాలంగా ఉన్న మన అలవాట్లు రాత్రికి రాత్రే మార్చుకోవడం చాలా కష్టం అనే భావన
- పెట్టుకున్న టార్గెట్లు కాస్త కఠినంగా అనిపించడం... వీటివల్ల వీటిని సాధించలేక వెంటనే పాత అలవాట్లనే కొనసాగించేస్తారు. తిరిగి ఎప్పటిలాగా సాధారణ జీవనశైలికి వచ్చేస్తారు. అంతేకానీ, అందులో నుంచి బయటకి రావాలని గట్టిగా ప్రయత్నించరు. అంత్యనిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలన్నట్లు కొన్ని తేలికైన తీర్మానాలు తీసుకున్నారంటే అవి ఏడాది మాత్రమే కాదు, మిమ్మల్ని జీవితాంతం ఆరోగ్యంగా ఉంచుతాయి. రాబోయే కొత్త సంవత్సరం మీకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాగే ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

ప్రకృతిలో గడపడం

రోజు కనీసం పదినిమిషాల పాటు పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపటం వల్ల సూర్యకాంతి శరీరానికి తగులుతుంది. విటమిన్ డి ని పొందటంలో సహాయపడుతుంది. ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. అలాగే రాత్రిళ్లు మంచి నిద్రపోవడానికి సహాయపడుతుంది.

వ్యాయామం

కొత్త సంవత్సరంలో వ్యాయామం చెయ్యాలని నిర్ణయించుకున్నారంటే అది చాలా గొప్ప ఆలోచన. అలాగని కఠినమైన వ్యాయామాలు కాకుండా మీకు ఇష్టమైన, మీరు చేయగలిగే తేలికపాటి వ్యాయామాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. అలా చేస్తే దాన్ని మధ్యలో ఆపకుండా కొనసాగిస్తూ అదొక అలవాటుగా మార్చుకునే వీలు ఉంటుంది.

మీ కోసం మీరు

ఎదుటివారి గురించే కాకుండా మీ గురించి మీరు ఆలోచించుకోండి. మీకు సంతోషం కలిగించే విషయాలు గుర్తు చేసుకుంటూ జీవితాన్ని ఆనందంగా గడపాలి. మీకు సంతోషం కలిగించే పనులు చేసుకునేందుకు సమయం కేటాయించుకోవాలి. ఇష్టమైన వారితో ఇష్టమైన పనులు చేసుకుంటూ ఆహ్లాదంగా సమయం గడిపితే ఏడాది పొడవునా జోరుగా... హుషారుగా ఉంటారు.

సమతులాహారం తీసుకోవడం

అన్ని పోషకాలతోకూడిన ఆరోగ్యకరమైన సమతుల ఆహారం తీసుకోవాలి. నచ్చిన పదార్థాలని తింటూనే మితంగా తీసుకోవాలి. హైడ్రేట్ గా ఉండటం చాలా అవసరం.

సన్నిహితులతో కలిసి ఉండటం

బయటకి వెళ్ళినా, వ్యాయామం చెయ్యడానికి వెళ్ళినా మీ పక్కన మీకు ఇష్టమైన వాళ్ళు ఉంటే ఆటోమేటిక్ గా మనసు ప్రశాంతంగా ఉంటుంది. మానసిక, శారీరక ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఒంటరిగా ఉండకుండా మీకు ఇష్టమైన వారితో మనసులోని భావాలు పంచుకోవడం వల్ల మనసు తేలికపడుతుంది.

ఒత్తిడిని దూరం పెట్టాలి

అన్నింటికంటే ముఖ్యమైనది ఒత్తిడిని దూరంగా ఉంచడం. స్క్రీన్ సమయాన్ని తగ్గించి కుటుంబంతో సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. ఇది ఒత్తిడిని దూరం చేస్తుంది. కుటుంబం లేదా స్నేహితులతో కలిసి సరదాగా బయటకి వెళ్ళడం ఒత్తిడిని అధిగమించేందుకు మంచి మార్గం.యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలి. ఆఫీసుకి కొన్ని రోజులు సెలవులు పెట్టి వెకేషన్ ట్రిప్స్ ప్లాన్ చేసుకుంటే చాలా బాగుంటుంది.

వైద్యపరీక్షలు

క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. రక్తపోటు, షుగర్, చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకునే ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం వ్యాధులని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే కంటినిండా నిద్ర పోవాలి. రోజు 8 గంటల నిద్ర అవసరం.షెడ్యూల్ ప్రకారం నిద్రపోవడం, మేల్కొవడం అలవాటు చేసుకోవాలి. కొత్త సంవత్సరం ఆరోగ్యంగానే కాదు, ఆనందంగా కూడా ఉండవచ్చు.

● మీకు తెలుసా?

దగ్గుకు ఉపశమనం కోసం...

అసలే చలికాలం... ఆపై కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంచుమించు ప్రతి ఇంటిలోనూ ఎవరో ఒకరికి జలుబు, దగ్గు. ఈ బాధలు తగ్గాలంటే.. నీటిలో కొద్ది పరిమాణంలో వాము, తులసి ఆకులు వేసి మరిగించాలి. ఆ ఆవిరి పట్టుకుంటే చాలామంచిది. చిన్న పిల్లల విషయంలో ఇది మరింత మంచి ఫలితాన్నిస్తుంది.



- పసుపు యాంటీబయోటిక్‌గా పనిచేస్తుంది. వైరల్ ఇన్ఫెక్షన్లపైనా ఇది సమర్థంగా పనిచేస్తుంది. వేడి పాలలో కొంచెం పసుపు వేసి జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి తాగిస్తే ఎంతో రిలీఫ్‌గా ఫీలవుతారు.
- జలుబు చేసినప్పుడు గొంతునొప్పి నుంచి ఉపశమనం పొందాలంటే.. గ్లాసు వేడి నీటిలో టీస్పూను ఉప్పు వేసి బాగా కరిగిన తర్వాత పుక్కిట పట్టాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే సరి.
- వేడి నీటిలో యూకలిప్టస్ ఆయిల్ కలిపి 10–15 నిమిషాల పాటు ఆవిరి పడితే ఉపశమనం కలుగుతుంది. శ్వాస సాఫీగా సాగేందుకు ఇది ఎంతో సహాయకారిగా పనిచేస్తుంది.
- రోజులో రెండు మూడుసార్లు తేనెను వారితో కొద్దికొద్దిగా నాకిస్తే వ్యాధి నిరోధక శక్తి మెరుగవుతుంది. ఐదేళ్ళ వయసు పైబడిన పిల్లలకు తేనెలో దాల్చిన చెక్క పొడి కలిపి తినిపిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.
- జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు పిల్లల ఛాతీపై ఆవనూనెకు వెల్లుల్లి కలిపి మసాజ్ చేయాలి. చిన్నారి ఛాతీపైనా, మెడ, వీపు భాగాల్లోనూ సున్నితంగా మర్దన చేయాలి.
- శరీరానికి మంచినీరు ఎంతో అవసరం. పిల్లలు జలుబుతో బాధపడుతున్నప్పుడు వారికి ఎక్కువ సార్లు మంచినీరు తాగించాలి. అప్పుడు శరీరం వ్యాధితో సమర్థంగా పోరాడగలదు. కోల్పోయిన నీటి శాతం వెంటనే భర్తీ అవుతుంది.

● మీకు తెలుసా?

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. ప్రతి రోజు కొద్దీ సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు సమయం ఉంటే అప్పుడు, ఏ ప్రదేశంలో అయినా సులువుగా పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ ప్రతిరోజు కొంత సేపు కంటి వ్యాయామాలు చెయ్యడం మంచిది. అదేవిధంగా ఆకు కూరల్లో పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటి చూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. మనందరికి మునగ కాయ తెలుసు. వాటి ఆకులు కంటి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడతాయి. మునగ ఆకులలో విటమిన్ – ఎ, కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటి ఆకులను పప్పుతో కలిపి వండుకుని తింటే చాలా మంచిది.





● మీకు తెలుసా?

బ్లాక్ సాల్ట్‌తో భలే ఉపయోగాలు

బీపీ సమస్య ఉన్నవారు రెగ్యులర్ ఉప్పుకు బదులుగా నల్ల ఉప్పును వాడాలి. దీంతో వంటల రుచి మారదు. పైగా ఉప్పు తిన్న ఫీలింగ్ కలుగుతుంది. అలాగే బీపీ కూడా తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు నల్ల ఉప్పును వాడితే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే రక్తం పలుచగా కూడా మారుతుంది. దీంతో రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టదు. ఫలితంగా హార్ట్ ఎటాక్‌లు రాకుండా ఉంటాయి. అలాగే నల్ల ఉప్పును తినడం వల్ల ఐరన్ బాగా లభిస్తుంది. దీంతో రక్తం బాగా తయారవుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. దీంతో పాటు సైనస్, దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ ఉప్పును వాడడం వల్ల షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. డయాబెటిస్‌ను నియంత్రించవచ్చు.కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఎముకలు దృఢంగా మారుతాయి. నిద్ర చక్కగా పడుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. అధిక బరువు తగ్గుతారు. కొవ్వు కరిగిపోతుంది. కిడ్నీ స్టోన్లు కరిగిపోతాయి. అలాగే శిరోజాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. కనుక సాధారణ ఉప్పుకు బదులుగా నల్ల ఉప్పును వాడడం అలవాటు చేసుకోవాలి. ఇక దీన్ని సాధారణ ఉప్పులాగే వాడుకోవచ్చు. లేదా రోజూ ఉదయం నిమ్మరసం నీళ్లలో కలిపి పరగడుపునే తీసుకోవచ్చు. లేదా తేనె నీళ్లతోనూ కలిపి తీసుకోవచ్చు. ఎలా తీసుకున్నా సరే బ్లాక్ సాల్ట్ మనకు మేలు చేస్తుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.